
పురాతనమైన సమస్తరోగాలకు

ఆయుర్వేద చికిత్స

మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతంలతోపాటు అన్ని రకాల రోగాలకు ఆయుర్వేదంతో వైద్యం చేయబడును.

శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము

నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895




# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :25 సంచిక :39 సంపాదకులు: కోటకొండ ఎల్ల విజయరాజు బుధవారం 17 జూన్ 2026 పేజీలు :12 వేల రూ5 /-


## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు రంగం సిద్ధం..



**యాదాద్రి భువనగిరి:**యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు రంగం సిద్ధమయింది. టెంటర్ల ప్రక్రియ ఈ నెల 12 న మొదలయింది. జూన్ 29వ తేదీన ముగియనుంది. జూలై 2వ తేదీన అధికారుఉ టెండర్లు ఓపెన్ చేయనున్నారు. మూడేళ్ల కాల పరిమితితో, రూ.255 కోట్ల వ్యయంతో పవర్ ప్లాంట్ నిర్వహించేందుకు టెండర్లు తెలంగాణ ప్రభుత్వం పిలిచింది.అయితే ప్రైవేటీకరణ చేస్తే ఆంధ్రా కంపెనీల చేతిలోకి వెళ్లిపోతుందని, ఆంధ్రా పెత్తనం పెరిగిపోతుందని 1300 మంది ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రైవేటీకరణను ఆపకపోతే తీవ్రమైన ఉద్యమాలకు సిద్ధమవుతామని వైటీపీఎస్ ఎంప్లాయిస్ జేఏసీ హెచ్చరిస్తోంది.

## బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లు అందుబాటులో ఉంచాలి

**: సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 16** : ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. రైతు వేదికలో విత్తనాలు అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. ఈరోజు(మంగళవారం) హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశం చేశారు. భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు.

**వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింత పెంచుకోవాలి..**

వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశించారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల



కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేంద్రప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు.

**కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి..**

రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎరువుల పరిస్థితిపైన అన్ని పార్టీల ఎంపీలతో ఓ సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.



## తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**: కేంద్ర మంత్రి బండి సంజయ్**

**కరీంనగర్, జూన్ 16:** తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మెట్రో ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన అవసరం కిషన్ రెడ్డికి లేదన్నారు. అర్థంలేని ఆరోపణలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ సర్టిఫికెట్ తమకు అవసరం లేదని వ్యాఖ్యానించారు. 'సర్' విషయంలో కాంగ్రెస్ గందరగోళం చేస్తోందని మండిపడ్డారు. బంగ్లాదేశ్ వాళ్లకు ఓటు ఇవ్వాలా అని ప్రశ్నించారు. ఇతర దేశాల వారి ఓట్లను తొలగించాలని కాంగ్రెస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని కేంద్ర మంత్రి నిలదీశారు.

**మావోయిస్టులు ఇక లేరు..**

మావోయిస్టులు చివరికి సాధించింది ఏంటి అని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. తుపాకీ గొట్టంతో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని.. అభం శుభం తెలియని మైనర్లు ప్రాణాలు కోల్పోయారన్నారు. చివరికి మావోయిస్టు సంస్థని నిషేధానికి గురయ్యేలా చేశారని వ్యాఖ్యానించారు. తుపాకీ గొట్టం ద్వారా ఏమీ సాధించలేమని మావోయిస్టు అగ్ర నేతలు కూడా గుర్తించారని.. కేంద్రానికి సహకరించి చాలామంది లొంగిపోయారన్నారు. మావోయిస్టులు ఇక లేరని అన్నారు.

## అటవీ ప్రాంతమైనా అక్షరాస్యతలో ములుగు ముందంజ..



**ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 50 సైకిళ్ల పంపిణీ**

**ములుగు:**కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో, రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో జిల్లా వ్యాప్తంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 50 సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి దనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి హాజరై విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ములుగు జిల్లా నిరక్షరాస్యత అధికంగా ఉన్న వెనుకబడిన జిల్లా అయినప్పటికీ జిల్లా అధికారులు, విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమిష్టి కృషి ఫలితంగా ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 99.30 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మొదటి స్థానం, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రంలో రెండో స్థానం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందని, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో 50 సైకిళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

## బిల్డర్లు అసోసియేషన్ చలో హైదరాబాద్ ను డ్రాప్ చేసుకోవాలి

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి**



**హైదరాబాద్:**దేశంలో తెలంగాణ రాష్ట్రంలో నే యాక్సిడెంట్స్ ఎక్కవ జరుగుతున్నాయి. పది ఏండ్ల లో కేసీఆర్ రోడ్ల అభివృద్ధి ని పట్టించుకోలేదు. బిల్డర్లు అసోసియేషన్ చలో హైదరాబాద్ ను డ్రాప్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. మూడు నెలల్లో సీఎం రేవంత్ తో మాట్లాడి బకాయిలు క్లియర్ చేయిస్తా అని వాళ్లకు హామీ ఇచ్చానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి ని దృష్టిలో పెట్టుకొని చలో హైదరాబాద్ ను విరమించుకోవాలని విజ్ఞప్తి చేసారు.మంత్రి - మిగతా3లో

## బీఆర్ఎస్‌ను ట్రాక్‌లోకి తెచ్చేందుకు బస్సు యాత్ర...


**హైదరాబాద్, జూన్ 16:**తెలంగాణ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మళ్లీ యాక్టివ్ కాబోతున్నారనే వార్తలు గులాబీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపుతున్నాయి. కేసీఆర్ త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టబోతున్నారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించడంతో పొలిటికల్ సర్కిల్స్‌లో సరికొత్త చర్చ మొదలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో



ఓటమి, ఆ వెంటనే జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బస్సు యాత్ర చేసినప్పటికీ పార్టీ ఖాతాలో ఒక్క సీటు కూడా పడకుండా జీరో ఫలితం రావడం కేసీఆర్‌ను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఆ దెబ్బతో దాదాపు రెండేళ్లకు పైగా ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. కేవలం ఇటీవల జరిగిన పార్టీ ప్లీనరీ, అలాగే జగిత్యాల లాంటి రెండు బహిరంగ సభల్లో మాత్రమే ఆయన - మిగతా3లో

## తెలంగాణలో,... విచారణల పాలిటిక్స్

**హైదరాబాద్, జూన్ 16:**తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ నేతలకు మధ్య పలు కేసుల విచారణకు సంబంధించి రాజకీయం జోరుగా సాగుతోంది. బీఆర్ ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ హయాంలో జరిగిన.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనంగా మారిందని..దీనిని సీబీఐతో దర్యాప్తు చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి లేఖ రాశారు. కానీ, దీనిపై ఇప్పటి వరకు అతీ గతీ లేదని, కేసీఆర్‌ను కాపాడుతున్నారని సీఎం రేవంత్ పలుసందర్భాల్లో ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ అధికారులు కొందరు ఈ కేసులో అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఎస్ఐబీ మాజీ ఉన్నతాధికారులు విదేశాలకు వెళ్లిపోవడంతో,



వారిపై రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయడానికి సీబీఐ ఇంటర్‌పోల్‌కు లేఖ రాసింది. ఫోన్‌ట్యాపింగ్ - మిగతా3లో

## కాంగ్రెస్ లో.... పదవుల పంచాయితీ

**హైదరాబాద్, జూన్ 16:**కాంగ్రెస్ పార్టీలో సీనియర్లలో అసంతృప్తి పెరుగుతుంది. ఇందుకు సీనియర్ నేత షబ్బీర్ ఆలి ఉదాహరణ. ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీని ఇబ్బందులకు గురి చేశాయి. కాంగ్రెస్ పార్టీలో పదవులను డబ్బులు ఇచ్చిన వారికే ఇస్తున్నారని షబ్బీర్ ఆలి తీవ్ర స్థాయిలో విమర్శించారు. కష్టించి పనిచేసిన నేతలకు కాకుండా అప్పటికప్పుడు పార్టీలోకి వచ్చి డబ్బులు ఇచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారని షబ్బీర్ ఆలి చేసిన ఆరోపణలు కాంగ్రెస్ పార్టీలో కాక రేపాయి. గత కొంత కాలంగా షబ్బీర్ ఆలి అసంతృప్తితో ఉన్నారు.తనను పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదని ఆయన భావిస్తున్నారు. పైగా కామారెడ్డి నియోజకవర్గంలో తనకు వ్యతిరేకంగా మరొక నేతను ప్రోత్సహించేందుకు సిద్ధమయ్యారని ఆయన భావిస్తున్నారు. గత కొంత కాలం నుంచి షబ్బీర్ ఆలి కి, చంద్రశేఖర్ రెడ్డి మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు



చేసుకంటున్నారు. ఈ ఇద్దరి మధ్య వివాదం నేపథ్యంలోనే షబ్బీర్ ఆలీ ఈ వ్యాఖ్యలు చేశారని ప్రత్యర్థి - మిగతా3లో

# సంపాదకీయం

## టాలీవుడ్ కు ఏమైంది...

తెలుగు సినీ పరిశ్రమ సంక్షోభంలో ఉంది. ఏడాదిగా నిర్మాతకు నికరంగా లాభాలు మిగిల్చిన సినిమా లేదంటే అతిశయోక్తి కాదు. వందల కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న సినిమాలు.. రిలీజ్ ఎప్పుడో తెలియని దుస్థితిలో ఉన్నాయి. దీంతో నిర్మాతకు రిలీజ్‌కు ముందే చుక్కలు కనిపిస్తున్నాయి. సినిమా షూటింగ్ ఏడాది జరిగితే.. సీజీ వర్క్‌కు రెండుమూడేళ్లు తీసుకుంటూ.. ఏళ్ల తరబడి సాగదీస్తున్నారు. అంత టైమ్ తీసుకున్న సినిమాలు కూడా రిలీజయ్యాక.. సీజీ వర్కా బాగాలేదనే టాక్ తొలిరోజే బయటికొస్తోంది. ఇలా వందల కోట్ల బడ్జెట్లు.. ఏళ్ల తరబడి షూటింగులతో సినిమా రిలీజ్ కు ముందే నిర్మాతలు మునిగిపోతున్న దుస్థితి టాలీవుడ్‌లో కనిపిస్తోంది. తెలుగు సినీ పరిశ్రమ ప్రస్తుతం సంక్షోభంలో పడింది. గడిచిన ఏడాదిలో అసలు హిట్ మాటే వినలేదంటున్నారు. ఇంకా మాట్లాడితే పుష్ప 2 తర్వాత నిర్మాతలకు నికరంగా డబ్బులు మిగిల్చిన సినిమా లేదని టాలీవుడ్ నిట్టూరుస్తోంది. సినీ పరిశ్రమలో చిన్న నిర్మాతలు ఎప్పుడో మునిగారు. పెద్ద నిర్మాతల స్థితి కూడా పైన పటారం. లోన లొటారంలా ఉంది. చివరకు అమెరికాలో సంపాదించిన డబ్బులతో సినిమాలు తీసే నిర్మాతలు కూడా మునిగిపోతున్నారు.తెలుగు సినీ పరిశ్రమలో మొదట్నుంచీ విజయాల శాతం తక్కువే. ఎన్నో లెక్కలు వేసుకుని.. ఎంతో జాగ్రత్తగా తీసే సినిమాలే ఆడతాయని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. అలాంటిది అసలు కనీస జాగ్రత్తలు తీసుకోకుండా.. గాల్లో లెక్కలు వేసుకుని తీసే సినిమాల గురించి చెప్పాల్సిన పనే లేదు. మొదట్లో కథల ఎంపిక కోసం ఏళ్ల తరబడి చర్చలు జరిగేవి. ఒకసారి కథ తయారయ్యాక కూడా 24 విభాగాల వారి సలహాలు తీసుకునేవారు. అలా బాగా నలిగిన, మార్పులు చేర్పులు చేసిన కథనే తెరకెక్కించేవారు. అలాగే కథకు తగ్గట్టుగా నటీనటుల ఎంపిక ఉండేది. కాంబినేషన్ల కోసం ఆరాటం, క్రేజ్ ఉన్న నటులే ఉండాలనే జంఝాటం ఏమీ ఉండేవి కాదు. పెద్ద హీరోలు అడిగినా కూడా.. ఈ కథ మీకు సరిపడదని నిర్మాతలు, దర్శకులు నిర్మొహమాటంగా చెప్పేసేవారు. ఎందుకంటే అప్పుడు కథే హీరో. సినిమాకే సింహాసనం. నటీనటులు, మిగతా వారికి ఎక్కువ ప్రాధాన్యత లేదు. ఆ రోజుల్లో ఓ సినిమాకు ప్రేక్షకుల ఆదరణ దక్కితే.. దాన్ని మిగతా భాషల్లోనూ డబ్ చేసేవారు. అప్పుడు డబ్బింగ్ రైట్స్ రూపంలోనూ డబ్బులొచ్చేవి. కొన్ని సినిమాలు నేరుగా పెట్టుబడి తేలేకపోయినా.. డబ్బింగ్ రైట్స్ తో నిర్మాతలు గట్టెక్కిన సందర్భాలున్నాయి. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితే లేదు. కాంబినేషన్ల కోసం విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు.తెలుగు సినిమాకు హంగులు, ఆర్భాటాలు చాలా ఎక్కువయ్యాయి. మార్కెట్ కూడా పెరిగిందని కొన్ని హిట్ సినిమాల కలెక్షన్లు చూపించి గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ ఏం మారినా.. విజయాల శాతం మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా ఉంది. ఏటా వందల సినిమాలు రిలీజ్ కావడమే కానీ.. డబ్బులు తెచ్చే సినిమాలు మాత్రం కనిపించడం లేదు. అడపాదడపా హిట్టయ్యే సినిమాల గురించి చెప్పుకోవడమే కానీ.. రెగ్యులర్‌గా లాభాలు మాత్రం రావడం లేదు. ఇప్పటికే సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల ప్రభావం చూచాయగా కనిపిస్తూనే ఉంది. కాకపోతే నిర్మాతలు మాత్రం కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది కాబట్టి.. పైన పటారం.. లోన లొటారం స్థితిని మెయింటైన్ చేస్తున్నారు. అమెరికాలో 10-20 ఏళ్ల పాటు డబ్బులు సంపాదించుకుని.. ఆ డబ్బులు పెట్టి సినిమాలు తీస్తున్న ఎన్నారై నిర్మాతలు కూడా నిండా మునుగుతున్నారు. వీరు మొదట పరిమిత స్థాయిలో సినిమాలు తీసి.. కాస్త లాభం కనిపించగానే.. నలుగురైదురు హీరోలు, డైరక్టర్లకు అడ్వాన్సులిచ్చి అడ్డంగా బుక్కైపోతున్నారు.ఒకప్పుడు స్క్రిప్ట్ పూర్తయ్యాక, నటీనటుల డేట్స్ అన్నీ కుదిరితేనే దర్శక-నిర్మాతలు సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేవారు. రానురానూ మార్పులు వచ్చాయి. షూటింగ్ మొదలయ్యే ముందు కూడా సన్నివేశాలు రాసుకుంటూ కూర్చోవడం వల్ల సినిమా వ్యయపెరిగిపోవడమే కాకుండా, నాణ్యతా దెబ్బతింటోందని సీనియర్ నటులు, రచయితలు వివిధ ఇంటర్వ్యూల్లో చెప్పారు. స్క్రిప్ట్ పూర్తయిన తర్వాత మరింత మెరుగు కోసం చిన్న చిన్న మార్పులు చేసుకోవచ్చు కానీ, అప్పటికప్పుడు కొత్త సన్నివేశాలు రాయడం కూడా నిర్మాణ వ్యయం పెరగడానికి కొన్నిసార్లు కారణమవుతోంది. ఇక సృజనాత్మకత పేరుతో దర్శకులు వేయించే సెట్లు, అనవసర హంగులు, విదేశీ ప్రయాణాలు.. ఇవన్నీ నిర్మాణ వ్యయాన్ని తడిసి మోపెడు చేస్తున్నాయి. ఇవన్నీ నిర్మాతలపై మోయలేని భారం మోపి.. అంతిమంగా టాలీవుడ్‌కి తీరని నష్టం చేస్తున్నాయి. సినీ పరిశ్రమకు ఎవరో పని గట్టుకుని నష్టాలు తేవడం లేదు. స్వయంగా చిత్ర పరిశ్రమే చేజేతులా సంక్షోభాన్ని కొనితెచ్చుకుంటోంది. ఇప్పటికే సగం మునిగింది. కనీసం ఇప్పటికైనా మేలుకోకపోతే.. నిండా మునిగే ప్రమాదం లేకపోలేదు. అనారోగ్యకర పోకడల్ని మొదట్లోనే తగ్గించుకునే ప్రయత్నం చేస్తే.. పరిస్థితి ఇక్కడదాకా వచ్చేది కాదు. కానీ పెడ ధోరణుల్ని ట్రెండ్ గా, కొత్త తరహా మార్కెటింగ్ సూత్రాలుగా చెప్పుకుని అదే ఒరవడిలో కొట్టుకుపోతున్నారు. ఎవరైనా సీనియర్లు సలహాలివ్వబోయినా.. వినిపించుకోవడం లేదు. అదేమంటే కాలం మారిందని చెబుతూ.. తెలుగు సినిమాని చేజేతులా చంపేయటానికి కంకణం కట్టుకున్నారు. కనీసం తెలుగు సినిమాల్ని ఓటీటీలు కూడా ఎందుకు కొనడం లేదని ఎవరూ ఆలోచించడం లేదు. ఇప్పటికైనా టాలీవుడ్ ఆత్మావలోకనం చేసుకోకపోతే.. రాబోయే రోజుల్లో తెలుగు సినీ పరిశ్రమ ఒకటుండేది అని చెప్పుకోవాల్సి వస్తుందేమో. అందుక ఇకనైనా ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకునే ప్రయాస మానేసి.. అందరూ కలిసి సమష్టి బాధ్యత తీసుకుంటే కానీ.. తెలుగు సినిమా పరిశ్రమ గాడిన పడే పరిస్థితి కనిపించడం లేదు.

# ఎన్డీయేకు మద్దతుగా టీఎంసీ రెబల్స్

**న్యూఢిల్లీ, జూన్ 16:**జాతీయ రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే నగ్న సత్యాన్ని నిరూపిస్తూ పశ్చిమ బెంగాల్ అధికార పక్షం తృణమూల్ కాంగ్రెస్ కు చెందిన సుమారు 20 మంది రెబల్ ఎంపీలు కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ప్రకటించడం సరికొత్త సంచలనానికి తెరలేపింది. వారు ఎన్డీయేలో అధికారికంగా విలీనమవుతారా లేక బయట నుండి మద్దతు ఇస్తారా అనేది పక్కన పెడితే.. కేంద్ర ప్రభుత్వానికి 20 మంది ఎంపీల అదనపు బలం లభించడం ఖాయమైంది. ఈ పరిణామం ఢిల్లీ పీఠాన్ని మరింత సుస్థిరం చేయడమే కాకుండా, కూటమిలోని ఇతర ప్రాంతీయ పార్టీలపై, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడి ప్రాధాన్యతపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న దానిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. కేంద్రంలో బీజేపీకి సొంతంగా పూర్తి మెజారిటీ లేని ప్రస్తుత పరిస్థితుల్లో, ప్రభుత్వ మనుగడకు చంద్రబాబు , నితీష్ కుమార్ అత్యంత కీలకంగా మారారు. కింగ్ మేకర్లుగా ఉన్న వీరిద్దరి డిమాండ్లకు లొంగుతూనే మోదీ-షా ద్వయం ఇన్నాళ్లూ బండిని లాగాల్సి వచ్చింది. అయితే, ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఊహించని విధంగా 20 మంది ఎంపీల మద్దతు లభించడంతో కేంద్రంలో ఎన్డీయే నెంబర్ గేమ్ పూర్తిగా మారిపోయింది. చంద్రబాబు , నితీష్ కుమార్ లలో ఎవరైనా ఒకరు మద్దతు ఉపసంహరించుకున్నా ప్రభుత్వానికి ఎలాంటి ఢోకా ఉండదనే బలమైన భరోసా ఇప్పుడు బీజేపీ అధిష్టానానికి దక్కింది. ఈ సమీకరణం సహజంగానే కూటమిలో బీజేపీ బేరసారాల శక్తిని పెంచుతుంది. లోక్‌సభలో అదనంగా 20 మంది ఎంపీల బలం తోడవడంతో.. మిత్రపక్షాల వీటో పవ



గణనీయంగా తగ్గింది. ఇది మోదీ, అమిత్ షాలకు రాజకీయంగా పెద్ద ఊరట.ఈ అనుమానాలు రాజకీయ వర్గాల్లో తలెత్తుతున్నాయి. చంద్రబాబు ప్రాధాన్యత పూర్తిగా తగ్గిపోతుందని చెప్పలేం కానీ, గతంలో ఉన్నంత లీవరేజ్ మాత్రం ఇకపై ఉండకపోవచ్చు. రాష్ట్రానికి సంబంధించిన ప్రత్యేక నిధులు, పోలవరం బడ్జెట్, అమరావతి గ్రాంట్ల విషయంలో చంద్రబాబు కేంద్రంపై గతంలో చూపించినంత ఒత్తిడిని ఇకపై ప్రదర్శించడం అంత సులువు కాదు. ఎందుకంటే, కేంద్రంపై ఒత్తిడి మితిమీరితే.. ప్రత్యామ్నాయంగా తమకు టీఎంసీ ఎంపీల మద్దతు ఉందనే సంకేతాన్ని మోదీ, షా ఇవ్వడానికి వెనుకాడరు. అయితే, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల దీర్ఘకాలిక ఆలోచనలు వేరేలా ఉన్నాయి. వారు చంద్రబాబును అంత తేలికగా దూరం చేసుకోరని ఇండస్ట్రీ ఇన్సైడర్స్ అభిప్రాయపడుతున్నారు. చంద్రబాబు నమ్మకమైన, క్రమశిక్షణ కలిగిన మిత్రపక్షంగా ఉన్నారు. దానికి భిన్నంగా, పశ్చిమ బెంగాల్ నుంచి వస్తున్న టీఎంసీ ఎంపీల మద్దతు తాత్కాలిక అవసరాల కోసమో, మమతా బెనర్జీతో విభేదాల వల్లో పుట్టుకొచ్చిందే తప్ప, సిద్ధాంతపరమైనది కాదు. రేపు ఏదైనా తేడా వస్తే వారు మళ్లీ ప్లేట్ మార్చే ప్రమాదం ఉంది. కాబట్టి, నమ్మకమైన చంద్రబాబును పూర్తిగా పక్కన పెట్టి, అస్థిరమైన టీఎంసీ శ్రేణులపై బీజేపీ పూర్తిగా ఆధారపడే సాహసం చేయదు. ఈ జాతీయ పరిణామాలు ఆంధ్రప్రదేశ్ అంతర్గత రాజకీయాలపై కూడా ఖచ్చితంగా ప్రభావం చూపిస్తాయి. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ఈ అంశాన్ని అస్త్రంగా మార్చుకునే ప్రయత్నం చేస్తోంది. ఇకపై ఢిల్లీలో చంద్రబాబును మోదీ ప్రభుత్వం పట్టించుకోదు అంటూ ఇప్పటి నుంచే ప్రచారం ప్రారంభించింది. అయితే, చంద్రబాబుకు ఉన్న ఇమేజ్, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయనకు ఉన్న విజన్ దృష్ట్యా.. ఆయన కేంద్రంతో ఘర్షణ వైఖరి పెట్టుకోకుండా, మరింత చాకచక్యంగా దౌత్యనీతిని ఉపయోగించి ఏపీకి రావలసిన హక్కులను సాధించుకుంటారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. టీఎంసీ ఎంపీల మద్దతు వల్ల ఎన్డీయే కూటమిలో బీజేపీ సీటు కాస్త గట్టిపడిందనేది పచ్చి నిజం. చంద్రబాబుపై ఆధారపడే పరిస్థితి గతంతో పోలిస్తే మోదీ-షాలకు కాస్త తగ్గింది. కానీ, పారదర్శకమైన పాలనలో చంద్రబాబు వంటి సీనియర్ లీడర్ భాగస్వామ్యం ఎన్డీయే ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో ఒక బ్రాండ్ వాల్యూని ఇస్తుంది. కాబట్టి చంద్రబాబు హోదాను తగ్గించడం కంటే.. మిత్రపక్షాలన్నింటినీ సమతూకం చేస్తూనే, తమ సొంత ఎజెండాను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లడానికే మోదీ-షా ద్వయం ఈ కొత్త నెంబర్లను వాడుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

# ఉద్ధవ్ శివసేనలో మరో చీలిక

**ముంబై, జూన్ 16:**మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా అలజడి రేగింది. అంతా బాగుంటుందనుకున్న సమయంలో మాజీ సీఎం, శివసేన (యూబీటీ) ఉద్ధవ్ ఠాక్రే కి సొంత పార్టీ ప్రజా ప్రతినిధులే షాక్ ఇచ్చారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, శివసేన నుంచే విడిపోయిన వేరు కుంపటి పెట్టుకున్న ఏకనాథ్ షిండేతో ఉద్ధవ్ వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు రహస్యంగా భేటీ అయ్యారు. దీంతో ఉద్ధవ్ ఠాక్రేకి ఝలక్ తగిలినట్టైంది.దీంతో ఉద్ధవ్ వెంటనే అలర్ట్ అయ్యారు. తన నివాసంలో తన వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులందరితో కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. తన పార్టీ చీలుతోందన్న గట్టి అనుమానం రావడంతో వెంటనే కీలక సమావేశం నిర్వహిస్తున్నారు.ఆపరేషన్ టైగర్"లో భాగంగా, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలోకి కొందరు ఎంపీలు మారవచ్చన్న ఊహాగానాల మధ్య ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే.. ఈ భేటీలో రాజకీయం లేదని, అంత ప్రాధాన్యత భేటీ కూడా కాదని డిప్యూటీ సీఎం షిండే కొట్టిపారేశారు.అయితే, మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ లోని అసమ్మతి వర్గం బీజేపీకి మద్దతు



ప్రకటించడంతో, కేంద్రంలో రాజకీయ సమీకరణాలు గణనీయంగా మారే అవకాశం ఉంది. తమకు 20 మంది ఎంపీల మద్దతు ఉందని ఆ అసమ్మతి వర్గం పేర్కొంటోంది.ఈ భయం కూడా ఉద్ధవ్ కి వున్నట్లు పుకార్లు వస్తున్నాయి.మహారాష్ట్రలో కొత్త రాజకీయ పరిణామాలకు సంబంధించిన ఊహాగానాలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో, ఈ సమావేశాన్ని ఆ సంస్థ యొక్క విశ్వసనీయతను మరియు అంతర్గత ఐక్యతను అంచనా వేసే ప్రయత్నంగా భావిస్తున్నారు; ఎందుకంటే, ఖదీకి చెందిన తొమ్మిది మంది లోక్‌సభ సభ్యులలో ఏడుగురు షిండేతో సంప్రదింపులు జరుపుతున్నారని మరియు శివసేనలో చేరడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారని వార్తలు వస్తున్నాయి.జూన్ 7న న్యూఢిల్లీలో షిండేతో ఆ ఎంపీలు సమావేశమయ్యారని, అప్పుడు వారికి శివసేనలో చేరే ప్రతిపాదన చేశారని సమాచారం. ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తూ, 'ఆపరేషన్ టైగర్' దాదాపు పూర్తయ్యే దశకు చేరుకుందని కేంద్ర మంత్రి మరియు శివసేన ఎంపీ ప్రతాప్‌రావు జాదవ్ ప్రకటించారు.ప్రస్తుతం లోక్‌సభలో షిండే నేతృత్వంలోని శివసేనకు ఏడుగురు సభ్యులు ఉన్నారు; భారతీయ జనతా పార్టీ, తెలుగుదేశం పార్టీ మరియు జనతాదళ్ (యునైటెడ్) తర్వాత నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్‌లో ఇది మూడవ అతిపెద్ద భాగస్వామ్య పక్షంగా ఉంది.ఒకవేళ ఖదీకి చెందిన ఏడుగురు ఎంపీలు షిండే సేనలో చేరాలని నిర్ణయించుకుంటే, అది పార్టీ చీలికకు దారితీయడంతో పాటు దిగువ సభలో చీణూ బలాన్ని పెంచుతుంది.

# మళ్లీ అఖండ కాంగ్రెస్..

ప్రధాని నరేంద్ర మోదీని, ఎన్డీయే ఎదుర్కోడానికి కాంగ్రెస్ భారీ స్కెచ్ వేస్తోంది. "అఖండ కాంగ్రెస్" దిశగానే అడుగులు వేస్తోంది. ప్రాంతీయ పార్టీలను కాంగ్రెస్ లో విలీనం చేయాలన్న ప్రతిపాదనలు పంపుతోంది. దీంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి బయటకువెళ్లి, పార్టీలు పెట్టిన నేతలను సొంతగూటికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలను మొదలు పెట్టింది. నేతలే కాదు, పార్టీలు సైతం విలీనానికి ప్రాథమిక దశలో సానుకూలంగా వుంటూ, చర్చలు సాగిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ లో కలిపేసి, బలమైన శక్తిగా మారాలని ఆ ప్రాంతీయ పార్టీల నేతలు ఆలోచనలో వున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించిన చర్లు కూడా కొనసాగుతున్నాయి.మొదట ఈ విలీన ప్రతిపాదన తృణమూల్ కాంగ్రెస్ తో ప్రారంభమైంది.బెంగాల్ లో ఓటమి పాలైన తర్వాత, మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ లో తిరుగుబాటు బావుటా ఒక్క సారిగా పైకి వచ్చేసింది. ఏకంగా 20 మంది తాము ఎన్డీయేలో చేరేందుకు సిద్ధంగా వున్నామని ఎంపీలు ప్రకటించారు. దీంతో తృణమూల్ కాంగ్రెస్ లో వివాదం రేగింది. అలాగే అభిషేక్ బెనర్జీ చుట్టూ వివాదాలు చుట్టుకున్నాయి. అంతలోనే ఢిల్లీలో ఇండియా కూటమి సమావేశం కూడా జరిగింది. కొన్ని రోజులుగా ఇండియా కూటమి సమావేశాలకు మమతా దూరంగా వుంటూ వస్తున్నారు. ఎప్పుడైతే బెంగాల్ లో ఓడిపోయారో, ఇండియా కూటమి సమావేశానికి హాజరయ్యారు.ఇంతలోనే తృణమూల్ ను కాంగ్రెస్ లో కలిపేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. దీని ద్వారా ఇరు పార్టీలకు కూడా లాభం చేకూరుతుందని, ఇందుకు సోనియా, ప్రియాంక, రాహుల్ డీల్ చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. అంతలోనే సోనియా, మమత భేటీ కూడా జరిగింది. అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కోడానికి విలీనం చేయాలని భావించారు. గతంలో కాంగ్రెస్ నుంచి విడిపోయి పార్టీ పెట్టుకున్న వారంతా తిరిగి కాంగ్రెస్ లో విలీనం చేయాలన్న ప్రతిపాదనలు జోరందుకున్నాయి. తాజాగా మరో వార్త కూడా హల్ చల్ చేస్తోంది. ఎన్సీపీ శరద్ పవార్ కూటమి కూడా కాంగ్రెస్ లో విలీనం అయ్యే అవకాశాలు వున్నట్లు వార్తలు వస్తున్నాయి. 1999 లో కాంగ్రెస్ తో విభేదించి శరద్ పవార్ ఎన్సీపీని స్థాపించారు. సోనియా గాంధీ విదేశీయతను పవార్ ప్రశ్నించడంతో కాంగ్రెస్ బహిష్కరించింది. అలాగే సంగ్మా, తారీఖ్ అన్వర్ ను కూడా బహిష్కరించారు. వీరు ముగ్గురు కలిసి ఎన్సీపీని స్థాపించారు. టీఎంసీ మాదిరిగానే ఎన్సీపీలోనూ సంక్షోభం వుంది. అజిత్ పవార్ నాయకత్వంలో తిరుగుబాటు బావుటా ఎగరేశారు.



దీంతో పార్టీ చీలిపోయింది. అయితే విలీన ప్రతిపాదన తమ వద్దకు రాలేదని సుప్రియా సూలే ప్రకటించారు. తాము కూడా అలా అనుకోవడం లేదని ప్రకటించారు. అలాగే మరి కొందరు కూడా కాంగ్రెస్ లో విలీనం అవ్వాలని కాంగ్రెస్ ప్రతిపాదనలు పంపింది. మరో వైపు న్ని రోజులుగా తృణమూల్ పార్టీ కాంగ్రెస్ లో విలీనం అయిపోతోందన్న వార్తలు భారీగా చక్కర్లు కొడుతున్నాయి. ఈ మేరకు మమతా బెనర్జీ కాంగ్రెస్ అగ్రనేత సోనియాతో కూడా భేటీ అయ్యారు. దీంతో ఈ వార్తకు మరింత ఊతమిచ్చింది. అయితే దీనిపై కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందించారు. విలీనంపై వస్తున్న వార్తలన్నీ పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ ఇద్దరూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీని కలిసిన మాట వాస్తవమేనని అంగీకరించారు. అది ఓ సాధారణ సమావేశమేనని స్పష్టం చేశారు. అసలు విలీనం గురించి చర్చలే జరగలేదన్నారు.కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ కార్యాచరణను స్వతంత్రంగా కొనసాగిస్తోందని, టీఎంసీ కూడా తన పార్టీ విధానాల ప్రకారమే ముందుకు సాగుతోందని తెలిపారుకాంగ్రెస్ పార్టీలో వైసీపీ విలీనం అని కొందరు లేదు ఇండియా కూటమిలో చేరి కాంగ్రెస్ తో పొత్తులు పెట్టుకుంటారు అని మరి కొందరూ ఇలా రకరకాలైన ప్రచారం చేస్తున్నారు. అయితే ఏపీలో పొలిటికల్ సన్నివేశం పూర్తిగా వేరు అని గుర్తు చేస్తున్నారు. జగన్ ఆలోచనలు ఆయన మనస్తత్వం కాంగ్రెస్ ని జగన్ వీడిన సందర్భం ఇవన్నీ గుర్తు చేసుకుంటున్న వారు మాత్రం వైసీపీ ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ లో విలీనం అయ్యే ప్రసక్తి లేదని అంటున్నారు. ఏపీలో ఈ రోజుకీ ఒంటరిగానే 40 శాతం ఓటు షేర్ ని సాధించి రేపటి ఎన్నికల్లో గెలిచే పార్టీగా ముద్ర ఉన్న వైసీపీకి కాంగ్రెస్ ని కౌగిలించుకోవడం అవసరమా అన్న ప్రశ్న కూడా రాజకీయ విశ్లేషకులు పలువురు వేస్తున్నారు.ఏపీ రాజకీయాలలో చూస్తే కనుక జగన్ ఒంటరిగానే ఉండేందుకు ఇష్టపడుతున్నారు అని అంటున్నారు. జాతీయ స్థాయిలో బీజేపీకి సందర్భానుసారం విధానాల ప్రాతిపదికన అంటూ బిల్లులకు వైసీపీ మద్దతు ఇస్తోంది. ఆ విధంగా బీజేపీ పెద్దల వద్ద వైసీపీ గుడ్ విల్ సంపాదించుకుంది. అందుకే ఏపీలో టీడీపీ కూటమి మీద ధీటుగా పోరు చేస్తోంది అని అంటున్నారు. ఇక 2029 లో బీజేపీ టీడీపీ జనసేన కూటమిగా వచ్చినా కూడా వైసీపీ ఒంటరిగానే పోరుకు సిద్ధపడుతుందని చెబుతున్నారు. జనాలు నచ్చకపోతే కూటములను అయినా ఓడిస్తారు అన్నది దేశంలో చాలా ఎన్నికలు నిరూపించాయని కూడా వైసీపీ నేతలు అంటున్నారు. పైగా వైసీపీకి చెక్కు చెదరని ఓటు బ్యాంక్ 40 పర్సెంట్ ఉందని మరో పది శాతం తెచ్చుకుంటే అధికారం సొంతం అవుతుందని కూడా లెక్క వేస్తున్నారు. ఇక 2029 ఎన్నికలు చూస్తే కచ్చితంగా ఏ కూటములకు పూర్తి స్థాయిలో మెజారిటీ దక్కే సీన్ ఉండదని కూడా అంటున్నారు. బీజేపీని మూడు సార్లు చూసిన జనాలు ఈసారి పూర్తిగా ఏకపక్షంగా నెత్తికెత్తుకోరు అని అంటున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి బలం పెరిగినా కూడా మ్యాజిక్ ఫిగర్ కి దగ్గరగా రాలేరని అంటున్నారు. దాంతో న్యూట్రల్ గా ఉండే పార్టీలకు ఆ ఎన్నికల తరువాత డిమాండ్ పెరుగుతుందని అపుడు వైసీపీ లాంటి పార్టీలే కీలకంగా జాతీయ స్థాయిలో మారుతాయని కూడా ఫ్యాన్ పార్టీ నేతలు లెక్క వేస్తున్నారు. : ఈ క్రమంలో వైసీపీ అన్ని ఆప్షన్లూ ఓపెన్ గా ముందు పెట్టుకుంటుంది అని అంటున్నారు. అంతే తప్ప పొత్తుల పేరుతో ముందే కమిట్ అయిపోతే ఆ తరువాత కీలక నిర్ణయాలు తీసుకునే చాన్స్ కోల్పోతామని అంటున్నారు. ఏపీలో ఎలా చూసుకున్నా కాంగ్రెస్ అయితే ఈ రోజుకీ లేదని అంటున్నారు. మరో మూడేళ్ళలో కూడా అద్భుతాలు జరిగి కాంగ్రెస్ ఎదుగుతుందని కూడా ఎవరూ అనుకోవడం లేదని అంటున్నారు. అందువల్ల కాంగ్రెస్ తో పొత్తులు కానీ విలీనాలు కానీ వైసీపీకి అవసరం లేదని అంటున్నారు. పైగా జగన్ ని నాడు కాంగ్రెస్ అగ్రనాయకత్వం అవమానించిందని అందుకే బయటకు రావాల్సి వచ్చిందని అంటున్నారు. ఇక జగన్ మీద నాడు సీబీఐ కేసులు పెట్టడంతోనే ఆయన పదహారు నెలల పాటు జైలు జీవితాన్ని అనుభవించాల్సి వచ్చిందని కూడా గుర్తు చేస్తున్నారు. మొత్తానికి చూస్తే వైసీపీ కాంగ్రెస్ అనేది కలవడం అంటే అది ఇప్పట్లో జరిగేది కాదని అంటున్నారు ఒకవేళ 2029 ఎన్నికల తరువాత కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమి అధికారానికి దగ్గరగా వస్తే కనుక అపుడు ఆలోచించే వీలు ఉందని కూడా అంటున్నారు. సో ప్రస్తుతానికి వస్తున్నవి అన్నీ ఊహాగానాలే అని కూడా అంటున్నారు.

# సింగూరు డ్యామ్ కు డేంజర్ బెల్స్...

**మెదక్, జూన్ 16:** ఉమ్మడి మెదక్ జిల్లా వ్యవసా య రంగానికి వెన్నెముకగా, హైదరాబాద్ జంట నగరాల దాహార్తిని తీర్చే ప్రధాన వనరుగా ఉన్న సింగూరు మల్టీపర్పస్ ప్రాజెక్టు (మంజీరా నది) ప్రస్తుతం అత్యంత కీలకమై న దశను ఎదుర్కొంటోంది. ప్రాజెక్టు భద్రతపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ప్రస్తుతం రిజర్వాయర్‌లో యుద్ధప్రాతిపదికన మరమ్మ తులు సాగుతున్నాయి.అయితే సింగూరు ప్రాజెక్టు మరమ్మతు పను ల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, పనుల మందగమనంపై క్షేత్రస్థాయిలో తీవ్ర అసం తృప్తి వ్యక్తమవుతోంది. ఇటీవల ఎన్‌డీఎస్‌ఏ ఉన్నతాధికారుల తనిఖీల్లో కూడా స్పష్టమైంది. మార్చిలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి చెందిన ఉన్నత స్థాయి నిపుణుల బృందం సింగూరు ప్రాజెక్టును నేరుగా సందర్శించి, సాగుతున్న పనులను పరిశీలించింది. ఆ సమయంలో కాంట్రాక్టర్ వ్యవహరించిన తీరుపై వారు తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రాజెక్టు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంటే, కాంట్రాక్టర్ క్షేత్రస్థాయిలో కేవలం ఒక్క జేసీబీ, ఒక ట్రక్కును మాత్రమే ఉపయోగించి పనులు చేయడంపై అధికారులు తీవ్రస్థాయిలో మండిపడినట్లు తెలిసింది. రిజర్వాయర్ ఎర్త్ డ్యాం లోపలి భాగంలో ఎక్కడైతే రివిట్‌మెంట్ తీవ్రంగా దెబ్బతిని బుంగలు పడ్డాయో, అక్కడ మొదట పనులు ప్రారంభించాల్సింది పోయి.. డ్యాంకు ఒక చివర నుంచి సాధారణ పద్ధతిలో పనులు చేపట్టడంపై నిపుణులు తప్పుపట్టారు. అయితే కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతోనే పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం సీజన్‌లో ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో కాకుండా కేవలం 15 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. సింగూరు ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, రివిట్‌మెంట్‌లో ఏర్పడిన బుంగలు, లీకేజీల కారణంగా రక్షణ చర్యల్లో భాగంగా నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం మరమ్మతు పనుల కోసం నీటి నిల్వను గతంలో 8 టీఎంసీలకు తగ్గించగా, వేసవి అవసరాల తర్వాత ప్రస్తుతం అది మరింత పరిమితమయ్యే అవకాశం ఉంది. ఈ వానాకాలంలో కర్ణాటక, మహారాష్ట్ర క్యాచ్‌మెంట్ ఏరియాల



నుంచి భారీగా వరద నీరు వచ్చినా.. రక్షణ దృష్ట్యా 15 టీఎంసీలకు మించి నిల్వ చేయకుండా మిగిలిన నీటిని గేట్లు ఎత్తి దిగువకు వదలాలని నిర్ణయించారు. డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ (డీఎస్ఆర్పీ) హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఈ పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రాజెక్టు ఆధునికీకరణ, గేట్లు, హోయిస్ట్ పరికరాలు, స్టాప్ లాగ్ ఎలిమెంట్స్, గ్యాంట్రీ క్రేన్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం సుమారు రూ. 22 కోట్ల నిధులు మంజూరు చేయగా, పనులు చేపట్టారు. అలల తాకిడికి దెబ్బతిన్న రిజర్వాయర్ లోపలి భాగంలోని పాత రివిట్‌మెంట్లు తొలగించి, రాళ్లతో కొత్తగా పటిష్టమైన నిర్మాణాలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌలి, మాదాపూర్, మణికొండ వంటి పశ్చిమ ప్రాంతాలకు సింగూరే ప్రధాన తాగునీటి వనరు. వేసవిలో నీటి నిల్వలు తగ్గినప్పటికీ, హైదరాబాద్ జలమండలి ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటి సరఫరాను క్రమబద్ధీకరించింది. ఈ సీజన్‌లో నిల్వ చేయబోయే 15 టీఎంసీల నీరు జంట నగరాల తాగునీటి అవసరాలకు (ఏడాదికి దాదాపు 4 టీఎంసీలు అవసరం), పరిశ్రమలకు పూర్తిగా సరిపోతుంది. దీంతో హైదరాబాద్ తాగునీటి సరఫరాకు ఎలాంటి ముప్పు లేదని అధికారవర్గాలు చెపుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యపు పనులపై వివరణ కోరేందుకు ఇరిగేషన్ శాఖ డీఈని సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.వానాకాలం సీజన్ ముంచుకొస్తున్న వేళ.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు మరింత ఆలస్యమైతే సాగు, తాగునీటి సరఫరాపై ప్రభావం పడనుంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అధికారికంగా దాదాపు 40 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ ప్రాజెక్టు నీరందిస్తున్నప్పటికీ సుమారు 80వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని 15 టీఎంసీలకే పరిమితం చేస్తున్నందున, వానాకాలం సాగునీటి విడుదలపై ప్రభావం ఉండే అవకాశం ఉంది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వచ్చే వరద నీటిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ పంటలకు నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ శాఖ భావిస్తోంది. అయితే పూర్తి నిల్వ లేకపోవడం వల్ల రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మరమ్మతు పనులు నత్తనడకన కొనసాగడంతో వానాకాలం సీజన్‌లో క్రాప్ హాలిడే ప్రకటించే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలకు మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. పనులు పూర్తి కాకపోతే ఈ వానాకాలం వరదలు వచ్చినా రక్షణ దృష్ట్యా కేవలం 15 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ ఉంచగగుతారు.మిగిలిన నీటిని వృథాగా దిగువకు వదలాల్సి వస్తుంది. ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరికలు, ప్రభుత్వం నుండి వచ్చిన ఒత్తిడితో ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రస్తుతం కాంట్రాక్టర్‌పై నిఘా పెంచారు. యంత్రాల సంఖ్యను, కూలీల సంఖ్యను పెంచి వర్షాకాలం ఉధృతి పెరగక ముందే ప్రధాన పనులను ఒక కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిసింది. సింగూరు ప్రాజెక్టుపై కొన్ని చోట్ల జరుగుతున్న పనుల నాణ్యత ఎన్‌డీఎస్‌ఏ ప్రమాణాలమేరకు చేపట్టడంలేదని అధికారులు హెచ్చరించారు. ఈ నిర్లక్ష్యంపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు రక్షణ విషయంలో రాజీ పడబోమని, కాంట్రాక్టర్లు ఒకే సీజన్ లోపల పనులన్నీ పూర్తిచేయాలని కఠినంగా ఆదేశించారు.పనులను వేగవంతం చేయకపోతే క్రాప్ హాలిడే (పంటల విరామం) ప్రకటించాల్సి వస్తుందని, అది రైతులకు నష్టం కలిగిస్తుందని కాంట్రాక్టర్‌ను, స్థానిక ఇరిగేషన్ అధికారులను హెచ్చరించారు. నీటి అడుగున ఎక్కడైనా పగుళ్లు లేదా లీకేజీలు ఉన్నాయా అని తెలుసుకోవడానికి సోనార్ పరీక్షలు, అండర్ వాటర్ సర్వేలు త్వరితగతిన నిర్వహించాలని మంత్రి సూచించారు.

# శ్రీ కనక దుర్గమ్మకు అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీర సమర్పణ

## సిరిసిల్ల చేనేత కళారత్న విజయ్ కుమార్ అద్భుత సృష్టి..

## వారం రోజులు శ్రమించి 200 గ్రాముల బరువుతో రూపకల్పన

**ఇంద్రకీలాద్రి, 16 జూన్:** తెలంగాణ రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ చేనేత కళాకారుడు, 'చేనేత కళా రత్న' అవార్డు గ్రహీత నల్ల విజయ్ కుమార్ మంగళవారం నాడు ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానాన్ని సందర్శించారు. తన తండ్రి, ప్రముఖ చేనేత శిల్పి అవార్డు గ్రహీత స్వర్గీయ నల్ల పరంధాములు గారి స్ఫూర్తితో, వారి అడుగుజాడల్లో నడుస్తూ తాను ప్రత్యేకంగా నేసిన అత్యంత విలక్షణమైన పట్టుచీరను శ్రీ కనకదుర్గమ్మవారికి అలంకరణ చేయవలసినదిగా ఆలయ ఈవో వికె శీనా నాయక్ కు అందజేశారు.

**'అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీర' ప్రత్యేకతలు:**

చేనేత రంగానికే మచ్చుతునకగా నిలిచిన ఈ పట్టుచీరను విజయ్ కుమార్ వారం రోజుల పాటు రాత్రింబవళ్లు శ్రమించి మగ్గంపై అద్భుతంగా మలిచారు. పరిమాణం ఎ బరువు: ఈ అద్భుత పట్టుచీర పొడవు 5.5 మీటర్లు (ఐదున్నర మీటర్లు), వెడల్పు 48 ఇంచులు ఉంటుంది. ఇంత పెద్ద పరిమాణం ఉన్నప్పటికీ, దీని బరువు కేవలం 200 గ్రాములు మాత్రమే




కావడం విశేషం.ఈ పట్టుచీరను సాంప్రదాయ, ఆకర్షణీయమైన 'ఇక్కత్ డిజైన్' **(Ikkat Design)** వచ్చేలా అత్యంత నైపుణ్యంతో రూపొందించారు.ఈ చీరను మడతపెడితే సులభంగా ఒక చిన్న అగ్గిపెట్టెలో ఇమిడిపోతుంది. ఈ సందర్భంగా చేనేత కళాకారుడు నల్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ.. "గతంలో నేను తయారు చేసిన ప్రతి సరికొత్త చేనేత సృష్టికి ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆశీస్సులు లభించాయి. ఎల్లప్పుడూ దుర్గమ్మ తల్లి దీవెనలు మాపై ఉండాలని కోరుకుంటూ ఈ సరికొత్త పట్టుచీరను సమర్పించి, అమ్మవారి కృపకు పాత్రులం కావడం ఎంతో సంతోషంగా ఉంది. గతంలో మేము 'ఆపరేషన్ సింధు' పేరిట అద్భుతమైన శాలువను తయారు చేసి భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారికి అందించి, వారి చేతుల మీదుగా ఘనమైన ప్రశంసలు పొందాము. ప్రధాని ప్రశంసలు పొందిన అదే స్ఫూర్తితో, చేనేత కళా వైభవాన్ని చాటుతూ ఈ చీరను రూపొందించడం జరిగింది.అమ్మవారికి సమర్పించిన ఈ అద్భుతమైన చేనేత కళాఖండాన్ని ఆలయఈవో శీనానాయక్ పరిశీలించి,అసాధారణ ప్రతిభ చూపిన చేనేత కళాకారుణ్ణి ప్రశంసించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న రీతిగా మన సంప్రదాయకళలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని శీనానాయక్ కోరారు.

# నాకు సీఎం రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదు: కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ, జూన్16:** తెలంగాణ అభివృద్ధిపై తమకు చిత్తశుద్ధి ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో అంశంలో బీజేపీపై బురదజల్లుతున్నారంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కిషన్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1కు కేంద్రం రూ.1250 కోట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. దేశంలో మెట్రో రైలు ఫేజ్ 2, 3లకు ఎలా సహకరిస్తున్నామో.. హైదరాబాద్‌కూ అలాగే కేంద్రం సహకరిస్తోందని తెలిపారు. మెట్రో రైలు ప్రాజెక్టు ఆపాలని తానేందుకు చెబుతానంటూ కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా అసహనం వ్యక్తం చేశారు. తాను వద్దంటే ఎక్కడా ప్రాజెక్టులు ఆగవన్నారు. తానెప్పుడూ తెలంగాణ ప్రయోజనాల కోసమే పని చేశానన్నారు. తెలంగాణలో కేంద్రం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో రూ. లక్షా 75 వేల కోట్లతో రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. తెలంగాణ అభివృద్ధి తమ బాధ్యత అని ఆయన పునరుద్ఘాటించారు. తనపై సీఎం రేవంత్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన అనాలోచితంగా మాట్లాడుతున్నారన్నారు. తమకు రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని చెప్పారు. అభివృద్ధి అంశంలో తమకు పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నేతలకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. తాను సీఎం రేవంత్‌కు కాదు.. ప్రజలకు జవాబుదారీని అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.



తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తాను పోరాటం చేశానని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఢిల్లీకి రెండుసార్లు తాను వచ్చి ధర్నా చేశానన్నారు. బిల్లు ఆమోదం పొందాకే ఆమరణ దీక్షను తాను విరమించానని వివరించారు. రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్.. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖలు రాశానని తెలిపారు. రేవంత్ రెడ్డి కోరితేనే తాను అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు.మెట్రో విస్తరణ కోసం చురుగ్గా పనిచేయాలని.. గతంలోనే సీఎం రేవంత్‌కు లేఖ రాసిన విషయాన్ని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. రేవంత్ అనుకుంటేనే.. నేను అడ్డుకుంటేనో ప్రాజెక్టులు ఆగవని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అలా చేస్తుందేమో.. కానీ బీజేపీ మాత్రం అలా చేయదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు.

# బిల్డర్ల అసోసియేషన్ చలో హైదరాబాద్ ను డ్రాప్ చేసుకోవాలి

- మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ బిల్డర్ల సమ్మె ను విరమించుకుంటారని నమ్మకం ఉంది. సీనియారిటీ ప్రకారం చిన్న కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించాము. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి పట్టించుకోలేదు. కేసీఆర్ హయాంలో 8వేల కోట్ల బకాయిలు పెండింగ్ లో పెట్టారు. టీమ్స్ ఆసుపత్రి తో కలిపి 10వేల కోట్ల బకాయి ఉంది. యాదగిరిగుట్ట లో కూడా 350 కోట్ల బకాయి ఉంది. ఇప్పటి 3వేల కోట్ల బకాయి చెల్లించాం. 2500 కోట్లు అర్జెంట్ చెల్లించాల్సిన బకాయిలు ఉంది. నాగర్ కర్నూలు శ్రీనివాస్ రెడ్డి అప్పులతో ఆత్మహత్య చేసుకున్నారు. రఘువీర్ రెడ్డి,శంకర్ లతో సహ 5గురు కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారు. 25వేల కోట్ల పంచాయతీ రాజ్, =డీ రోడ్లు హామ్ వర్క్స్ నడుస్తున్నాయి. 20వేల కోట్లు టెండర్లు, అగ్రిమెంట్స్ అయిపోయాయి. డిండి కి టెండర్లు పిలిచామని అన్నారు.కేటీఆర్ హరీష్ రావుపై మంత్రి కోమటిరెడ్డి మండిపడ్డారు. 2014 కేసీఆర్ వేసిన డబుల్ రోడ్స్, 2018 లో పామ్ హౌస్ కు వేసుకున్న టెండర్లు చూపిస్తాం. 30నెలల్లో జరిగిన అభివృద్ధి పై చర్చకు హరీష్ రావు సిద్ధమా అని అడిగారు. నేను తెలంగాణ ఉద్యమ కారుడిగా నిజాయితీగా పని చేస్తా. సన్న బియ్యం ఇవ్వాలని మాకు కేటీఆర్ చెప్పిండా. పది ఏండ్లు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు.. దొడ్డ బియ్యం ఇస్తే గొడ్లు కూడా తినలేదు. కేసీఆర్ దళితులకు ముఖ్యమంత్రి ఇస్తా అని 10వేల సార్లు చెప్పిండు. సోనియాగాంధీ దేవత అమె లేకుండా తెలంగాణ రాదు అన్నడు. భట్టి దళితుడు సీఎల్పీ నాయకుడు కాకుండా చేసిండ్రు. దళితులకు ప్రతిపక్ష నేత గా ఉండొద్దా అని ప్రశ్నించారు.

# కాంగ్రెస్ లో ... పదవుల పంచాయితీ

- మొదటి పేజీ తరువాయి

వర్గం ఆరోపిస్తుంది. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పై ఆయన చేసిన తీవ్ర వ్యాఖ్యలపై ఏఐసీసీ కూడా అంతే స్థాయిలో స్పందించింది. షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది.అయితే షబ్బీర్ అలీ మాత్రం ఆ వ్యాఖ్యలకు, తనకు ఏ మాత్రం సంబంధం లేదని చెప్పారు. ఆ ఆడియోలో వినిపిస్తున్న వాయిస్ తనది కాదని అన్నారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొందరు కుట్ర పన్నారంటూ షబ్బీర్ అలీ వివరణ ఇచ్చారు. మహేష్ కుమార్ గౌడ్ తో తనకు సుదీర్ఘ కాలం నుంచి తెలుసునని, మంచి మిత్రుడని చెప్పారు. ఆయనపై తాను వ్యతిరేక వ్యాఖ్యలు ఎందుకు చేస్తానని షబ్బీర్ అలీ అన్నారు. షోకాజ్ నోటీసులకు అవసరమైన సమాధానాన్ని తాను ఇస్తానని కూడా షబ్బీర్ అలీ చెప్పారు. మొత్తం మీద కాంగ్రెస్ లో సీనియర్ నేతలు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నాయకత్వం కూడా పార్టీ కోసం సుదీర్ఘకాలం పనిచేసిన వారిని పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

# బీఆర్ఎస్‌ను ట్రాక్‌లోకి తెచ్చేందుకు బస్సు యాత్ర...

- మొదటి పేజీ తరువాయి

ప్రసంగించి నేరుగా ప్రజల తప్పు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి రాలేదు.ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటిపోతున్న తరుణంలో.. కేసీఆర్ ఇప్పుడు బస్సు యాత్ర అస్త్రం చేతబట్టడం వెనుక కేవలం పార్టీ ఉనికిని చాటుకోవడమే కాకుండా, రాబోయే స్థానిక సంస్థల లేదా సార్వత్రిక ఎన్నికల కోసం క్యాడర్‌ను సమాయత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే, రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. కేసీఆర్ ఈ యాత్ర పూర్తి చేసిన తర్వాత మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంతవరకు ప్రజల్లోకి వచ్చే అవకాశాలు తక్కువే. అంతేకాదు, ఆయన ఇకపై అసెంబ్లీ సమావేశాలకు కూడా వచ్చే మూడ్‌లో లేరని స్పష్టమవుతోంది. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టే పూర్తి భారాన్ని ఆయన కేటీఆర్, తన్నీరు హరీష్ రావుల భుజాలపైనే పెట్టేశారు.అసెంబ్లీ వేదికగా గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై, అలాగే ప్రస్తుత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సవాల్ విసిరినా కేసీఆర్ సైలెంట్‌గా ఉండటం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం చేస్తున్న పొలిటికల్ సవాళ్లకు సమాధానం ఇచ్చేందుకు కేసీఆర్ ఏమాత్రం ఆసక్తి చూపించడం లేదు. తన స్థాయికి రేవంత్ రెడ్డి సరిపోరు, జూనియర్ నేతతో తాను నేరుగా తలపడటం వల్ల ఆయనకే ఎక్కువ పొలిటికల్ మైలేజ్ లభిస్తుంది అనే భావనలో కేసీఆర్ ఉన్నట్లు ప్యానెల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. అందుకే, రేవంత్ రెడ్డిని ఢీకొట్టే బాధ్యతలను కేటీఆర్, హరీష్ రావులకు వదిలేసి.. తాను మాత్రం కేవలం ప్రజాక్షేత్రం లోనే తేల్చుకోవాలని పంథాను ఎంచుకున్నారు.ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే.. గతంలో ఫ్లాప్ అయిన బస్సు యాత్ర ఫార్ములాతో కేసీఆర్ మళ్లీ ప్రజలను ఆకట్టుకోగలరా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నే. అసెంబ్లీ ఓటమి తర్వాత బీఆర్ఎస్ ఓటు బ్యాంకు దారుణంగా చెల్లాచెదురైంది. అటు బీజేపీలోకి, ఇటు కాంగ్రెస్‌లోకి కీలక నేతలు, కేడర్ వలస వెళ్లడంతో గులాబీ కోట బలహీనపడింది. ప్రస్తుతం కాంగ్రెస్ హామీల అమలులో జరుగుతున్న జాప్యం, ప్రజల్లో కనిపిస్తున్న చిన్నపాటి అసంతృప్తిని క్యాష్ చేసుకోవడానికి కేసీఆర్ వ్యాగాటి ఉపయోగించుకోవడానికి భావిస్తున్నప్పటికీ.. జనం గతాన్ని అంత సులభంగా మర్చిపోతారా అనేది అనుమానమేకేసీఆర్ బస్సు యాత్ర కేవలం ఒక ప్రచార పర్వం మాత్రమే కాదు, అది బీఆర్ఎస్ పార్టీకి జీవన్మరణ సమస్య. కేటీఆర్, హరీష్ రావు ఎంతగా కష్టపడుతున్నా.. పార్టీని నడిపించే కరిష్మా కేవలం కేసీఆర్‌కు మాత్రమే ఉంది. ఈ యాత్ర ద్వారా ఆయన తన పాత ఓటు బ్యాంకును తిరిగి రాబట్టుకోగలిగితే తెలంగాణలో మళ్లీ ముక్కోణపు పోటీ వస్తుంది; లేదంటే తెలంగాణ రాజకీయం కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మారిపోయి బీఆర్ఎస్ మరింత మూలనపడే ప్రమాదం ఉంది. అందుకే కేసీఆర్ సీరియస్‌గా ఈ యాత్ర చేసే అవకాశాలు ఉన్నాయి.

# తెలంగాణలో,... విచారణల పాలిటిక్స్

- మొదటి పేజీ తరువాయి

కేసులో అవినీతి కోణాలు కూడా ఉన్నాయని భావించిన రాష్ట్ర ప్రభుత్వం... ఈడీ, సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ.. లేఖలు సంధించింది. కానీ, ఇప్పటి వరకు కేంద్రం నుంచి సరైన సమాధానం రాలేదన్నది సర్కారు చెబుతున్న మాట.ఈ విషయాన్ని కట్ చేస్తే.. తాజాగా బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని మరో డిమాండ్ చేశారు. సింగరేణి కాలరీస్ లో భారీ ఎత్తున కుంభకోణం జరిగిందని వార్తలు వస్తున్నాయని ఆయన తెలిపారు. దాదాపు 16 వందల కోట్ల రూపాయల విలువైన బొగ్గు దారి మళ్లిందని.. ఇదంతా ఎవరి హయాంలో జరిగింది? దీనివెనుక ఎవరు ఉన్నారు? అనే విషయాలను తేల్చాలని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే దర్యాప్తు చేయించాలని కిషన్ రెడ్డి కోరారు. అంతేకాదు.. సింగరేణి భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు.కేసీఆర్ సర్కారు కేంద్రంగా ఇటు కాంగ్రెస్, అటు బీజేపీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూనే ఉన్నాయి. అంతేకాదు.. ఒకరిపై ఒకరు మీరు విచారణ చేపట్టాలంటే మీరు విచారణ చేపట్టాలని నిలదీతలు కనిపిస్తున్నాయి. ఇంతకు మించి.. ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం వెనుక వీటిని రాజకీయ వస్తువులుగానే వినియోగించుకునే అవకాశం ఉందన్న వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం.కాగా.. ప్రస్తుతం కిషన్ రెడ్డి లేవనెత్తిన సింగరేణి బొగ్గు గనుల వ్యవహారం కూడా రాజకీయపరమైన అంశంగానే కనిపిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. ఎందుకంటే.. బొగ్గుగని కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నా.. గనుల నిల్వలు.. సరుకు రవాణా.. కేటాయింపు ఇలా.. అన్ని విషయాలు బొగ్గు, గనుల శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి పరిధిలోనే ఉంటాయి. కాబట్టి.. ఈ రచ్చ ఇలా కొనసాగుతుందా.. లేక పరిష్కారం లభిస్తుందా? అనేది చూడాలి.

వార్తాతరంగాలు
బుధవారం 17 జూన్ 2026

## బ్యాంకు రుణాలు కావాలంటే లంచం



**హైదరాబాద్, జూన్ 16:**రాజేంద్రనగర్ సర్కిల్‌లో పొదుపు సంఘాల మహిళలకు బ్యాంక్ రుణాలు మంజూరు చేయడంలో భారీ అవినీతి జరుగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కుటుంబ అవసరాలు లేదా స్వయం ఉపాధి కోసం రుణాలు కోరిన మహిళలను అధికారులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుతూ, లంచాలు అడుగుతున్నారని సమాచారం.దీనిపై సర్కిల్‌లోని పలు సంఘాల మహిళలు తిరుగుబాటు చేసి, అధికారుల ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంకులకు లేఖలు రాశారు. విషయం విజిలెన్స్ అధికారుల దృష్టికి వెళ్లడంతో జరిగిన విచారణలో దిగ్భ్రాంతికరమైన నిజాలు బయటపడ్డాయి. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 1,400 మంది మహిళలకు మంజూరైన రూ. 4.5 కోట్ల రుణం నుంచి రూ. 4.5 లక్షలు లంచాలకే ఖర్చయ్యాయని ఆధారాలు సేకరించారు.ప్రతి రూ. లక్ష రుణానికి రూ. 1,000 కమీషన్ వసూలు చేస్తున్నట్లు విజయేందర్, లక్ష్మణ్, జె. ఉపేందర్, పి. విజయ్‌కుమార్ వంటి కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీవోలు) విచారణలో ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. వీరు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా కూడా డబ్బులు వసూలు చేసినట్లు ఆధారాలు సేకరించారు. లంచం అడిగినప్పుడు ప్రశ్నించిన వారిని విధుల నుంచి తొలగించడం, వారి స్థానంలో తమకు అనుకూలమైన వారిని నియమించుకోవడం ఈ సీవోలకు అలవాటుగా మారిందని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. నివేదిక ఆధారంగా, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళల వేధింపులను అరికట్టాలని అధికారులు కమిషనర్‌కు సిఫార్సు చేశారు.

## ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆషాడ మాస బోనాల ఉత్సవాలు

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



**సికింద్రాబాద్:**సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆషాడ మాస బోనాల ఉత్సవాలను ఆగస్టు 2 వ తేదీన నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం ఆలయ ఈఓ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పండితులు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం ఆషాఢమాస బోనాల ఉత్సవాల వివరాలను తెలియజేస్తూ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు లేఖను అందజేశారు. జులై 19 వ తేదీన ఘటాల ఊరేగింపు ప్రారంభం అవుతుందని, ఆగస్టు 2 వ తేదీన అమ్మవారికి బోనాల సమర్పణ, 3 వ తేదీన రంగం (భవిష్య వాణి) ఉంటాయని ఈఓ వివరించారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్ పేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, రాం మోహన్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## హైదరాబాద్లో మరోసారి ఏసీబీ సోదాలు...

**మల్టీజోన్ 2 డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో సోదాలు**

**భారీగా నగదు స్వాధీనం**

**హైదరాబాద్:**హైదరాబాద్ నగరంలో మరోసారి ఏసీబీ సోదాలు కలకలం రేపాయి. ఈ సారి సర్వే శాఖ మల్టీజోన్ 2 డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో ఏసీబీ సోదాలు జరిపింది. అయన కార్యాలయాలు,బంధువుల ఇల్లులు ఏకకాలంలో తనిఖీలు జరిగాయి. మొత్తం పది చోట్ల సోదాలు నిర్వహించారు. ఉదయం నుండి ఛత్రి నాకా హౌస్ వద్ద మల్టీ జోన్ డైరెక్టర్ బంధువు ఇంటిపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు.ఈ దాడుల్లో ఏసీబీ అధికారులు బంగారం, ఆస్తి పత్రాలు, సాదా కోర్టు స్టాంప్ పేపర్లు, ఇతర పత్రాలు, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.ఒక కోటి 10 లక్షలు ఆదాయం అస్తులు గుర్తించారు. పలు ఖాళీ బాండ్ పేపర్లను కుడా స్వాధీనం చేసుకున్నారు.

## పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పెంచాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం:**జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచడంతో పాటు నాణ్యమైన విద్య, పోషకాహార సేవలు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.ఆళ్ళపల్లి మండల పర్యటనలో భాగంగా ఆళ్ళపల్లి మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్, విద్యార్థుల సంఖ్య, హాజరు వివరాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలోని ప్రీ-ప్రైమరీ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం నిర్వహణపై సమీక్షించారు.తల్లిదండ్రులతో నిరంతర సంప్రదింపులు జరిపి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న భోజనం, పాలు, బాలామృతం తదితర పోషకాహార సేవలను పరిశీలించి హాజరు తక్కువగా ఉండటంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తరువాత పెద్ద వెంకటాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి గుత్తికోయలు నివసించే ఈ గిరిజన ప్రాంతంలో బడిఈడు పిల్లలందరూ పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అదనపు నిల్వలను అవసరమైన చోటుకు తరలించాలని, కేంద్రాలను పరిశుభ్రంగా నిర్వహిస్తూ పిల్లల చేరికలు పెంచాలని ఆదేశించారు.విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు, పిల్లలకు నాణ్యమైన పోషకాహార సేవలు అందించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అయన సూచించారు.

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

**హైదరాబాద్:**ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు థామస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఎస్వికే లో ఆర్టీసీ సంస్థ ఆవిర్భవించి 94 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా థామస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఆర్టీసీ సంస్థను ప్రభుత్వ రంగంలో విలీనం చేయాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా యూనియన్ లను ఏర్పాటు చేసి ఎన్నికలను నిర్వహించడంపై హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి నెల ఆర్టీసీ కార్మికుల్లో రిటైర్డ్ అవుతున్న వారికి డబ్బులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థలో పనిచేసే వారికి ప్రభుత్వం ప్రమోషన్లు కల్పించాలని విన్నవించారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు 200 నూతన బస్సులను కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ ఎన్నికల ముందు ఆర్టీసీ విలీనమే ముఖ్యమని ఉద్ఘాటించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి సత్వరమే చర్యలు తీసుకుని రిటైర్డ్ అయిన స్థానంలో నూతన ఉద్యోగులను చేర్చుకోవాలని, రిటైర్డ్ మెంట్ బెనిఫిట్, పీఎఫ్ డబ్బులు సత్వరమే చెల్లించాలని కోరారు.

# పాపం మహేష్ గౌడ్...



**హైదరాబాద్, జూన్ 16 :**తెలంగాణ కాంగ్రెస్‌లో కొంతకాలంగా అంతర్గతంగా సాగుతున్న లీకుల రాజకీయం ఇప్పుడు పరాకాష్టకు చేరింది. ఏఐసీసీ వేదికగా జరిగిన ఒక అనూహ్య పరిణామం.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కుర్చీకే ఎసరు పెట్టే స్థాయికి చేరడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెను సంచలనంగా మారింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్వయంగా ఎంపిక చేసి బరిలోకి దించిన మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడం వెనుక.. తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన కీలక నేతలే వెన్నుపోటుకు పాల్పడ్డారనే పక్కా ఆధారాలు ఢిల్లీ పెద్దలకు చిక్కాయి. ఈ తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంపై రాహుల్ గాంధీ అత్యంత ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం.మీనాక్షి నటరాజన్ అంటే రాహుల్ గాంధీ కోటరీలో అత్యంత నమ్మకమైన, విలువలతో కూడిన రాజకీయాలు చేసే సీనియర్ నాయకురాలిగా పేరుంది. మధ్యప్రదేశ్‌లో ఆమె నామినేషన్‌ను తిరస్కరించడానికి బేస్‌గా మారిన తెలంగాణ పాత ప్రైవేట్ కంప్లైంట్ వివరాలను.. ఇక్కడి కాంగ్రెస్ నేతలే స్వయంగా బీజేపీకి లీక్ చేశారనే అంశంపై ఏఐసీసీ ఇప్పటికే ఒక ప్రత్యేక విచారణ కమిటీని రంగంలోకి దించింది. పూర్తిగా కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలు, గ్రూపు రాజకీయాల వల్లనే పార్టీ జాతీయ స్థాయిలో ఇంతటి అవమానాన్ని ఎదుర్కోవాల్సి వచ్చిందని రాహుల్ గాంధీకి ప్రాథమికంగానే ఒక స్పష్టత వచ్చేసింది. తన సొంత ఎంపికపైనే దెబ్బకొట్టిన ఈ అంతర్గత శత్రువులను క్షమించే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా భావిస్తున్నట్లు ఢిల్లీ వర్గాలు చెప్తున్నాయి. ఈ లీకేజీ వ్యవహారం కేవలం ఒక రాజ్యసభ సీటును కోల్పోవడం కాదు, రాహుల్ గాంధీ నాయకత్వానికే విసిరిన సవాల్‌గా ఢిల్లీ పెద్దలు చూస్తున్నారు. అందుకే, బాధ్యులపై చర్యలతో పాటు తెలంగాణ కాంగ్రెస్‌ను రూట్ లెవెల్ నుండి ప్రక్షాళన చేయాలని డిసైడ్ అయ్యారు.ఈ మొత్తం వ్యవహారంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న మహేష్ కుమార్ గౌడ్ పాత్రపై తీవ్రమైన స్క్రూటినీ నడుస్తోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. పీసీసీ అధ్యక్షుడిగా ఉండి కూడా రాష్ట్రంలో పార్టీ అంతర్గత సమాచారాన్ని, రహస్యాలను కాపాడటంలో, సొంత నేతలను కంట్రోల్ చేయడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారనే బలమైన అభిప్రాయానికి హైకమాండ్ వచ్చింది. ఫలితంగా, తెలంగాణలో పార్టీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు మహేష్ కుమార్ గౌడ్‌ను పక్కన పెట్టి.. గ్రూపులను అణచగల ఒక అత్యంత సీనియర్, పవర్‌ఫుల్ లీడర్‌ను టీపీసీసీ అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే ఏఐసీసీ బ్యాక్‌ఎండ్ వర్క్ కూడా ప్రారంభించినట్లు సమాచారం.ఈ ప్రక్షాళన ప్రభావం కేవలం పార్టీ కమిటీలకే పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ పై కూడా తీవ్రంగా పడబోతోంది. ముఖ్యంగా, ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, ఒక డిప్యూటీ సీఎంల మధ్య సాగుతున్న భీకరమైన వర్గపోరు.. ఈ లీకేజీ వ్యవహారానికి ప్రధాన కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ జిల్లాల్లోని కొందరు మంత్రుల వెనుక ఉన్న ఒక బడా బిజినెస్ లాబీ.. కాంగ్రెస్‌లో ఉంటూనే సమాచారాన్ని బీజేపీకి చేరవేసే డబుల్ గేమ్ ఆడుతోందని, ఈ నటరాజన్ ఇష్యూలో కూడా ఆ వ్యాపారవేత్తల హస్తం స్పష్టంగా ఉందని నిఘా నివేదికలు చెప్తున్నాయి. దీంతో ఖమ్మం జిల్లాకు చెందిన హెవీవెయిట్ మంత్రుల పోర్ట్‌ఫోలియోలను మార్చడం లేదా వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం ఖాయంగా మారింది.మరోవైపు, ఈ సంక్షోభాన్ని ఒక సామాజిక సమీకరణాల మార్పుకు కూడా వేదికగా వాడుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం ప్లాన్ చేస్తోంది. చాలా కాలంగా రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల నుంచి వస్తున్న మంత్రివర్గ ప్రాతినిధ్య డిమాండ్‌ను నెరవేర్చడానికి.. ఈ లీకుల వ్యవహారంలో దొరికిపోయిన నాన్-పెర్ఫార్మర్ల మంత్రులను కేబినెట్ నుండి తప్పించనున్నారు. ఆ ఖాళీ అయ్యే స్థానాల్లో బీసీ నేతలకు, సీనియర్లకు చాన్స్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. ఈ సర్జికల్ స్ట్రైక్ సమయంలో ప్రభుత్వం ఇబ్బంది పడకుండా ఉండేందుకు పార్టీని శాసించగల కొందరు అత్యంత పవర్‌ఫుల్ మంత్రులను ప్రస్తుతానికి టచ్ చేయకుండా.. కేవలం 'వాచ్ లిస్ట్' లో ఉంచి, తగిన సమయంలో వారి సంగతి తేల్చాలని ఏఐసీసీ భావిస్తోంది. మొత్తానికి, మధ్యప్రదేశ్‌లో తిరస్కరణకు గురైన మీనాక్షి నటరాజన్ నామినేషన్ ఎపిసోడ్, ఊహించని విధంగా తెలంగాణ కాంగ్రెస్‌లో ఒక పెను రాజకీయ భూకంపానికి దారితీసింది.

# ఆర్టీసీ పేరును గుర్తు చేస్తున్న బస్సులు..



**హైదరాబాద్, జూన్ 16:**హైదరాబాద్‌లోని ప్రధాన మార్గాల్లో బస్సులు తరచూ బ్రేక్‌డౌన్ అవుతుండటంతో ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నానల్‌నగర్, ఖైరతాబాద్ జంక్షన్, మాసబ్‌ట్యాంక్ కట్టమైసమ్మ దేవాలయం వంటి ప్రాంతాల్లో బస్సులు మధ్యలోనే ఆగిపోవడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.'మహాలక్ష్మి' ఉచిత ప్రయాణ పథకం ప్రారంభమైన తర్వాత ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సులపై అదనపు ఒత్తిడి పడుతోంది. కొత్త బస్సులు రాకపోవడం, నిర్వహణ లోపించడం వల్ల ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది.విడిభాగాల కొరత, ఆయిల్ సకాలంలో మార్చకపోవడం వంటి కారణాల వల్ల బస్సులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. వైరింగ్, పార్ట్స్ సమస్యల వల్ల కొన్ని బస్సుల నుంచి పొగలు వస్తున్నాయి. డిపోలలో ఫిట్‌నెస్ పరీక్షలు నామమాత్రంగానే జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.మహానగరానికి 7 వేల బస్సులు అవసరం ఉండగా, ఆర్టీసీ ప్రస్తుతం 3200 బస్సులతోనే నెట్టుకొస్తోంది. వీటిలో 500 ఎలక్ట్రిక్ బస్సులు కాగా, మిగిలినవి డీజిల్ బస్సులు. హైదరాబాద్ రీజియన్‌లో 15 సంవత్సరాలు దాటిన బస్సులు సుమారు 250, పదేళ్లు దాటినవి 350 ఉన్నాయి. సికింద్రాబాద్ రీజియన్‌లో 15 సంవత్సరాలు దాటినవి 300, 10 సంవత్సరాలు దాటినవి 300 ఉన్నాయి. ఈ పాత బస్సులు కాలుష్యాన్ని వెదజల్లడమే కాకుండా, రోజుకు 6 నుండి 8 ట్రిప్పులు తిరుగుతున్నాయి.


## ల్యాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో ఏసీబీ సోదాలు..

**భారీగా అక్రమాస్తుల గుర్తింపు**



**హైదరాబాద్, జూన్ 16:** హైదరాబాద్‌లో మరోసారి ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ల్యాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ మల్టీజోన్-2 కొంకరి నరహరి ఇంట్లో అధికారులు తనిఖీలు చేశారు. ఆయన కార్యాలయాలు, బంధువుల ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో 13 చోట్ల సోదాలు జరుగుతున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. చార్మినార్‌తో సహా పలు ప్రాంతాల్లో తనిఖీలు జరుగుతున్నాయి. సోదాల్లో భాగంగా భారీగా అక్రమాస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. ల్యాండ్ డాక్యుమెంట్‌లు, బంగారు ఆభరణాలతో పాటు రూ.1.10 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. నరహరితో పాటు ఆయన తమ్ముడి నివాసంలో సోదాలు కొనసాగుతున్నాయి. తమ్ముడి ఇంట్లోనూ భారీగా ఆస్తులను అధికారులు గుర్తించారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఆస్తుల వివరాలపై అన్నదమ్ముల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్‌లో మల్టీ జోన్ 2 డిప్యూటీ డైరెక్టర్‌గా నరహరి కీలక విధులు నిర్వహిస్తున్నారు. భూమి సర్వే, సరిహద్దు వివాదాల పరిష్కారం, భూమి స్వాధీనం వంటి కీలక ఉద్యోగ బాధ్యతలను ఆయన నిర్వర్తిస్తున్నారు. గతంలో రంగారెడ్డి జిల్లాకి ఏడీగా కొంకరి నరహరి పనిచేశారు. దీంతో ఆ సమయంలో కూడా భారీగా అక్రమాలకు పాల్పడినట్టు ఏసీబీ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## నీట్ పరీక్షకు ముందు టెలిగ్రామ్‌పై నిషేధం.. మరి, వాట్సాప్‌ను ఎందుకు వదిలేశారు..



నీట్-యూజీ 2026 రీ-టెస్ట్‌కు ముందు కేంద్ర ప్రభుత్వం టెలిగ్రామ్ యాప్‌పై తాత్కాలిక నిషేధం విధించింది. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పరీక్షల భద్రతను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం వెనుక ప్రధాన కారణాలు ఏమిటి? టెలిగ్రామ్ తరహాలోనే మెసేజింగ్ యాప్ అయిన వాట్సాప్‌పై ఎందుకు నిషేధం విధించలేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి టెలిగ్రామ్ తరహాలోనే వాట్సాప్ ద్వారా కూడా సమాచారం వేగంగా వ్యాపిస్తుంది. అయితే అధికారుల దృష్టిలో ప్రస్తుతం సమస్యకు కేంద్రంగా ఉన్నది టెలిగ్రామ్ ఛానెల్‌ల నెట్‌వర్క్. టెలిగ్రామ్‌లో పెద్ద సంఖ్యలో పబ్లిక్ ఛానెల్‌లు, అనామక అడ్మిన్ వ్యవస్థ, భారీ స్థాయిలో ఫైల్ షేరింగ్ సౌకర్యాలు ఉండటం వల్ల చీటింగ్ రాకెట్లకు అది సులభ వేదికగా మారింది . ఇటీవల నీట్ పరీక్షకు సంబంధించిన నకిలీ ప్రశ్నపత్రాలు, పేపర్ లీక్ ప్రచారాలు, మోసపూరిత సందేశాలు ప్రధానంగా టెలిగ్రామ్ ఛానెల్‌లు, గ్రూపుల ద్వారా వ్యాపించినట్లు కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు అందాయి. లక్షలాది మంది సభ్యులతో కూడిన పబ్లిక్ ఛానెల్‌లు, అనామకంగా నిర్వహించే గ్రూపులు టెలిగ్రామ్‌లో విస్తృతంగా ఉండటంతో అక్రమ కార్యకలాపాలకు అది వేదికగా మారిందని అధికారులు భావిస్తున్నారు టెలిగ్రామ్‌లో సందేశాలను ఎడిట్ చేసే సౌకర్యం కూడా ప్రధాన ఆందోళనగా మారింది. పాత సందేశాలను సవరించి, అవి ముందుగానే పంపినట్లుగా చూపిస్తూ ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయనే తప్పుడు ప్రచారాన్ని కొందరు చేసినట్లు విచారణలో తేలింది. ఇక, వాట్సాప్‌తో పోల్చుకుంటే టెలిగ్రామ్ వినియోగదారుల గోప్యతపై ఎక్కువ దృష్టి పెడుతుంది. ఎవరైనా టెలిగ్రామ్‌లో ప్రొఫైల్‌ను సృష్టించుకున్నప్పుడు, ఫోన్ నంబర్‌ను దాచి, కేవలం యూజర్‌నేమ్‌తోనే యాప్‌ను ఉపయోగించవచ్చు ఒకసారి టెలిగ్రామ్‌లో ప్రొఫైల్ సృష్టించుకున్న తర్వాత, గుర్తింపును అజ్ఞాతంగా ఉంచుకుంటూ, అపరిమిత సంఖ్యలో సబ్‌స్క్రైబర్‌లు ఉండే ఛానెల్‌ను సృష్టించడం చాలా సులభం. అంటే, ఒక బృందం తమ గుర్తింపును దాచుకుని, లక్షలాది మంది సబ్‌స్క్రైబర్‌లతో ఒక ఛానెల్‌ను నడపగలదు. ఆ ఛానెల్ వెనుక ఎవరున్నారో గుర్తించడం చాలా కష్టం. వాట్సాప్‌లో అలాంటి సౌలభ్యం ఉండదు. ఇక ఫైల్ షేరింగ్ విషయంలో కూడా టెలిగ్రామ్ చాలా ఎక్కువ సౌకర్యాలను అందిస్తుంది. ఈ ప్లాట్‌ఫామ్‌లో మీరు ఎలాంటి కంప్రెషన్ లేకుండా 2జీబీ ఫైళ్లను కూడా షేర్ చేయవచ్చు.వినియోగదారులు వ్యక్తిగతంగా ఏమి పంచుకుంటున్నారో, దేని గురించి మాట్లాడుతున్నారో తాము చూడలేమని వాట్సాప్ చెబుతున్నప్పటికీ, అది ఏఐ టూల్స్‌ని ఉపయోగించి పబ్లిక్ గ్రూపులలో వినియోగదారుల ప్రవర్తనను పర్యవేక్షించగలదు.

## బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష



**మేడ్చల్:**11 ఏళ్ల క్రితం బాలికపై జరిగిన అత్యాచార కేసులో నిందితుడికి కోర్టు కఠిన శిక్ష విధించింది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ పోక్సో కేసును విచారించిన ప్రత్యేక న్యాయస్థానం, నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. అలాగే బాధితురాలికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

## ఇకపై డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మెడికల్ షాపుల్లో దగ్గు మందులు..

దేశంలో దగ్గు మందు **(Cough Syrup)** కొనుగోలుపై కేంద్ర ఆరోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది.ఇకపై డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మెడికల్ షాపుల్లో దగ్గు మందులు విక్రయించాలని స్పష్టం చేస్తూ సరికొత్త నిబంధనలను తీసుకువచ్చింది.ఈ మేరకు 1945 నాటి ఔషధ నిబంధనలలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కీలక సవరణలు చేసింది. ఇప్పటివరకు సాధారణంగా లభించే దగ్గు నివారణ మందులను షెడ్యూల్ 'కె' **(Schedule K)** జాబితా నుండి తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## అందోళనబాటలో బిల్డింగ్ కాంట్రాక్టర్లు


**హైదరాబాద్:**ఆత్మహత్య లు చేసుకుంటున్న కాంట్రాక్టర్ల కుటుంబాలకు భరోసా ఇవ్వడం కోసమే మేము చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టామని బిల్డింగ్ కాంట్రాక్టు అసోసియేన్ అధ్యక్షుడు డివిఎన్ రెడ్డి అన్నారు. మంగళవారం అయన మీడియాతో మాట్లాడారు.రెండు సార్లు డిప్యూటీ సీఎం ను కలిశామం. దశలవారిగా మాకు బిల్లులు చెల్లిస్తారని చెప్పారు. ఈరోజు సాయంత్రం మరొక సారి డిప్యూటీ సీఎం ను కలుస్తాం .సాయంత్రం మా చలో హైదరాబాద్ నిర్ణయాన్ని ప్రకటిస్తామని అన్నారు.మాకు డిజిల్ కు కూడా డబ్బులు లేవు. మూడు నెలలలో 3వేల కోట్ల బిల్లులను చెల్లిస్తే మాకు సంతోషం. ఛాంబర్ ముందు ధర్నా చేసింది మా అసోసియేషన్ కాదు. బీఆర్ఎస్ ం ప్రభుత్వం లో 5వేల కోట్ల అప్పులు తెచ్చారు. ఇప్పుడు కూడా ప్రభుత్వం ఆవిధంగా నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నామని అన్నారు.

# వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

## వైద్యాధికారులు ఎం ఎల్ హెచ్ పి లతోసమీక్ష సమావేశం లో డాక్టర్ తుకారాం రాథోడ్ డీ ఎం హెచ్ ఓ

**కొత్త గూడెం జూన్ 16( స్కై న్యూస్):**ఆరోగ్య సేవల నాణ్యత పెంపు, మాతా–శిశు ఆరోగ్యం, సాధారణ ప్రసవాలు మరియు వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి -- డా. తుకారాం రాథోడ్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ అధ్యక్షతన వైద్య అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డా. తుకారాం రాథోడ్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడం ప్రతి వైద్య అధికారి ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజల ఆరోగ్య సూచికలను మెరుగుపరచేందుకు కృషి చేయాలని సూచించారు.సమావేశంలో క్రింది అంశాలపై సమీక్ష నిర్వహించారు:గర్భిణీ స్త్రీలకు నాణ్యమైన గర్భధారణ పూర్వ సేవలు అందించాలి. అధిక ప్రమాద గర్భిణీలను గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేయాలి.సాధారణ ప్రసవాల శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.మాతృ మరణాలు శిశు మరణాలు తగ్గించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలి.తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి జననం తర్వాత వెంటనే తల్లిపాలు ఇవ్వడాన్ని ప్రోత్సహించాలి.రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలి.సికిల్ సెల్ అనీమియా స్క్రీనింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి.జీవనశైలి వ్యాధులు అయిన మధుమేహం, రక్తపోటు, ఊబకాయం నియంత్రణకు స్క్రీనింగ్ కార్యక్రమాలు చేపట్టాలి.క్షయవ్యాధి టిబి, కుష్ఠ వ్యాధి, డెంగ్యూ, మలేరియా





తదితర వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి.ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించి దోమల నివారణ చర్యలను కట్టుదిట్టం చేయాలి..యాంటీ లార్వల్ ఆపరేషన్లు నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి.పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలి. హెచ్ పీ వి టీకా, పల్స్ పోలియో, స్టాప్ డయేరియా కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలి.సమతుల ఆహారం, శారీరక వ్యాయామం, యోగా వంటి ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించాలి.ఆరోగ్య కేంద్రాల్లో రికార్డులు, రిజిస్టర్లు మరియు నివేదికలను సక్రమంగా నిర్వహించాలి.ప్రజలకు ఆరోగ్య విద్య అందించేందుకు ఐ ఈ సీ , బీసీసీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అన్ని ఆరోగ్య కేంద్రాలు సిద్ధంగా ఉండాలని సూచించారు.అదేవిధంగా, వైద్య అధికారులు తమ పరిధిలోని గ్రామాలను తరచుగా సందర్శించి ఆరోగ్య కార్యక్రమాల అమలును పర్యవేక్షించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలోని యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించి సిబ్బంది తక్కువగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో భర్తీపై ప్రణాళికను తయారు చేయుట కొరకు గతంలో జనరల్ ట్రాన్స్ఫర్లలో సబ్ సెంటర్లు ఇవ్వని 54 మంది ఏఎన్ఎంలకు ఈనెల 18వ తారీకున కమిషనర్ ఆదేశానుసారం డిప్యూటీ డిఎంహెచ్ఓ ఆఫీస్, కొత్తగూడెం నందు కౌన్సిలింగ్ నిర్వహించబడును అని తెలియజేశారు ఈ సమావేశంలో డాక్టర్ శ్రీధర్ డి డీఎంహో డాక్టర్ సాయి కళ్యాణ్ డిప్యూటీ డిఎంహెచ్ఓ, డాక్టర్ ప్రసాద్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ప్రతాప్ , డాక్టర్ రాందాస్ , డాక్టర్ రాకేష్ , డాక్టర్ దినేష్ .డాక్టర్ హరీష్, వైద్యాధికారులు, ఎం ఎల్ హెచ్ పీ లు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల పాత్ర కీలకం...

## సర్పంచ్ కొండల్ రావు

**తాడూర్ జూన్ 16 (స్కై న్యూస్)** విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని యాంగంపల్లి సర్పంచ్ కొండల్ రావు కోరారు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గడుసు జ్యోతి తో కలిసి ఆయన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలు విద్యను వ్యాపారమయంగా మారుస్తే ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు ఏకరూప దుస్తులతో పాటు సన్నబియ్యంతో మధ్యాహ్నం పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గడుసు జ్యోతి





మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలలో అనుభవజ్ఞులు లేకుండానే విద్యను బోధిస్తున్నారని వాటికి విద్యార్థుల తల్లిదండ్రుల నుండి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధన అందించడం ద్వారా విద్యార్థులలో మానసిక ధైర్యం ఏర్పడడంతో పాటు సమాజంపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు సామాజిక రుగ్మతలను తొలగించేందుకు కృషి చేయడంతో పాటు మానసిక వికాసం ఆటలు పాటలు సృజనాత్మక కార్యక్రమాల ద్వారా బోధన జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ సత్యం కార్యదర్శి నరసింహులు గ్రామ పెద్దలు శంకర్ గౌడ్ అంగన్వాడీ టీచర్ సరస్వతి ఆశ వర్కర్ నాగమ్మతో పాటు గ్రామ ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు

# బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ డైరెక్టర్స్ నియామకాల్లో శ్రీవైష్ణవులకు 50% కేటాయించాలి

### శ్రీవైష్ణవ సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్ డిమాండ్



**హైద్రాబాద్ జూన్ 16:**శ్రీవైష్ణవ సేవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ శాఖ ప్రారంభ సర్వసభ్య సమావేశం ఎల్ బి నగర్ లో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి పీచర కృష్ణమాచార్య, సంఘ సభ్యులు పొడిచేటి రామకృష్ణమాచార్య, ఫణిహారం శ్రీకాంత్ చార్యులు, ఉత్పల అనంతాచార్య, వాయా ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు శ్రీ కండ్లకుంట యాదగిరాచార్యులు, శ్రీచిలుకమర్రిలక్ష్మీనాథాచార్యులు, సభ్యులు శ్రీభాష్యం యదుమోహన్, ముడుంబ మాధవాచార్య తదితరులు పాల్గొన్నారు.సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్ గారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను స్మార్తులతో భర్తీచేసి, శ్రీవైష్ణవులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. కనీసం డైరెక్టర్స్ నియామకాల్లోనైనా శ్రీవైష్ణవులకు 50% కేటాయించి వెంటనే నియామకం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీచర కృష్ణమాచార్యమాట్లాడుతూ..ఆర్థికంగా వెనుకబడిన శ్రీవైష్ణవులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అన్ని జిల్లాల్లో కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. జూన్ 24వ తేదీన సంఘం నిర్వహించనున్న ఉచిత సామూహిక ఉపనయనాలకు 50 మంది వటువులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. తర్వాత గ్రేటర్ హైదరాబాద్ అడ్ హక్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్ గా పొడిచేటి రామకృష్ణమాచార్య, కో-కన్వీనర్లుగా ఫణిహారం శ్రీకాంత్ కృష్ణమాచార్య, తాండ్ర్యాల శ్రీనివాస చక్రవర్తి, చిలుకమర్రి కవీంద్రాచార్యులు, శేషభట్టర్ శ్రీకాంతాచార్య, బెల్లంకొండ ప్రవీణ్ కుమార్, తాండ్ర్యాల కృష్ణమోహన్, శ్రీభాష్యం హరికిషన్, కొండపాక కృష్ణమాచార్య, కాండూరి శరత్ వంశీ, మురళీ వెంకటాచార్య, చక్రవర్తుల రవికుమారాచార్య మరియు వీరితోపాటుగా 15 మందిని కార్యవర్గ సభ్యుల ఎంపిక కూడా జరిగింది.

# అందుబాటులో ఉండి బాధ్యతలకు పూర్తి న్యాయం..

### వైఫల్యాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం..,..
### బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పృథ్వీరాజ్...



**నాగర్ కర్నూల్ జూన్ 16 (స్కై న్యూస్)** బహుజన సమాజ్ పార్టీలో అంచలంచలుగా ఎదిగిన తాను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం జరిగిందని తూడుకుర్తి గ్రామానికి చెందిన బండి పృథ్వీరాజ్ తెలిపారు. రాబోయే రోజులలో బహుజన సమాజ్ పార్టీని రాష్ట్రంలో బలోపేత శక్తిగా తయారు చేసేందుకు ప్రభుత్వ వైఫల్యాలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా నియామకం అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కుమారి మాయవతి ఆశీస్సులతో యువ నాయకులు ఆకాష్ ఆనంద్ పర్యవేక్షణలో తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడంలో జాతీయ కోఆర్డినేటర్లు అట్టర్ సింగ్ రావు మరియు సురేష్ ఆర్య రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్ రాష్ట్ర రథసారథి ఇబ్రం శేఖర్ లకు ధన్యవాదాలు తెలిపారు. 2018లో పాలమూరు యూనివర్సిటీలో ఏం ఫార్మసీ పూర్తి చేసిన అనంతరం దళిత బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేస్తున్న బహుజన సమాజ్ పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. నాటి నుండి తాను నిర్వహించిన పోరాటాలు ఉద్యమ ఆకాంక్షను గుర్తించిన నాయకత్వం వివిధ హోదాలలో తనకు బాధ్యతలు అప్పగించడం జరిగిందని ప్రజల సహకారంతో వాటన్నిటిని నెరవేర్చిన తనకు నేడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించాలని వివరించారు. నాగర్ కర్నూలు జిల్లాలో మరియు పార్లమెంటు పరిధిలో పార్టీ పదాధికారుల సహకారం కార్యకర్తల పోరాట స్ఫూర్తితో తనపై ఉంచిన బాధ్యతలను విశ్వాసంతో నెరవేర్చడం జరిగిందని వివరించారు. పార్టీ తన భుజస్కందాలపై ఉంచిన బాధ్యతను కార్యకర్తగా నెరవేరుస్తూ ప్రజా సమస్యలపై పూర్తిస్థాయిలో పనిచేస్తానని తెలిపారు. 2012లో పాలమూరు యూనివర్సిటీలో విద్యార్థి ఉద్యమకారుడుగా ప్రారంభమైన రాజకీయ జీవితం 14 సంవత్సరాలు నిరంతరం కొనసాగిందని వివరించారు



# సఖి కేంద్రంలో అన్ని సౌకర్యాలు

**జోగులాంబ గద్వాల, జూన్ 16 (స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్లో మహిళలు, బాలికలకు అందిస్తున్న సేవల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి నిషిత తెలిపారు. గత వారం జిల్లా కలెక్టర్ తనిఖీలో గుర్తించిన లోపాలను సవరించేందుకు తక్షణ చర్యలు చేపట్టడం జరిగింది జిల్లా సంక్షేమ శాఖ అధికారిని నుషిత ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం, రికార్డుల నిర్వహణ మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లు మరియు సిబ్బంది విధి నిర్వహణను సమీక్షించినట్లు మరియు ఇతర అంశాలకు సంబంధించిన లోపాలు గుర్తించబడగా, బాధ్యులైన సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందని, అలాగే విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు చేపట్టడంతో పాటు భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయడానికి అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సఖి కేంద్రం ద్వారా మహిళలు మరియు బాలికలకు 24 గంటల అత్యవసర సేవలు, తాత్కాలిక ఆశ్రయం, వైద్య సేవలు, మానసిక పరామర్శ, న్యాయ సహాయం, పోలీసు సహకారం మరియు పునరావాస సేవలు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిరంతరం అందించబడుతున్నాయని తెలిపారు. అవసరమైన మహిళలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు బాధిత మహిళలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు అన్ని చర్యలు చేపట్టామని జిల్లా సంక్షేమ అధికారి నుషిత వెల్లడించారు.

# అకాల బీభత్సనికి అపార నష్టం

### పారా బైల్డ్ రైస్ మిల్ కు 10 కోట్ల నష్టం...



**నాగర్ కర్నూల్ జూన్ 15( స్కై న్యూస్):**మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురు గాలులు భారీ వర్షంతో మిల్లు యజమానికి సుమారు 10 కోట్ల ఆస్తి నష్టం వాటిలినట్లు తెలిసింది. గ్రామ శివారులోని సీత రామాంజనేయ ఇండస్ట్రీస్ లో భారీ మిషనరీ షెడ్డు ధ్వంసం తో పాటు నిల్వ ఉంచిన ధాన్యం నీటిపాలు కావడంతో కోలుకోలేని విధంగా దెబ్బ పడినట్లు నిర్వాహకులు బిల్లకంటి రాజ్యలక్ష్మి రవి కుమార్ తెలిపారు. భారీ ఎత్తున ఒక్కసారిగా గాలి చెలరేగడంతో ఇల్లు పైభాగంలోని కప్పు పైపులు రేకులు మిషనరీపై మరియు ఇతర నిర్మాణాలపై పడిపోవడంతో మోటర్లు నేలకొరిగాయి అదే విధంగా ప్రాసెసింగ్ లో ఉన్న వడ్లు తడిసి ముద్ద కావడంతో నష్టం వాటిలినట్లు తెలిపారు. వెంటనే అప్రమత్తమై కార్మికులను ఒక ప్రాంతానికి చేర్చడంతో ప్రాణాపాయం తప్పిందని తెలిపారు

# హాజరు శాతం పై ప్రత్యేక దృష్టి సారించాలి

### ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య సౌకర్యాలు...
### జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్..



**తెలకపల్లి నాగర్ కర్నూల్ జూన్ 16 (స్కైన్యూస్)** ప్రభుత్వ పాఠశాలలో విద్యను బోధించే ఆధ్యాపకులు ప్రతి విద్యార్థి పై ప్రత్యేక దృష్టి సాధించి విద్యార్థుల హాజరు శాతం పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ కోరారు మంగళవారం తెలకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మరియు రా కొండ యుపిఎస్ పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యాబోధనతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందని వివరించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలను విద్యాసామగ్రి ఆయన అందజేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యా ప్రాముఖ్యతను పెంచి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు



# విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసలు,విద్యా ఉప కరణలు పంపిణీ ..



**నాగర్ కర్నూల్ జూన్ 16 (స్కై న్యూస్)** పట్టణంలోని ఎర్రగడ్డ లో గల సుబ్రహ్మణ్యస్వామి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నాడు విద్యార్థులకు సామూహిక అక్షర అభ్యాసాలు వేదమంత్రచరణల మధ్య శ్రీ శనేశ్వర దేవాలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థితికి చేరుకోవాలని వేద ఆశీర్వచనం చేశారు.నేటి విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానం కూడిన విజ్ఞాన విద్యను అభ్యసించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు,పెన్నులు,పెన్సిల్, విద్య ఉపకరణాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల దేవి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి,బాలకృష్ణ, కిషోర్ గౌడ్,విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నియామకాలలో అన్యాయాన్ని సవరించాలి....

**నాగర్ కర్నూల్ జూన్ 16 (స్కై న్యూస్)** జిల్లాలో ఫ్రీ ప్రైమరీ పాఠశాలలను నూతనంగా నియమించే ఇన్స్ట్రక్టర్ మరియు ఆయా పోస్టులలో ఎస్సీ ఎస్టీ బీసీ సామాజిక వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని సవరించాలని బిసి పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షులు అరవింద్ చారి కోరారు మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం కు వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యా సంవత్సరం ప్రారంభం నుండి ఫ్రీ ప్రైమరీ



పాఠశాలలో నియమించే ఖాళీలను మండలాల యూనిట్ గా తీసుకొని రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా ఎస్సీ ఎస్టీ బీసీలకు అన్యాయం జరుగుతుందని 74 పోస్టులు జీరో పర్సెంట్ నియామకాలు జరగడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. నియామకాలను జిల్లాను యూనిట్గా తీసుకొని చేపట్టాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ వాకిటి ఆంజనేయులు నాయకులు గువ్వల రాజు తిరుపతయ్య వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు

## అశ్వారావుపేటలో ఘనంగా మాజీ ఎమ్మెల్యే మెచ్చా జన్మదిన వేడుకలు





**అశ్వారావుపేట జూన్ 16( స్కై న్యూస్):**నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు మంగళవారం అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఓల్డ్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు జూపల్లి రమణారావు, సున్నం నాగమణి, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ భూక్యా ఉదయజ్యోతి, మందపాటి మోహన్‌రెడ్డి, కాసాని నాగశేష పద్మ, శంకా ప్రసాద్, జుజ్జురపు వెంకన్నబాబు, సంపూర్ణ, జుజ్జురపు శ్రీరామ్మూర్తి, మొటూరి మోహన్, చిక్కం మాధురి, ఎండి రహీన్ బేగం, సంకుల స్వరూపతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## పేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యంగా ముందుకు....

**పథకాల సద్వినియోగంతో ఆర్థికంగా ఎదగాలి**

**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**



**నాగర్ కర్నూల్ జూన్ 16( స్కై న్యూస్)** పేదలు అనారోగ్యం పాడిన పడిన సందర్భంలో వారికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు మంగళవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో పట్టణ మరియు మండలానికి సంబంధించిన లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో కూడా పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆసుపత్రులకు ప్రత్యేక నిధులను మంజూరు చేయడం జరిగిందని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికరించి వైద్య సేవలను విస్తృతం చేయడంతో పాటు మెడికల్ కళాశాలలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించి నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి వైద్యం అందించేందుకు 650 పడకలతో నూతనంగా ఆసుపత్రిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఎంతో ప్రయోజకంగా మారిందని అన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను కార్యకర్తలు నాయకులు గ్రామాలలో ప్రజలకు వివరించాలని అర్హులకు వాటిని అందించే విధంగా కృషి చేయాలని కోరారు లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు మునిసిపల్ చైర్మన్ తీగల సునింద్ర కుమార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జక్కా రాజ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు యాదవ రెడ్డి యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్ కౌన్సిలర్లు సర్పంచులు మాజీ ప్రజాప్రతినిధులు అధికారులు లబ్ధిదారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ముడుమాల్ పాఠశాలలో భారీగా నూతన విద్యార్థుల చేరిక

**స్వాగతం పలికిన ఉపాధ్యాయులు**



**నారాయణపేట జూన్ 16,:( స్కైన్యూస్)**కృష్ణ మండలం ముడుమాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివేందుకు 2026బి2027 సంవత్సరానికి ఆరవ తరగతిలో మంగళవారం భారీ విద్యార్థులుసంఖ్యలో చేరారు. ముఖ్యంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముడుమాల్ ప్రధానోపాధ్యా యులు దండు శేఖర్ ఆధ్వర్యంలో 40 మంది విద్యార్థులు ఆరవ తరగతి లో చేరడం జరిగింది. అదే విధంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మురార్ దొడ్డి ప్రధానోపాధ్యాయులు ఈరన్న గౌడ్ సహోపాధ్యా యులు అజయ్ ఆరుగురు విద్యార్థులను పాఠశాలలో చేర్చడం జరిగింది. నూత నంగా పాఠశాలలో చేరడానికి వచ్చిన విద్యార్థులను పాఠ శాల విద్యార్థులు చప్పట్లతో స్వాగతం పలుకుతూ ఆహ్వా నించారు. అదేవిధంగా ఉపాధ్యాయ బృందం విద్యా ర్థులకు చాక్లెట్లు అందజేస్తూ స్వాగతం తెలిపారు, అనంత రం పాఠశాలలో విద్యార్థుల ను చేర్చడానికి కృషిచేసిన దండు శేఖర్ ను,ఈరన్న గౌడ్, అజయ్ లను పాఠశాల ఉపాధ్యాయ బృందం మర్యా దపూర్వకంగా సన్మానిం చారు. అనంతరం పాఠశా లలో చేరిన ప్రతి విద్యార్థికి పుస్తకాలను,నోటుపుస్తకా లను అందజేసి విద్యార్థి జీవితంలో ఉన్నత పాఠశాల లో చదువు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు . పాఠశాల ఉపాధ్యాయ బృం దం కురుమయ్య, జనార్దన్ రెడ్డి,శ్రీనివాస్,మాధవి,రమేష్ తిమ్మప్ప,హేమ,మీనా కుమారి, పాల్గొన్నారు.

## న్యాయవాది పై అక్రమ కేసు నిరసిస్తూ కోర్టు విధులు బహిష్కరణ..





**నారాయణపేట జూన్ 16: (స్కై న్యూస్)** మహబూబ్ నగర్ లో న్యాయవాది వి.నరేందర్ నాయక్ పై పోలీసులు అక్రమ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ మంగ ళవారం నారాయణపేట బార్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో కోర్టు విధులను న్యాయవాదులు బహిష్క రించారు.ప్రభుత్వం న్యాయ వాదుల పరిరక్షణ చట్టం తీసుకువచ్చినప్పటికీ మహ బూబ్ నగర్ రూరల్ ఎస్సై న్యాయవాదిపై అక్రమ కేసు నమోదు చేయడం చట్టాన్ని ఉల్లంఘించడమే నని పేర్కొ న్నారు.అక్రమ కేసు ఎత్తివే యాలని డిమాండ్ చేస్తూ కోర్టు విధులను న్యాయవా దులు బహిష్కరించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు దామో దర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, సీని యర్,జూనియర్ న్యాయ వాదులు పాల్గొన్నారు.

# కేంద్రంలో అధికారం కాంగ్రెస్ కు కలగానే మిగులుతుంది...

**సామాన్యులకు చేరువలో సాంకేతిక రంగాలు**

**డబల్ ఇంజన్ సర్కారు తోనే రాష్ట్రశీ అభివృద్ధి**

**దోచుకునేందుకే కేంద్రశీ నిధులు దారి మళ్లింపు**

**బిజెపి మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి**





**నాగర్ కర్నూల్ జూన్ 16 (స్కై న్యూస్)** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 12 సంవత్సరాలుగా పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకొని పేద బడుగు బలహీన వర్గాలకు కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవడం జరిగిందని మరో వంద సంవత్సరాలు గడిచిన కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాలేదని బిజెపి మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి అన్నారు మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మోడీ పాలనలో విశ్వాసం అభివృద్ధి ప్రజా సంక్షేమం అంశాలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా దేశంలో మూడు పర్యాయాలు వరుసగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల విశ్వాసం చురగొని అధికారంలోకి రావడం జరిగిందని వివరించారు. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని క్షేత్రస్థాయి నుండి వివిధ దశలలో ప్రజా ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా చేపట్టిన అభివృద్ధి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని దేశం యావత్తులోని పార్లమెంటు స్థానాలను ప్రజలు బిజెపికి కట్టబెట్టారని వరసగా మూడు పర్యాయాలు ప్రధానిగా గెలిచిన నరేంద్ర మోడీ 12 సంవత్సరాల లో ఎంతో అభివృద్ధి సాధించారని కొనియాడారు. పట్టణాల అభివృద్ధి గ్రామాల సుభిక్షం కోసం వందల కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందని గ్రామాలలో సిసి రహదారులు విద్యుత్ దీపాలు గ్రామపంచాయతీలో భవనాలు నిర్మాణాలు వ్యక్తిగత మరుగుదొడ్ల పథకాలకు కోట్లాదినిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణం తో పాటు కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించేందుకు పని దినాలను 125 రోజులకు పెంచడంతోపాటు ప్రతిరోజు 150 రూపాయల నుండి 400 రూపాయల వరకు కూలీలు పెంచడం జరిగిందని వివరించారు. కరోనా కష్టకాలంలో దేశంలో ప్రజలను ఆదుకోవడంతో పాటు విదేశాలకు కూడా వాటికి సంబంధించిన వ్యాక్సిన్ ను అందించడం జరిగిందని తెలిపారు. ఆస్పత్రుల స్థాయిని పెంచడంతోపాటు నియోజకవర్గ కేంద్రాలలో ఆసుపత్రులు నెలకొల్పడంతో పాటు ప్రతి జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనకు ఆయనే సాటి అని అనేక పథకాల వల్ల ప్రపంచం దృష్టిని ఆకర్షించారని తెలిపారు. విద్యా వైద్యంతో పాటు రైల్వే స్టేషన్లో సుందరీకరణకు వేల కోట్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం విడుదల చేసిన నిధులను దోచుకునేందుకు దారి మళ్ళించారని కేంద్ర పథకాల ప్రారంభానికి భూ సేకరణ కూడా చేయడం లేదని ఆరోపించారు. పేదరిక నిర్మూలన మహిళా సాధికారత సబ్బండ వర్గాల సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోడీ నిరంతరం పనిచేస్తున్నారు. రాష్ట్రంలో టిఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనపై కాంగ్రెస్ రెండున్నర సంవత్సరాల పాలనపై ప్రజలు విసుగు చెందారని రాబోయే ఎన్నికలలో కేంద్రంలో రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి తీసుకువస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు సమావేశంలో జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు మాట్లాడుతూ దేశంలో హ్యాట్రిక్ సాధించడంతోపాటు సంక్షేమం అభివృద్ధి పై దృష్టి సారించడం వల్ల ఎన్నో సంవత్సరాలుగా పెనవేసుకుపోయిన సమస్యలను చాకచక్యంగా పరిష్కరించి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. 98% బ్యాంకుల సేవలను సామాన్యులకు అందించే విధంగా కృషి చేయడంతో పాటు విద్యుత్ టెలి కమ్యూనికేషన్ రంగాలలో సరళీకరణ ప్రవేశపెట్టి ప్రభుత్వ రంగ సంస్థలలో మౌలిక వసతులను కల్పించడంతోపాటు ఎన్నో పథకాలను రూపొందించి అమలు చేయడం జరిగిందని వివరించారు. ఈనెల 21 వరకు వివిధ వర్గాలను చైతన్యం చేసేందుకు 12 సంవత్సరాల పాలనపై ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించడం జరిగిందని వివరించారు సమావేశంలో బిజెపి మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యులు కట్ట సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ టిఆర్ఎస్ ప్రభుత్వాలు అవినీతి అక్రమాలకు పాల్పడితే బీజేపీ మాత్రం అవినీతి రైత పాలన అందిస్తూ ముందుకు సాగడం వల్ల రాబోయే ఎన్నికలలో రాష్ట్రంలో 16 ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంటామని దీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ మంత్రులు బిజెపి పై బురదజల్లేందుకు కుట్రలు చేస్తున్నారే తప్ప వాస్తవాలు లేవన్నారు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులకు డిపిఆర్ రూపొందించకుండా కేంద్ర మంత్రులను కలిసిన సందర్భంలో ఎందుకు జాతీయ హోదా ప్రకటించాలని కోరడం లేదని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 100 పర్యాయాలకు పైగా ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులతో నిధులు తీసుకువస్తున్నారు కానీ ప్రధాని నరేంద్ర మోడీతో చర్చించి రాష్ట్రానికి నిధులు వస్తున్న ఇక్కడకు వచ్చి బిజెపిని విమర్శిస్తున్నారని విరుచుకుపడ్డారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత బడుగు బలహీన వర్గాలకు చెందిన మేధావులను గుర్తించి వివిధ హోదాలను కల్పించి గౌరవించడం జరిగిందని గుర్తు చేశారు ఈ సమావేశంలో కార్యక్రమ కన్వీనర్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రం గౌడ్ రాష్ట్ర అధికార ప్రతినిధి తిరుపతిరెడ్డి మహిళా నాయకురాలు బల్మూరు జానకి పద్మ యాదవ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ మాన్య నాయక్ మధుసూదన్ రేనయ్య చందు జెట్టి వెంకటేష్ తిరుమల యాదవ్ తేజస్విని శశిరేఖ యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు

# ఇష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలి

**చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన కలెక్టర్....**







**నారాయణపేట జూన్ 16 (స్కై న్యూస్)** విద్యార్థులు ఇష్టపడి చదివి జీవిత లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నారాయణపేట మండలం లోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలో ముందుగా జాజాపూర్ పాఠశాలకు వచ్చానని, ఈ పాఠశాల వచ్చే సంవత్సరం పదో తరగతి లో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవాలన్నారు. ఈ జిల్లా నుంచి గతంలో బాసర త్రిపుల్ ఐ టి కి ఎంపిక అయ్యారని ఆమె గుర్తు చేశారు. జాజాపూర్ పాఠశాల నుంచి కూడా త్రిపుల్ ఐ టి కి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, ఇష్టంతో చదవాలన్నారు. బట్టి పట్టే విధానానికి స్వస్తి పలకాలన్నారు. లెక్కలను సులువుగా ఎలా చేయాలో విద్యార్థులకు ఆమె ప్రాక్టికల్ గా చేసి చూపించారు. విద్యార్థులకు పదో తరగతే పునాది లాంటిది అన్నారు. రాబోయే పదేళ్ల లో మీరు ఎలా ఉండాలో నోట్ బుక్ లో రాసుకుని, రోజూ దానిని చూస్తూ, అందుకు తగిన ప్రణాళిక ప్రకారం సాధన చేయాలని సలహా ఇచ్చారు. పదో తరగతిలో అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువగా ఉండటం సంతోషంగా ఉందన్నారు. అమ్మాయిలకు ఆర్థిక స్వాతంత్రం కావాలన్నారు. వచ్చే సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో టాపర్ గా నిలిచిన వారికి తన తరపున ప్రత్యేక బహుమతి ఇస్తానని కలెక్టర్ ప్రకటించారు. వచ్చే సంవత్సరం టాపర్ ను తప్పని సరిగా తన వద్దకు తీసుకు రావాలని హెచ్ ఎం కు సూచించారు. విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రయోగ శాల, గ్రంథాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు.

**చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన కలెక్టర్**

జాజాపూర్ అంగన్ వాడిలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలలో చేరిన (అంగన్ వాడీ)చిన్నారులకు జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అక్షరాభ్యాసం చేయించారు. అంతకు ముందు సరస్వతీ మాత చిత్రపటానికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజు, మండల విద్యా శాఖ అధికారి బాలాజీ, ఆయా పాఠశాలల హెచ్ ఎం లు, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# మహాభారతం & భాగవతం రెండూ హిందూ ధర్మానికి రెండు కళ్లు...



**జోగులాంబ గద్వాల, జూన్ 16(స్కై న్యూస్):**మహాభారతం భాగవతం రెండు హిందూ ధర్మానికి రెండు కళ్ళని ప్రతి ఒక్కరు ధర్మాలు పాటించాలని ప్రముఖ ప్రొఫెసర్ పవమాన చార్యులు తెలిపారు. సోమవారం ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించిన ఆయన దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు అర్చకులు ఘనంగా స్వాగతం పలికి స్వామివారి శేష వస్త్రం చిత్రపటాన్ని బహుకరించారు. శ్రీ శేషదాసుల వంశస్తులైన శ్రీ దీరేంద్ర దాస్ స్వగృహంలో మహాభారతం భాగవత పురాణ ప్రవచనాలను పవన్ కుమార్ భక్తులకు వినిపించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాభారతం వేదవ్యాసుడు రచించారని పరిమాణం లక్ష శ్లోకాలు. ప్రపంచంలోనే అతిపెద్ద ఇతిహాసం

తెలుగులో కవిత్రయం – నన్నయ, తిక్కన, ఎర్రన పిలువబడతారని తెలిపారు.

**ముఖ్య కథ:** కౌరవులు పాండవులు. ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగిన కురుక్షేత్ర యుద్ధం.

**ముఖ్య భాగాలు:**

**ఆదిపర్వం:** వంశ కథ, శకుంతల–దుష్యంతుడు

**సభాపర్వం:** మయసభ, జూదం, ద్రౌపది వస్త్రాపహరణం

**అరణ్యపర్వం:** 12 ఏళ్ల అరణ్యవాసం, నల–దమయంతి కథ

**భీష్మపర్వం:** భగవద్గీత ఇక్కడే ఉంది. అర్జునుడికి శ్రీకృష్ణుడు చెప్పిన కర్మయోగం

**కర్ణపర్వం, శల్యపర్వం:** యుద్ధం, పెద్దల మరణాలు

**శాంతిపర్వం:** భీష్ముడు ధర్మాలు చెప్పడం

**స్త్రీపర్వం:** యుద్ధం తర్వాత దుఃఖం

**నీతి:** ధర్మం గెలుస్తుంది. అధర్మం ఎంత బలంగా ఉన్నా నాశనం అవుతుంది.

2. భాగవతం

**రచయిత:** వేదవ్యాసుడు

**తెలుగులో:** పోతనామాత్యుడు – "అల వైకుంఠపురంబులో…" అంటూ రాసిన భక్తి కావ్యం

**ముఖ్య కథ:** విష్ణుమూర్తి అవతారాలు, ముఖ్యంగా శ్రీకృష్ణుడి లీలలు. భక్తికి ప్రాధాన్యత.

**ముఖ్య భాగాలు:**

**ప్రహ్లాద చరిత్ర:** "ఇందు గలడందు లేడని…" – దేవుడు అంతటా ఉన్నాడని నిరూపించిన బాలుడు

**గజేంద్ర మోక్షం:** మొసలి నోట్లో చిక్కిన ఏనుగును విష్ణువు కాపాడటం

**వామనావతారం:** బలి చక్రవర్తి దానం

**దశమ స్కంధం:** కృష్ణ జననం, బాల్య లీలలు, వెన్న దొంగతనం, గోపికలు, రాసలీల, కంస వధ

**రుక్మిణీ కళ్యాణం:** కృష్ణుడు రుక్మిణిని ఎత్తుకెళ్లి పెళ్లి చేసుకోవడం

**నీతి:** భగవంతుడిపై భక్తి, శరణాగతి ఉంటే ఎలాంటి కష్టం నుండైనా గట్టెక్కుతాం.

**తేడా ఏంటి?**

| **మహాభారతం** | **భాగవతం** |
| --- | --- |
| ధర్మం, రాజనీతి, యుద్ధం | భక్తి, శరణాగతి, లీలలు |
| కురుక్షేత్రం, గీత | బృందావనం, వేణుగానం |
| కర్మయోగం చెప్తుంది | భక్తియోగం చెప్తుంది |

మనిషి ఎలా బతకాలో దేవుడిని ఎలా చేరాలో ఒక మాటలో: మహాభారతం బతకడం నేర్పితే, భాగవతం తరించడం నేర్పుతుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో శశాంకదాస్ మధుసూదనాచారి రమేష్ రవి చంద్రశేఖర రావు వాల్మీకి పూజారులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణలు పట్టించుకోని
# మండల అధికారులు

**ఐటీడీఏ అధికారులు చర్యలు తీసుకోవాలి**

**అక్రమ సెల్లార్ జి ప్లస్ త్రీ నిర్మాణాలు తెలిసి కూడా ఎందుకు మౌనం ?**

**రాజకీయ నాయకులకు అధికారులు తలవంచాల్సిందేనా ?**

**జిల్లా కలెక్టర్ ఈ అక్రమ నిర్మాణాలపై దృష్టి పెడితే గాని అధికారులు పనిచేసే పరిస్థితి కనిపించడం లేదు**







**చుంచుపల్లి జూన్ 16 (స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీ పరిధిలో గత కొన్ని రోజులుగా అక్రమ సెల్లార్ నిర్మాణాలు జి ప్లస్ త్రీ నిర్మాణాలు జరుగుతున్న మండల అధికారుల మౌనం వెనుక అంతర్యం ఏమిటో అర్థం కాని పరిస్థితి చుంచుపల్లి మండలంలో నెలకొన్నది. గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతున్న ఐటీడీఏ అధికారులు స్పందించరా ? అధికారులు రాజకీయ నాయకుల మాటలకు లోబడి వారు చేసే వృత్తిని మర్చిపోయిన పరిస్థితి చుంచుపల్లి మండలంలో ఏర్పడ్డది. అక్రమమని తెలిసినప్పటికీ అధికారులు అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయలేకపోతున్నారు. దీనికంతటికి రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని తెలుస్తుంది. వర్షాలు వచ్చి రోడ్లన్నీ జలమయమై మునిగిపోతే పరిస్థితి ఏమిటి? రాజకీయ నాయకులు కాపాడుతారా ప్రజల ప్రాణాలతో చెలగాటాలెదుకు అనీ నిలదీస్తున్న ప్రజలు. గిరిజన చట్టాలను అధికారుల అండదండలతోటే తుంగలో తొక్కుతున్నారని గిరిజన నాయకులు వాపోతున్నారు. ఐటిడిఏ అధికారులు స్పందించి గిరిజనుల చట్టాలని కాపాడాలని అక్రమ సెల్లార్ నిర్మాణాలు జి ప్లస్ త్రీ నిర్మాణాలను నిలుపుదల చేయాలని గత ఐదు సంవత్సరాలుగా అక్రమంగా నిర్మించిన నిర్మాణాలపై ఒక కమిటీని వేసి అక్రమ నిర్మాణాలకు అండగా నిలిచిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గిరిజన చట్టాలను కాపాడాలని కోరుతున్న ప్రజలు. రేపు రాబోయే వర్షాలకు విద్యానగర్ పంచాయతీ ఈ అక్రమ కట్టడాలతో వర్షం నీరు వెళ్లడానికి దారి లేక మునిగిపోయే పరిస్థితి కచ్చితంగా వస్తుందని దానికి పూర్తి బాధ్యత మండల పంచాయతీ అధికారులే బాధ్యత వహించవలసి వస్తుందని చుంచుపల్లి మండలం ప్రజలు విద్యానగర్ ప్రజలందరూ గమనిస్తున్నారని పలువురు తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా పలు రాజకీయ నాయకులు ప్రజా సంఘాలు ఈ అక్రమ నిర్మాణాలను ఖండించాలని విద్యానగర్ పంచాయతీ మునిగిపోకుండా చూడాలని కోరుతున్న ప్రజలు.

## పేద కుయుముబాన్ని
# ఆదుకున్న వెస్సో ట్రస్ట్




**హైదరాబాద్ జూన్ 16:**రామన్నగూడెం, బుట్టాయగూడెం మండలం, ప.గో జిల్లా నివాసి లక్కోజు కనకదుర్గ (63) గత కొన్ని సంవత్సరాలుగా అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ పూర్తిగా మంచానికే పరిమిత మయ్యారు. ఆమె భర్త వెంకటేశ్వర రావు (72) గతంలో వడ్రంగి వృత్తి చేసేవారు. అయితే వృద్ధాప్యం మరియు అనారోగ్య కారణాల వల్ల ప్రస్తుతం ఉపాధి పొందలేక పోతున్నారు. వైద్య ఖర్చులను భరించడానికి కనకదుర్గ కుటుంబం తమ ఇల్లు, స్థలం, బంగారు ఆభరణాలు సహా, ఉన్న అన్ని ఆస్తులను విక్రయించింది. వారి ఇద్దరు వివాహిత కుమార్తెలు కూడా తమ శక్తి మేరకు సహాయం చేస్తున్నారు. ఇప్పటి వరకు వైద్య అవసరాల కోసం సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేశారు. ప్రస్తుతం కుటుంబం అన్ని వనరులను కోల్పోయి, ఇకపై చికిత్స ఖర్చులను భరించే స్థితిలో లేదు! ఈ క్లిష్ట పరిస్థితుల్లో, వారి బంధువు మరియు సామాజిక కార్యకర్త విస్సాకోటి నాగ వెంకట సత్యనారాయణ ద్వారా కనకదుర్గ కుటుంబ సభ్యులు వెస్సో ట్రస్ట్ ను సంప్రదించి ఆమె వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించమని అభ్యర్థించారు.స్పందించిన వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారం తో బ్రహ్మశ్రీ ఐతీ. కే యం కిరణ్ కుమార్ గారి (ఏసిపి, ఆర్థిక నేరాల విభాగం, సి సి ఎస్, హైదరాబాద్) చేతుల మీదుగా లబ్ధిదారు బంధువు సత్యనారాయణ కు 54,400/- రూపాయల చెక్ అందజేశారు. దీజీవీజ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మశ్రీ ఐతీ. వి వి నాగార్జున నాగోజు వారి పంజాగుట్ట కార్యాలయంలో జరిగిన ఈ సేవా కార్యక్రమంలో వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), ఇడికోజు వెంకటాచారి, విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ కార్యదర్శి పివిఆర్కె ప్రసాద్, విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ అధ్యక్షులు విశ్వనాధుల పుష్పగిరి, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు రాయపల్లి కృష్ణమాచారి, దయానంద చారి పాల్గొన్నారు.

# ప్రభుత్వ పట్టా భూమిలో స్థలాలు పేదలకే దక్కాలి





**నాగర్ కర్నూల్ తాడూర్ జూన్ 16 (స్కైన్యూస్)** తాడూరు మండల పరిధిలోని బలన్ పల్లి గ్రామంలో 1999లో ప్రభుత్వం కేటాయించిన పట్టా భూమిలో గల స్థలాలు పేదలకే దక్కాలని బహుజన సమాజ్ పార్టీ పార్లమెంటు ఇంచార్జ్ కళ్యాణ్ మండల అధ్యక్షులు ఆంజనేయులు డిమాండ్ చేశారు మంగళవారం గ్రామాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని రైతు వేదిక సమీపంలో గల సర్వేనెంబర్ 419లో 1999లో ప్రభుత్వం 54 మందికి పట్టా భూమిలో 116 గజాల స్థలాన్ని కేటాయించడం జరిగిందని ఆ స్థలంలో గత ప్రభుత్వం రైతుకు వేదిక నిర్మిస్తే ప్రస్తుత ప్రభుత్వం సబ్ స్టేషన్ నిర్మించాలని ప్రయత్నించడం దారుణమని విరుచుకుపడ్డారు. పేదల ఇంటి స్థలాల పక్కనే గ్రామపంచాయతీకి పట్టా భూమి ఉందని ఆ ప్రభుత్వ భూమిలో సబ్టేషన్ నిర్మించాలని డిమాండ్ చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం నోరు తెరిస్తే బడుగుల ప్రభుత్వమని ప్రకటించుకుంటూ పేదల భూములు లాక్కోవడం దారుణం అన్నారు వెంటనే ఎమ్మెల్యే స్పందించి ఇంటి స్థలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు అర్జున్ శ్రీకాంత్ గ్రామస్తులు ఎల్లమ్మ రాములమ్మ లక్ష్మమ్మ మంగమ్మ వెంకటేశ్వరమ్మ యాదమ్మ శివలీల రామేశ్వరమ్మ బొందయ్య హుస్సేన్ బాలయ్య బాలకిష్టమ్మ బుజ్జమ్మ కృష్ణయ్య హనుమంతు తదితరులు పాల్గొన్నారు

## వి. హనుమంతరావు కు
## శివసేన సుదర్శన్ జన్మదిన శుభాకాంక్షలు




**హైద్రాబాద్ జూన్ 16** ;తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు (బీసీ సంక్షేమ శాఖ), మాజీ మంత్రి ఎంపీ శ్రీ వి. హనుమంతరావు కు శివసేన ఉద్ధవ్ ఠాక్రే తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సుదర్శన్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.నిరంతరం ప్రజల పక్షాన నిలిచే నిఖార్సైన నాయకుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు (బీసీ సంక్షేమ శాఖ), మాజీ మంత్రి ఎంపీ శ్రీ వి. హనుమంతరావు అని సుదర్శన్ కొనియాడారు.సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజా సేవ పట్ల మీ అంకితభావం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం. మీరు ఆయురారోగ్యాలతో, ఆనందంతో, మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు.

## వీధి కుక్కల దాడితో
## రెండు లేగదూడల మృతి
## రైతుకు తీవ్ర నష్టం

**ఫరూఖ్‌నగర్ మండలం దేవునిబండ తండాలో ఘటన**



**రంగారెడ్డి జిల్లా జూన్ 16 (స్కై న్యూస్) :** ఫరూఖ్‌నగర్ మండలం గంటలవెల్లి గ్రామంలోని దేవునిబండ తండాలో వీధి కుక్కల దాడితో రెండు లేగదూడలు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది తండాకు చెందిన రైతు ధరం సోత్ రాములకు చెందిన రెండు లేగదూడలపై వీధి కుక్కలు దాడి చేయడంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యారు స్థానికుల వివరాల ప్రకారం, తండా పరిసర ప్రాంతాల్లో ఉన్న కోళ్ల ఫారాల కారణంగా పెద్ద సంఖ్యలో వీధి కుక్కలు సంచరిస్తున్నాయని తెలిపారు. ఈ కుక్కలు తరచూ లేగదూడలు, నాటు కోళ్లు ఇతర పశువులపై దాడులు చేసి రైతులకు ఆర్థిక నష్టం కలిగిస్తున్నాయని వాపోయారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కల బెడదను నివారించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, రైతుల పశు సంపదకు రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## శివాజీ విగ్రహం, స్మృతివనం నిర్మాణ పనులను
# పరిశీలించిన ప్రముఖ శిల్పి యోగి నింబాల్కర్



**నారాయణపేట జూన్ 16: (స్కైన్యూస్)** నారాయణపేట పట్టణంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించబడు తున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం, స్మృతివనం నిర్మాణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రముఖ శిల్పి, ఛత్రపతి శివాజీ మహారాజ్ మాతృమూర్తి రాజమాత జిజాబాయి వంశస్థులు యోగి నింబాల్కర్ నారాయణపేటకువచ్చి పరిశీలిం చారు.ఈ సందర్భంగా ఛత్ర పతి శివాజీ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరంనారాయణపేటలో ఏర్పాటు చేయబడుతు న్న విగ్రహ స్థలాన్ని సందర్శిం చి, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. అలాగే స్మృతివనం నిర్మా ణం, పరిసరాల అభివృద్ధి, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలు, విగ్రహ స్థాపనకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై కమి టీ సభ్యులతో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా యోగి నింబాల్కర్ మాట్లా డుతూ, తెలంగాణ రాష్ట్రం లోనే అతిపెద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం నారాయణపేటలో ఏర్పాటు కావడం ఎంతో ఆనందకర మైన విషయమని పేర్కొన్నా రు. సుమారు 17 అడుగుల ఎత్తైన గుర్రంపై ఆసీనుడై ఉన్న ఛత్రపతి శివాజీ మహా రాజ్ విగ్రహం నారాయణ పేట పట్టణానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురావడమే కాకుండా, భావితరాలకు స్ఫూర్తినిచ్చే చారిత్రక చిహ్నం గా నిలుస్తుందని అన్నారు.విగ్రహ నిర్మాణం, స్మృతివ నం అభివృద్ధి, పరిసరాల సుందరీకరణ సందర్శకులకు మెరుగైన అనుభూతిని కలిగించే విధంగా చేపట్టాల్సి న పలు అంశాలపై విలువైన సూచనలు, సలహాలు అందించారు. విగ్రహ నిర్మా ణం అత్యున్నత ప్రమాణాల తో, శాశ్వతంగా నిలిచే విధం గా చేపట్టాలని సూచిస్తూ, ఈ మహత్తర కార్యక్రమానికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణ కమిటీ గౌరవ అధ్యక్షులు జి. కుర్మన్న , యోజన సంఘ అధ్యక్షులుయు. మహేష్ , ప్రధాన కార్యదర్శి శ్రీపాద కులకర్ణి , వెంకటేష్ గౌడ్, పల్లా రఘు, మహాదేవ్, నవీన్, జితూ పటేల్, ఆవిరి వీరేశ్ (అప్పి), మనీ మోడీ గ, గోపీ కృష్ణ , వెంకటేష్, మల్లి కార్జున్ తదితర కమిటీ సభ్యులు, శివాజీ అభిమాను లు పాల్గొన్నారు. నారాయణ పేటలో నిర్మించబడుతున్న ఈ విగ్రహం, స్మృతివనం పట్టణ చరిత్రలో ఒక మైలు రాయిగా నిలిచి, ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరత్వం, దేశభక్తి, ధర్మరక్షణ సందేశాల ను భావితరాలకు చాటిచెప్పే స్ఫూర్తి కేంద్రంగా మారాలని కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆకాంక్షించారు.

## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా
## కలిసిన నూతన ఎం వి ఐ ఎస్.కే. మున్నీ



**నారాయణపేట జూన్ 16: (స్కైన్యూస్)**నారాయణపేట జిల్లాకు నూతనంగా నియమితులైన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కే. మున్నీ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం లో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అంద జేసి శుభాకాంక్షలుతెలిపారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎం.వి.ఐ ఎస్.కే. మున్నీకి అభినందనలు తెలియజేశారు. జిల్లాలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియం త్రణ, ప్రమాదాల నివారణ, ప్రజల్లో రవాణా నిబంధన లపై అవగాహన కల్పించడం వంటి అంశాల్లో రవాణా శాఖ, పోలీసు శాఖలు సమ న్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అవసరమైన చర్యలను అన్ని శాఖలు సమిష్టిగా చేపట్టాల ని, ప్రజల ప్రాణ రక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశం లో ఏ ఎం వి ఐ సాయి తేజ రెడ్డి,ఆర్టీవో మెంబర్ పోషల్ రాజేష్ పాల్గొన్నారు.

## తరచూ రక్తదానం ఇవ్వటం వలన
# క్యాన్సర్ ముప్పు తప్పుతుంది

**రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి**




**వికారాబాద్ జూన్16:** ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వికారాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నేడు తాండూరులోని బెల్కటూర్ యందుగల ఆదాని సిమెంట్ ఫ్యాక్టరీ యందు స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి మాట్లాడుతూ రక్తదానం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తరచూ రక్తదానం ఇవ్వటం వలన క్యాన్సర్ ముప్పు తప్పుతుంది అని సంవత్సరంలో ఒక్కసారైనా ఇస్తే గుండెపోటు ముప్పు 88% మేర తగ్గించుకోవచ్చు అని రక్తంలో ఉండే అధిక శాతం ఇనుము వల్ల రక్తనాళాలు పూడికపోయి గుండెపోటు ముప్పు ఉంటుంది అని. రక్తదానముతో ఈ ఇనుము నిల్వలు తగ్గుతాయి అని తద్వారా కాలేయము ఆరోగ్యముగా బాగుంటుంది అని ఒక్కసారి రక్తదానం చేయడం వలన 650 కిలో క్యాలరీలు తగ్గినట్లే అని ఈ ప్రక్రియ ద్వారా శరీర బరువు అదుపులోకి వస్తుంది అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు. 266 మంది రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని రక్తదానం చేసిన ప్రతి ఒక్క రక్తదాతను అభినందించారు. ఆ రక్తాన్ని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి తాండూరు లోని రక్త నిధి కేంద్రము మరియు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వికారాబాద్ యందు గల రక్త నిధి కేంద్రము వారు పాల్గొని ఆ రక్తాన్ని సేకరించారని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి పేర్కొన్నారు.

వార్తాతరంగాలు
బుధవారం 17 జూన్ 2026

## సంపర్క్ అభియాన్ లో అదిత్య పరాశ్రీ నీ కలిసిన నామాజీ



**నారాయణపేట జూన్ 16;( స్కైన్యూస్)** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారి ప్రభుత్వ సుపరిపాలన కు 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మెరకు బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణసంఘ,సంపర్క్ అభియాన్ రాష్ట్ర సభ్యులు సీనియర్ నాయకులు నాగురావు నామాజి సమాజంలో గల ప్రతిష్ఠిత వ్యక్తులతో సంపర్క్ కార్యక్రమంలో భాగంగా మంగళ వారం నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం బిజ్వార్ అంబత్రయ క్షేత్రం ఆదిత్య పర శ్రీ స్వామీజీనీ కలిశారు.ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించిన సమయం లో నెలరోజుల పాటు అరెస్ట్ నింగి రెడ్డి , శేషాప్ప, భీంశప్ప, రమేష్ గార్లతో ఆప్యాయంగా కలిసి దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సంకల్పంతో దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమ లతో అన్ని రాష్ట్రాలను సమానముగా సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనే నినాదం తో దేశాన్నీ ముందుకు తీసుకె ళుతున్న వారి పరిపాలన గూర్చి, కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివారించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ ,బిజెపి మండల అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్ ,జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్ కృష్ణయ్య గౌడ్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు కృష్ణ,జిల్లా మీడియా కన్వీనర్ కిరణ్ ధగే,జిల్లాఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కొండను గోపాల్ , మాజీ ఎంపిటిసి ఆశపన్న ,మండల ప్రధాన కార్యదర్శులు రణవీర్, తార కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## లంబాడి హక్కుల పోరాట సమితి కార్యకర్తల అరెస్టుపై ఆందోళన

**రంగారెడ్డి జిల్లా జూన్ 16 ( స్కై న్యూస్ ) :** రంగారెడ్డి జిల్లా కేశంపేట్ మండలంలో లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) మండల అధ్యక్షుడు జరుపుల రాజు నాయక్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూడవాత్ రాంబల్ నాయక్ తీవ్రంగా ఖండించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడి హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్న కార్యకర్తలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు అరెస్టు చేసిన ఎల్‌హెచ్‌పీఎస్ కార్యకర్తలను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని పోలీసు శాఖను డిమాండ్ చేశారు లంబాడి సమాజ హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని, కార్యకర్తలపై అనవసర చర్యలు చేపట్టవద్దని ప్రభుత్వాన్ని కోరారు.



## మల్లన్న క్షేత్రంలో నృత్య ప్రదర్శన చేసిన ఆత్మకూరు చిన్నారులు

**ఆత్మకూర్ జూన్ 16 (స్కై న్యూస్)** శ్రీశైలం మల్లన్న క్షేత్రంలో నృత్యం ప్రదర్శన కార్యక్రమాన్ని దేవస్థానం వారు ఇటీవల చేపట్టారు ఇందులో భాగంగా ఆత్మకూరు పట్టణానికి చెందిన అకాడమీ చిన్నారులకు అవకాశం లభించింది సోమవారం రాత్రి శ్రీశైలం మల్లన్న క్షేత్రంలో సన్నిధిలో మారుతి డ్యాన్స్ అకాడమీ చెందిన చిన్నారుల యొక్క కలఅద్భుతంగా నృత్యాన్ని ప్రదర్శించారు శ్రీశైలంలో అవకాశం రావడం వల్ల విద్యార్థులను అభినందనలతో శాలువా కప్పిసన్మానం చేయడం జరిగింది అకాడమిక్ నిర్వహణలో సంతోషం వ్యక్తం చేశారు



## 1లక్ష రూపాయల ఎల్ ఓ సి లెటర్ ను అందజేసిన ఎమ్మెల్యే

**జోగులాంబ గద్వాల, జూన్ 16 (స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల టౌన్ చెందిన పార్వతమ్మ జయ రామన్న గౌడ్ కు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 1లక్ష రూపాయల ఌజ లెటర్ ను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు జీ వేణుగోపాల్ , నాయకులు సాయిశ్యామ్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## లంగర్ హౌస్‌లో స్కూల్, కాలేజ్ బస్సులపై ఆర్టీవో ప్రత్యేక తనిఖీలు

హైదరాబాద్‌లోని లంగర్ హౌస్ టిప్పు ఖాన్ పూల్ వద్ద రంగారెడ్డి ఆర్టీవో అధికారులు స్కూల్, కాలేజ్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా బస్సుల్లో ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఫైర్ సేఫ్టీ పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉన్నాయా లేదా అనే అంశాలను పరిశీలించారు.అలాగే బస్సు డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉందా లేదా అనే విషయాన్ని కూడా అధికారులు తనిఖీ చేశారు. 60 సంవత్సరాలు దాటిన డ్రైవర్లతో స్కూల్, కాలేజ్ బస్సులు నడపించవద్దని విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు.ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు కొనసాగిన ఈ తనిఖీలను మూడు బృందాలుగా విభజించి వివిధ ప్రాంతాల్లో నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు సుమారు 50 నుంచి 60 స్కూల్, కాలేజ్ బస్సులను తనిఖీ చేయగా, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని ఆరు బస్సులకు చలాన్లు విధించినట్లు తెలిపారు.విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ మరో వారం రోజుల పాటు ఈ ప్రత్యేక తనిఖీలు కొనసాగనున్నట్లు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అవినాష్ చౌహాన్ తెలిపారు.

# ప్రేమమూర్తి - ప్రభాకర్ జీ

కొంతమంది తమ కుటుంబం కొరకు జీవిస్తే, మరికొందరు కుటుంబంతో పాటు సమాజం కొరకు ఎంతో కొంత సేవ చేసే వారు ఉంటారు. కుటుంబం అనేది లేకుండా తన యావత్ జీవనాన్ని దేశ సేవకే అంకితం చేసే మహనీయులు, త్యాగమూర్తులు చాలా అరుదు. అటువంటి త్యాగమయ జీవితాన్ని గడిపిన వారిలో ప్రభాకర్ జి ఒకరు. స్వాతంత్ర్య అనంతరం గాంధీ మార్గంలో నడిచిన వారిలో చెప్పుకోదగిన వ్యక్తి ఈ ప్రభాకర్ జి గారు.వీరు ఆంధ్ర ప్రదేశ్ లోని అనంతపూర్ జిల్లాలో జన్మించినారు . మొదటి నామదేయం శ్రీ జోసఫ్. మచిలీపట్నం జాతీయ కాలేజీలో చదువు పూర్తి చేసుకొని, గాంధీ గారి సిద్ధాంతాలకు ఆకర్షితులై, గాంధీగారి సేవాగ్రాంలో చేరినారు. గాంధీ, కస్తూరిబా అనుంగు శిష్యులుగా, పరిచారకులుగా అనతి కాలంలోనే పేరు పొందినారు.ఆ సమయంలో వారి పేరు ప్రభాకర్ జీగా మార్చుకున్నారు.ఆంధ్రప్రదేశ్ గాంధేయ నిర్మాణ కార్యక్రమాలకు, ఖాదీ స్వచ్ఛంద సంస్థల స్థాపనకు మార్గదర్శకత్వం వహించారు , హైదరాబాదులో గాంధీ జ్ఞాన మందిర్, విజయవాడలో గాంధీ హిల్స్ వీరి యొక్క కృషి ఫలితంగానే ఏర్పడినవి. 1955లో నాకు భాయిజీ పరిచయం, సహచర్యం లభించింది. వారి సలహాలు సూచనలతో భూదాన యజ్ఞ సమితి కార్యకర్తగా మహబూబ్ నగర్ జిల్లాలో విస్తృతంగా పనిచేసే అవకాశం లభించింది. ఈ కార్యక్రమ నిర్వహణలో మాకు ఉత్పన్నమయ్యే సమస్యలను వారి దృష్టికి తీసుపోగా, వారు చక్కని పరిష్కార మార్గాలను సూచించేవారు.గాంధీ స్మారక నిధి నుంచి భూదాన యజ్ఞంలో పనిచేసే కార్య కర్తలకు కొంత ఆర్థిక సహాయం లభిస్తూ ఉండేది. ఆకస్మాత్తుగా పై సంస్థవారు డబ్బు పంపటం నిలిపివేశారు. నేను భాయిజీకి ఈ విషయం తెలియజేస్తూ ఒక లేఖ వ్రాశాను. వారు వెంటనే తగిన సహాయం అంద జేయగలనని లేఖ వ్రాశారు. కొద్దిరోజులలో మాకు అవసరమైన డబ్బు పంపించటం



జరిగింది. తమ నేతృత్వం కింది సంస్థలలో పనిచేసే కార్యకర్తల కష్టసుఖాలు తెలుసుకొని వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేసేవారు .

సేవాగ్రం లో చురుకైన పాత్ర పోషించడం వల్ల వారికి అటు ఉత్తర భారతదేశంలో ఇటు దక్షిణ భారతంలోని నిర్మాణ సంస్థలతో సంబంధం ఉండేది. యావత్ భారతదేశంలో గాంధేయ నిర్మాణ కార్యకర్తలందరూ వారికి సూపరిచితులే. అఖిల భారత స్థాయి సంస్థలకు ఎన్నింటికో వారు అధ్యక్షులుగా, సలహాదారుగా సేవలందించారు. మధ్యనిషేధం, ప్రకృతి చికిత్స, ఖాదీ, కుష్టు వ్యాధి నివారణవంటి అనేక నిర్మాణ సంస్థలకు అఖిల భారత స్థాయిలో వారు నాయకత్వం వహించి, అత్యంత జయ ప్రదంగా నిర్వహించి, అందరి మన్ననలకు పాత్రులై నారు. శివరాంపల్లి సర్వోదయ ఆశ్రమంలో నివాసం ఉంటూ ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండలి ప్రథమ అధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ భూధాన్, గ్రామ దాన బోర్డుకు ప్రథమ అధ్యక్షులుగా, గాంధీభవన్ కార్యస్థలంగా బాధ్యతలు నిర్వహిస్తూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశులో మారుమూల ప్రాంతాల వరకు తమ కార్యక్రమాలను విస్తరింప చేశారు.భాయిజీ కులమతాలకు అతీతులు. హిందూ మహమ్మ దీయ ఐక్యతకు వారు చేసిన కృషి శ్లాఘనీయమైనది. రంజాన్, బక్రీద్ పండుగల సందర్భంలో ప్రత్యేకంగా వెళ్ళి మహమ్మదీయ సోదరులకు శుభాకాంక్షలు తెలిపేవారు. ఎక్కడ మతకలహాలు సంభవించినా, తుఫాను వరదల వంటి ప్రకృతి భీభత్సాలు వచ్చినా ఆయన అక్కడికి వెళ్ళి స్వయంగా సహాయ కార్యక్రమాలు చేపట్టేవారు. గాంధీ క్షేత్రం అవనిగడ్డ కార్య క్షేత్రముగా **శ్రీ మండల వెంకటకృష్ణ రావు గారితో కలిసి సహాయ** కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దేశీయ,విదేశీయ స్వచ్ఛంద సంస్థలు సహాయ సహకారాలు లభించాయి.1977 సం.లో క్రిష్ణా గుంటూరు జిల్లాలో ఉప్పెన వరదలు వచ్చినప్పుడు తీవ్ర ప్రాణం నష్టము ఆస్తి నష్టం జరిగిన సందర్భంలో ప్రభాకర్ జి స్వయంగా సామూహిక శవ దహన సంస్కారములు నిర్వహించి స్వచ్ఛంద సంస్థలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన వ్యక్తి అనుటలో అతిశయోక్తి ఎంతమాత్రంలేదు. కోస్తా జిల్లాలలో తుఫాను బాధితుల సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తూ అస్వస్థతకు గురై భాయిజీ 17 జూన్ 1979 తుది శ్వాస విడిచినారు. తదనంతరం వారి యొక్క పార్థవ శరీరాన్ని హైదరాబాద్ ముఖ్య పట్టణం తీసుకువచ్చి, రాజకీయ నాయకులు, పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శివరాంపల్లి సర్వోదయ ఆశ్రమంలో సమాధి చేయటం జరిగినది. సేవా తత్పరుడు, గాంధేయ ఆశ్రమ వాసి, త్యాగశీలి, ఆజన్మ బ్రహ్మచారి అయిన శ్రీ భాయిజీ, కరుణ ప్రేమలతో నడిచిన మార్గంలో ఆయన చేపట్టిన కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలుపర్చటం ద్వారా ఆయనకు మనం జోహారులు అర్పించి... శ్రద్ధాంజలి ఘటిద్దాం.

జి.వి. సుబ్బారావు, అధ్యక్షుడు
తెలంగాణ గాంధీ స్మారక నిధి
944029 6710.

# ఇసుక అక్రమ రవాణాను నిరోధించాలి

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలి**

**నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు**

**ఎస్ఐఆర్ ప్రక్రియను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలి**

**కస్తూర్బా పాఠశాలలను సమర్ధవంతంగా నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జోగులాంబ గద్వాల, జూన్ 16 (స్కై న్యూస్):**ఇసుక అక్రమ రవాణాను నిరోధించాలని, ఇసుకను బుక్ చేసుకునే వినియోగదారులకు నిబంధనల ప్రకారం సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ రాజోలి మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా సమీపంలోని తుమ్మిళ్ల ఇసుక ర్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక ర్యాంపు వద్ద సమగ్ర కార్యకలాపాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిసి కెమెరాల నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. మైనింగ్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అక్కడి రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలు చేశారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ రాజోలిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించారు. అక్కడి సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించి రంజిత్ కుమార్, కిష్టమ్మ అనే ఉద్యోగులు చాలా రోజులుగా హాజరు నమోదు చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సిందిగా వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. పిహెచ్ సి లో రోగుల సంఖ్య చాలా తక్కువగా ఉందని, ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా వైద్య సిబ్బంది పనితీరును మెరుగుపరచుకోవాలన్నారు. వివిధ రిజిస్టర్ లను సమగ్రంగా పరిశీలించి అప్డేషన్ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలను పరిశీలించి నెల రోజుల్లో సిబ్బంది తమ పనితీరును మెరుగుపరచుకోకుంటే తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు అనంతరం రాజోలి తహసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసిందని, దాని ప్రకారం సంబంధిత అధికారులు ముందుకెళ్లాలన్నారు. బిఎల్ఓ లకు సమగ్రంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై శిక్షణ ఇచ్చి, ఈనెల 26 నుంచి వారి పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఇంటింటికి తిరిగి ఓటర్లకు ఎనిమరేషన్ ఫారాలను అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా భూభారతి, సాదాబైనామా, తదితర దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ తహసిల్దార్ కు సూచించారు. మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో సమీపంలో ఏర్పాటుచేసిన జొన్న కొనుగోలు కేంద్రంను సందర్శించి అక్కడి రైతులు, అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. రాజోలి కస్తూర్బా విద్యాలయంను కూడా సందర్శించిన జిల్లా కలెక్టర్ అక్కడ స్టాఫ్ హాజరు పరిశీలించి, సిబ్బంది వివరాలను అడిగారు. విద్యా సంస్థలు పున ప్రారంభమై రెండు రోజులవుతున్న విద్యార్థులు రాకపోవడమేమిటని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి విద్యార్థులు విద్యాలయంకు వచ్చేలా చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం కలెక్టర్ అక్కడి పలు విభాగాలను పరిశీలించి అడ్మిషన్స్ కోసం వచ్చే విద్యార్థుల కోసం వంట చేయకపోవడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాలయంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించి, అదనపు తరగతి గదుల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా, ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అనంతరం రాజోలి గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి, ఉప సర్పంచ్ సంధ్యారెడ్డి పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ పర్యటనలో తహసిల్దార్ రామ్మోహన్, ఎంపీడీవో సయ్యద్ ఖాన్, మార్క్ఫెడ్ డిఎం చంద్రమౌళి, ఎస్సై గోకారి, తదితరులున్నారు.

## పర్దిపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

**సర్పంచ్ తెలుగు శివ కుమార్**

**చిన్నచింతకుంట జూన్ 16 (స్కై న్యూస్);** చిన్నచింతకుంట మండలం, పర్దిపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థు లకు అక్షర అభ్యాసాన్ని నేర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్న పిల్లల కోసమే ప్రభుత్వం ఎంతో కష్టపడి పౌష్టికాహారాన్ని పంపిస్తుంది. అట్టి పౌష్టిక ఆహారాన్ని విద్యార్థులకు దగ్గరుండి తినిపించి అక్షరాభ్యాసం నేర్పించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు



నేపాల్, ఉపాధ్యాయులు, గ్రామానికి సంబంధించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చిన్నారుల విద్యాభ్యాసానికి తొలి అడుగు అక్షరాభ్యాసం --- భవిష్యత్తుకు బలమైన పునాది. ప్రైవేటు పాఠశాలలు వద్దు, ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

## దామరగిద్ద పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ వినీత్

**నారాయణపేట జూన్ 16: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం దామరగిద్ద పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతినీ దామ రగిద్ద ఎస్ఐ నరేష్ ను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుతు న్న సేవలపై ఆరా తీశారు. బాధితులకు ప్రజలకు వేగ వంతమైన పోలీస్ సేవలు అందించాలని ఏవైనా సంఘ టనలపై సమాచారం అందు కున్న వెంటనే బాధితుల ఇళ్లకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి ఆన్ సైట్ ఎఫ్ ఐ ఆర్ కేసులు నమోదు చేయాలని ఎస్పీ సూచించా రు. అర్ధరాత్రి వేళ గ్రామాలలో రాత్రి వేళల్లో దొంగతనాలు జరుగుకుండా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. వివిధ సమస్యల పై ఫిర్యాదులు చేయడానికి వచ్చిన బాధితులతో సమర స్యంగా మాట్లాడి వారి సమ స్యలు అడిగి తెలుసుకొని సమస్యలపై సిబ్బంది వేగం గా స్పందించాలని ఆదేశించా రు.పోలీసు సిబంది క్రమ శిక్షణ సమయ పాలన పాటించాలని అన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై అత్యంత వేగంగా స్పందిం చాలని సూచించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యక లాపాలు, అక్రమ రవాణాను కఠినంగా నిరోధించాలని ఆదేశించారు. ప్రధాన రహదా రిపై భద్రతను మరింత కట్టు దిట్టం చేయాలని సూచించా రు. రోడ్డు ప్రమాదాల నివార ణ, సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలనపై ప్రజల్లో నిరంత రం అవగాహన కల్పించాలని ఎస్పీ పేర్కొన్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ వాటి ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. రాత్రి సమయం లో విధుల్లో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, పరిస్థి తులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలకు పూర్తిస్థాయిలో భద్రత, రక్షణ కల్పించాలని ఆదేశించారు.విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా, ప్రభుత్వ బాధ్యతాయుతంగా వ్యవ హరించి ప్రజలకు చేరువలో ఉంటూ మెరుగైన పోలీసింగ్ అందించాలని తెలిపారు.



## హైరిస్క్ 'బీటింగ్ హార్ట్' సర్జరీలో

# యశోదా వైద్యుల అరుదైన విజయం

**గుండె ఆగకుండా నాలుగు బైపాస్‌లు..**

**ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి కొత్త జీవితం**

**మహబూబ్‌నగర్, జూన్ 16 (స్వైన్యూస్ ):** గుండెపోటుతో పాటు గుండెకు రక్తాన్ని సరఫరా చేసే మూడు ప్రధాన ధమనులు పూర్తిగా మూసుకుపోవడం, గుండె పంపింగ్ సామర్థ్యం తీవ్రంగా తగ్గిపోవడం, మధుమేహం-రక్తపోటు వంటి అనుబంధ వ్యాధులతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగికి మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు అత్యంత అరుదైన లి'హైరిస్క్ బీటింగ్ హార్ట్ బైపాస్ సర్జరీ'లిని విజయవంతంగా నిర్వహించి కొత్త జీవితం ప్రసాదించారు. గుండెను ఆపకుండా, హార్ట్-లంగ్ మెషీన్ సహాయం లేకుండానే ఒకేసారి నాలుగు బైపాస్ గ్రాఫ్టులు అమర్చడం ఈ శస్త్రచికిత్స ప్రత్యేకతగా నిలిచింది.మహబూబ్‌నగర్ జిల్లా ముండారి తండాకు చెందిన 53 ఏళ్ల ముదావత్ రాజు నాయక్ తీవ్రమైన ఛాతినొప్పి, అధిక చెమటలు, తలతిరుగుడు లక్షణాలతో ఆసుపత్రిని ఆశ్రయించారు. వైద్య పరీక్షల్లో ఆయనకు ట్రిపుల్ వెసెల్ డిసీజ్ (ఎఒణ), అక్యూట్ కొరోనరీ సిండ్రోమ్ (ఎ సి ఎస్ ), యాంటీరియర్ వాల్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్ (ఎ డబ్ల్యూ ఎం ఐ ), తీవ్రమైన లెఫ్ట్ వెంట్రిక్యులర్ సిస్టోలిక్ డిస్‌ఫంక్షన్, మధుమేహం, రక్తపోటు ఉన్నట్లు నిర్ధారణ అయింది. గుండె పనితీరు ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో అత్యవసర బైపాస్ శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ణయించారు. యశోదా ఆసుపత్రి కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ అండ్ వాస్క్యులర్ సర్జన్ డా. వెంగల్ రెడ్డి ఎస్ ఆధ్వర్యంలో మార్చి




10న ఆఫ్-పంప్ కొరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్(ఒ పి సి ఎ బి ఇ4) శస్త్రచికిత్స నిర్వహించారు. గుండె కొట్టుకుంటూనే ఉండగా నాలుగు ప్రధాన ధమనులకు బైపాస్ గ్రాఫ్టులు అమర్చడంతో పాటు దెబ్బతిన్న కొరోనరీ ధమనిలో ఎండార్టరెక్టమీ కూడా విజయవంతంగా చేశారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ ఎలాంటి ప్రధాన సమస్యలు తలెత్తకుండా ఆపరేషన్‌ను పూర్తి చేశారు.శస్త్రచికిత్స అనంతరం రోగికి కార్డియాక్ ఐసీయూలో ప్రత్యేక పర్యవేక్షణ, వెంటిలేటర్ సపోర్ట్, ఇనోట్రోపిక్ మందులు, యాంటీబయాటిక్స్, కార్డియాక్ మెడికేషన్స్, ఫిజియోథెరపీ, రక్త ఉత్పత్తుల మద్దతు అందించారు. తొలి రోజే వెంటిలేటర్‌ను తొలగించగా, గాయం వేగంగా మానింది. ఎలాంటి ప్రధాన గుండె సంబంధిత సమస్యలు తలెత్తకుండానే రోగి క్రమంగా కోలుకుని నడిచే స్థితికి చేరి ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారు.ఈ సందర్భంగా డా. వెంగల్ రెడ్డి మాట్లాడుతూ, "ట్రిపుల్ వెసెల్ డిసీజ్, గత గుండెపోటు, గుండె పంపింగ్ శక్తి తీవ్రంగా తగ్గిన రోగులపై బీటింగ్ హార్ట్ బైపాస్ నిర్వహించడం అత్యంత సవాలుతో కూడుకున్నది. సరైన సమయంలో తీసుకున్న నిర్ణయం, ఆధునిక శస్త్రచికిత్స పద్ధతులు రోగి ప్రాణాలను కాపాడాయి" అని తెలిపారు.ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డా. వెంకట్ రెడ్డి బి మాట్లాడుతూ, "గుండెపోటు అనంతరం సరైన సమయంలో బైపాస్ శస్త్రచికిత్స చేయడం వల్ల గుండెకు రక్తప్రసరణ పునరుద్ధరించడంతో పాటు భవిష్యత్తులో సంభవించే తీవ్రమైన గుండె సమస్యలను నివారించగలిగాం" అని పేర్కొన్నారు.సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్, డయాబెటాలజిస్టు డా. కృష్ణమోహన్ రెడ్డి జి మాట్లాడుతూ, మధుమేహం, రక్తపోటు వంటి అనుబంధ వ్యాధులు చికిత్సను మరింత క్లిష్టతరం చేసినప్పటికీ సమన్వయంతో కూడిన వైద్య సేవలు, నిరంతర పర్యవేక్షణ, సమగ్ర చికిత్స వల్ల రోగి విజయవంతంగా కోలుకున్నారని తెలిపారు.యశోదా ఆసుపత్రి యాజమాన్యం ప్రకారం, గుండె పంపింగ్ సామర్థ్యం తీవ్రంగా తగ్గిపోయిన రోగిపై గుండెను ఆపకుండా నాలుగు బైపాస్ గ్రాఫ్టులు అమర్చడం అత్యంత అరుదైన ప్రక్రియ. ప్రాణాంతక పరిస్థితి నుంచి రోగిని కాపాడటం ఆధునిక కార్డియాక్ సర్జరీ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొంది. తెలంగాణలో అత్యాధునిక గుండె వైద్య సేవల కేంద్రంగా యశోదా ఆసుపత్రులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నాయని వెల్లడించింది.

## సన్న వడ్ల రైతులకు

# సర్కార్ గుడ్‌న్యూస్..

**వ్యవసాయ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు!**

**హైదరాబాద్, జూన్ 16:**తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వ్యవసాయ శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సాంకేతికత వినియోగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో బోనస్ అందించే ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించడంతో పాటు రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని ఆదేశించారు. సన్న వడ్లు పండించే రైతుల పూర్తి వివరాలను సేకరించాలని, ధాన్యం దిగుబడులపై వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని పేర్కొన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో అమలు చేస్తున్న పైలెట్ ప్రాజెక్టును మరింత విస్తరించాలని ముఖ్యమంత్రి సూచించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగాన్ని పెంచాలని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను వ్యవసాయ సేవల్లో ఉపయోగించాలని చెప్పారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని నోడల్ ఏజెన్సీగా నియమించి, విత్తనాల సరఫరా నుంచి ధాన్యం కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, ఆయిల్‌ఫెడ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేయాలని, యాప్ ద్వారా బుక్ చేసుకున్న యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్లకు యూరియా పంపిణీ బాధ్యతలు అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అదేవిధంగా ఎరువుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వానికి నిరంతరం లేఖలు రాయాలని, రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే ఎరువులను తెలంగాణకే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం స్పష్టం చేశారు. ఈ అంశంపై అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించాలని కూడా సూచించారు.

# రైతులకు 75 వేల రుణమాఫీ

**చెన్నై, జూన్ 16:** సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలోని అన్నదాతలకు భారీ ఊరటనిస్తూ సహకార రంగంలో రూ.75,000 వరకు వ్యవసాయ రుణాలను పూర్తిగా మాఫీ చేస్తున్నట్లు జూన్ 16న ప్రకటించారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 14.43 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుండగా, ప్రభుత్వ ఖజానాపై రూ.5,932.23 కోట్ల మేర దనపు భారం పడనుంది.ముఖ్యమంత్రి విజయ్ మే 25న విడుదల చేసిన తొలి రుణమాఫీ ఉత్తర్వులపై రైతులు, విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. నాడు కేవలం రూ.50,000 వరకు మాత్రమే రుణమాఫీ ప్రకటించారు. అదీ కాకుండా లోన్ అమౌంట్ పెరిగే కొద్దీ మాఫీ మొత్తం తగ్గిపోతూ, రూ.1 లక్ష దాటిన వారికి కేవలం రూ.5,000 మాత్రమే ఫ్లాట్ వైవర్ ఇచ్చారు. ఇది టీవీకే ఎన్నికల మేనిఫెస్టోను వంచించడమేనని విపక్షాలు మండిపడ్డాయి. దీంతో వెనక్కి తగ్గిన సీఎం విజయ్, జూన్ 15న ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి పాత నిబంధనలను పూర్తిగా రద్దు చేస్తూ సరికొత్త సవరించిన ప్యాకేజీని ప్రకటించారు.తాజా సవరణ ప్రకారం ల్యాండ్ హోల్డింగ్స్ లేదా సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా.. చిన్న, మధ్యరక, పెద్ద రైతులందరికీ ఈ పథకం వర్తిస్తుంది. సహకార బ్యాంకుల్లో రూ.75,000 లేదా అంతకంటే తక్కువ క్రాప్ లోన్ ఉన్న ప్రతి రైతుకు 100% పూర్తి రుణమాఫీ లభిస్తుంది. ఒకవేళ రుణం అంతకంటే ఎక్కువగా ఉంటే, వారికి ఒకే మొత్తంగా రూ.35,000 ఫ్లాట్ రుణమాఫీ వర్తింపజేస్తారు. మే 1, 2025 నుండి ఫిబ్రవరి 28, 2026 మధ్య కాలంలో సహకార బ్యాంకుల ద్వారా తీసుకున్న పంట రుణాలకు మాత్రమే ఈ ఊరట లభించనుంది. గతంలో ప్రకటించిన రూ.50,000 పరిమితి వల్ల ప్రభుత్వానికి కేవలం రూ.2,044 కోట్ల ఖర్చు మాత్రమే వచ్చేది. కానీ ఇప్పుడు పరిమితిని రూ.75,000 కి పెంచడం, పెద్ద రైతులకు కూడా రూ.35,000 చొప్పున రాయితీ ఇవ్వడం వల్ల ప్రభుత్వ బడ్జెట్‌పై ఏకంగా రూ.5,932.23 కోట్లు భారం పడనుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం.. ఇలాంటి ప్రభుత్వ రుణమాఫీ నిధులను 45 నుండి 60 రోజుల్లోగా సహకార బ్యాంకులకు ప్రభుత్వం పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కఠినంగా ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం విజయ్ స్పష్టం చేశారు.ఈ నిర్ణయంపై అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి స్పందిస్తూ.. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు పూర్తి రుణమాఫీ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం రూ.75,000 కు పరిమితం చేయడం సరికాదన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్ కంటే ముందే పాత అప్పుల భారం తొలగిపోవడంతో రైతులకు కొత్త రుణాలు పొందే అవకాశం లభించింది.

## మహిళా లెక్చరర్‌కు

# అసభ్యకర మెసేజ్‌లు..

**సీన్‌కట్‌చేస్తే.. కాంట్రాక్టర్ కుమారుడికి ఊహించని షాక్..**

**మెదక్, జూన్ 16:**మెదక్ జిల్లా కౌడిపల్లిలోని దారుణం వెలుగు చూసింది. స్థానికంగా గిరిజన గురుకుల కాలేజీలో విధులు నిర్లవహిస్తున్న లెక్చరర్‌పై కన్నేసిన క్యాటరింగ్ కాంట్రాక్టర్ కుమారుడు.. ఆమెను వేధింపులకు గురి చేయడంతో పాటు దాడికి కూడా పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.మెదక్ జిల్లా కౌడిపల్లిలోని గిరిజన గురుకుల కాలేజీలో దారుణం చోటు చేసుకుంది. విద్యాబుద్ధులు నేర్పే మహిళా లెక్చరర్‌కే రక్షణ కరువైంది. గత ఆరు నెలలుగా ఓ కిరాతకుడు ఆమెను మానసికంగా వేధిస్తూ, చివరకు కాలేజీలోనే ఆమెపై భౌతిక దాడికి తెగబడ్డాడు. క్యాటరింగ్ కాంట్రాక్టర్ కుమారుడి ఆగడాలపై బాధితురాలు కౌడిపల్లి పోలీసులను ఆశ్రయించింది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.మెదక్ జిల్లా కౌడిపల్లి (మం) కేంద్రంలోని గిరిజన గురుకుల మహిళా కళాశాలలో క్యాటరింగ్ కాంట్రాక్ట్ నిర్వహిస్తున్న తన తండ్రి అండాతో రమేష్ అనే యువకుడు రెచ్చిపోయాడు. ఆ కాలేజ్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా లెక్చరర్‌పై కన్నేసిన రమేష్.. ఎలాగోలా ఆమె ఫోన్ నెంబర్ సంపాదించి, నిరంతరం డబుల్ మీనింగ్ వచ్చేలా అసభ్యకరమైన మెసేజ్‌లు చేయడం స్టార్ట్ చేశాడు. దాదాపు గత 6 నెలలుగా ఇలానే ఆమెను తీవ్ర వేధింపులకు గురిచేశాడు.రమేష్ ప్రవర్తన పై పలు మార్లు హెచ్చరించినప్పటికీ అతనిలో ఎలాంటి మార్పు రాలేదు. పైగా అతని వేధింపులు రోజురోజుకూ మితిమీరిపోయాయి..ఈ క్రమంలోనే ఈ నెల 12వ తేదీన రమేష్ ఏకంగా గురుకుల కాలేజీ ప్రాంగణంలోకి చొరబడి.. ఒంటరిగా ఉన్న లెక్చరర్‌ను భయభ్రాంతులకు గురిచేశాడు. అంతటితో ఆగకుండా అందరి ముందే ఆమె చెంప పై బలంగా కొట్టి దౌర్జన్యానికి దిగాడు.. కాలేజీలోనే లెక్చరర్ పై దాడి జరగడంతో గురుకులంలో తీవ్ర కలకలం రేగింది.ఇక రమేష్ వేధింపులు, దాడి పై తీవ్ర దిగ్భ్రాంతికి గురైన బాధిత మహిళా లెక్చరర్.. చివరకు కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. లెక్చరర్ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు నిందితుడు రమేష్‌పై కేసు నమోదు చేశారు. మహిళా లెక్చరర్‌కు రక్షణ కల్పించడంతో పాటు, నిందితుడిని కఠినంగా శిక్షించాలని తోటి ఉపాధ్యాయులు, మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# జూలై నెలలో తల్లికి వందనం

**విజయవాడ, జూన్ 16:**రాష్ట్ర విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, విద్యార్థులకు నాణ్యమైన భవిష్యత్తును అందించే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందించే 'తల్లికి వందనం' పథకాన్ని జులై మూడో వారంలో అమలు చేసేందుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. దీంతో పాటు, పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు.ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల, ఉన్నత విద్యాశాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. 'తల్లికి వందనం' పథకం అమలుపై ప్రధానంగా చర్చించారు. తల్లుల ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని, జులై మూడో వారంలో పథకాన్ని అమలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని లోకేశ్ స్పష్టం చేశారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు జూన్ 29న 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం, తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు జులై మూడో వారంలో 'మెగా పీటీఎం' నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మిగులు ఉపాధ్యాయుల



సర్దుబాటు ప్రక్రియపైనా చర్చించారు.పాఠశాల విద్యపై సమీక్ష అనంతరం, ఉన్నత విద్యారంగంపై మంత్రి లోకేశ్ దృష్టి సారించారు. రాష్ట్రంలో నిర్వహించే ఎప్‌సెట్, పాలిసెట్, ఆర్‌సెట్ వంటి 12 రకాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్)ల నిర్వహణలో ఎలాంటి జాప్యం జరగకూడదని గట్టిగా ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్ణీత గడువులోగా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జాతీయ స్థాయి పరీక్షలు, పొరుగు రాష్ట్రాల సెట్ల తేదీలను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా షెడ్యూల్ ఖరారు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1.88 లక్షల ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ఎప్‌సెట్ నోటిఫికేషన్ సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపును పరిశీలించాలని, ముఖ్యంగా డిమాండ్ ఉన్న మెకానికల్, సివిల్ బ్రాంచ్ లపై దృష్టి పెట్టాలని సూచించారు.రాష్ట్రానికి ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తీసుకురావడం ద్వారా ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచాలని మంత్రి ఆకాంక్షించారు. థాపర్ ఇనిస్టిట్యూట్, జేమ్స్ కుక్ యూనివర్సిటీ, మెల్ బోర్న్ యూనివర్సిటీ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు చూపుతున్న ఆసక్తిపై చర్చించారు. ముఖ్యంగా, జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని లోకేష్ ఆదేశించారు. ఇదే సమయంలో, రాష్ట్రంలో ఎన్‌సీసీ కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక 'ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్'ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో ఏపీ యువతకు సైనిక శిక్షణలో మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె. శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతవిద్యా కమిషనర్ నారాయణ్ భరత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ కు పవన్....

**వరంగల్, జూన్ 16:**పవన్ కళ్యాణ్ తెలంగాణ గడ్డపై అడుగుపెట్టబోతున్నారు. ఈ పర్యటనకు ఒక ప్రత్యేకమైన, భావోద్వేగ కారణం ఉంది. బుధవారం రోజు వరంగల్ హనుమకొండలో మృత్యువుతో పోరాడుతున్న తన వీరాభిమాని నిరంజన్ చివరి కోరిక మేరకు పవన్ కళ్యాణ్ అతని ఇంటికి వెళ్లను పవన్ కల్యామ్‌ను చూడాలనే తన చివరి కోరిక మేరకు అతని ఇంటికి వెళ్లనున్నారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకోనున్నారు.హనుమకొండకు చెందిన నిరంజన్‌కు పదహారేళ్లు. చిన్నప్పుడు మామూలుగానే ఉండేవాడు. అయితే కానీ, 8 ఏళ్ల క్రితం అతడి జీవితం ఒక్కసారిగా మారిపోయింది. జన్యుపరమైన డీఎండీ వ్యాధి బారిన పడి పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. ఎదుగుదల పూర్తిగా లోపించింది. కాస్త గట్టిగా పట్టుకుంటే భరించలేని నొప్పి . ఇటీవల టీవీలో సీఎం రేవంత్ ఫుట్‌బాల్ మ్యాచ్ చూసిన నిరంజన్.. ఆయన్ను, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలవాలనుందని తెలిపాడు. నిరంజన్ కోరికను జనసేన నేతలు, పవన్ అభిమానులు ఆయనకు వివరించారు. ఈ విజ్ఞప్తిని మన్నించిన పవన్ కళ్యాణ్ రేపు హనుమకొండ వచ్చి నిరంజన్‌ను పరామర్శించనున్నారు. జనసేనాని టూర్ నేపథ్యంలో ఆ పార్టీ నేతులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అటు పోలీస్ శాఖ కూడా అప్రమత్తమైంది. పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు



తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనుంది. గత కొన్ని రోజులుగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి, పవన్ కళ్యాణ్‌కు మధ్య తీవ్రమైన వాగ్వాదం నడుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా జనసేన నిర్వహించ తలపెట్టిన తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ కు పోలీసులు, హైకోర్టు అనుమతి నిరాకరించడం వివాదానికి కేంద్ర బిందువైంది. దీనిపై జూబ్లీహిల్స్ నివాసంలో ప్రెస్ మీట్ పెట్టిన పవన్.. తెలంగాణ ఎవరి సొంత జాగీరు కాదు.. నన్ను హైదరాబాద్ రాకుండా ఆపేదెవరు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత ఢిల్లీ వేదికగా జరిగిన పార్టీ సేన ప్రస్థానం' సమావేశంలోనూ.. తెలంగాణ అమరవీరులను గుర్తించడానికి ఈ పాలకులకు 12 ఏళ్లు సరిపోలేదా అంటూ కాంగ్రెస్ నాయకత్వంపై విరుచుకుపడ్డారు. పవన్ కళ్యాణ్ కేవలం అభిమాని నిరంజన్‌ను కలిసి వెళ్ళిపోయినా.. ప్రస్తుతమున్న పొలిటికల్ టెన్షన్స్ దృష్ట్యా దానికి రాజకీయ ప్రాధాన్యత లభించడం ఖాయం. ఢిల్లీ వేదికగా పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్ర విభజన సరిగ్గా జరగలేదని పవన్ మాట్లాడటాన్ని, తెలంగాణ సెంటిమెంట్‌ను తక్కువ చేసి చూపడంగా కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణలో తిరగడాన్ని తాము అడ్డుకుంటామని ఇప్పటికే కొంతమంది ద్వితీయ శ్రేణి కాంగ్రెస్ నాయకులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి పవన్ పర్యటించే నియోజకవర్గం లేదా రూట్ మ్యాప్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనలు తెలిపే లేదా అడ్డుకునే ప్రయత్నాలుఉన్నాయని భావిస్తున్నారు.ఈ పర్యటన కేవలం ఒక అభిమానిని కలవడం కోసమే కాబట్టి ఎలాంటి రాజకీయ ప్రసంగాలు ఉండకపోవచ్చని జనసేన వర్గాలు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఏపీ డిప్యూటీ సీఎం హోదాలో పవన్ వస్తుండటంతో తెలంగాణ ప్రభుత్వం ప్రోటోకాల్ ప్రకారం భద్రత కల్పించాల్సి ఉంటుంది.

# నోట్ల కట్టలపైనే నరహరి నిద్ర...

**హైదరాబాద్, జూన్ 16:** తనిఖీలు చేపట్టారు. ల్యాండ్స్ అండ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇళ్లు, ఆస్తులపై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలు రావడంతో ఉదయం నుంచే నరహరి నివాసాలు, కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. హైదరాబాద్ పాతబస్తీలోని ఛత్రినాకలో ఉన్న నరహరి నివాసంతో పాటు ఆయన ఆఫీసు, బంధువుల ఇళ్లు, సన్నిహితుల ఇళ్లు సహా మొత్తం 11 ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో మెరుపు దాడులు చేశారు.ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇంట్లో భారీగా నగదు లభ్యమైంది. దాదాపు 1.10కోట్ల నగదును ఏసీబీ గుర్తించింది. పడక గదిలో బెడ్ కింద నగదు స్వాధీనం చేసుకున్నారు. నోట్ల కట్టలను బెడ్ గా చేసుకుని అధికారి నిద్రిస్తున్నాడని గుర్తించిన ఏసీబీ అధికారులు షాకవుతున్నారు. ఏసీబీ అధికారులు ఈ సోదాల్లో భాగంగా నరహరి ఇళ్లలో లభ్యమైన భారీ నగదు, బంగారు ఆభరణాలు, విలువైన ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్స్, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలోని ఏసీబీ ప్రత్యేక బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. ప్రభుత్వ ఉన్నతాధికారి నివాసంలో ఒకేసారి ఇన్ని చోట్ల ఏసీబీ దాడులు జరగడం రెవెన్యూ, భూ సర్వే విభాగాల్లో కలకలం రేపుతోంది. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని, పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.తెలంగాణ రెవెన్యూ శాఖలో రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ కే. వంశీ మోహన్ ఇళ్లపై ఏసీబీ అధికారులు భారీ దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో భాగంగా హైదరాబాద్ సహా 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. గతంలో శేరిలింగంపల్లి ఆర్డీవోగా పనిచేసిన సమయంలో వంశీ మోహన్ అధికార దుర్వినియోగానికి పాల్పడి వందల కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. పిగ్లీపురంలో 8 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసి తన మామ పేరిట రిజిస్ట్రేషన్ చేయించడం, మ్యుటేషన్ల కోసం రియల్టర్ల నుండి తన బంధువుల పేర్లపై 10 ప్లాట్లను గిఫ్ట్ డీడ్ల రూపంలో ముడుపులుగా తీసుకోవడం వంటి కీలక అక్రమాలను అధికారులు గుర్తించి, ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

## బిజినెస్

### షావోమీ నుంచి షావోమీ 17టీ ఫోన్ విడుదల.. బెస్ట్ కెమెరా, పవర్‌ఫుల్ బ్యాటరీ.. పూర్తి ఫీచర్లు, ధర ఇవే




చైనాకు చెందిన షావోమీ సంస్థ నుంచి షావోమీ 17టీ పేరుతో స్మార్ట్‌ఫోన్ ఇటీవల ఇండియాలో విడుదలైంది. దాదాపు ఫ్లాగ్‌షిప్ ఫీచర్లతో, కాస్త అందుబాటు ధరలోనే ఈ ఫోన్ విడుదలైంది. ఇప్పటికే సేల్‌లో అందుబాటులోకి వచ్చింది. 6,500 ఎంఏహెచ్ బ్యాటరీ, క్వాలిటీ ట్రిపుల్ కెమెరా వంటి ఫీచర్లున్నాయి. షావోమీ వెబ్‌సైట్, అమెజాన్, రిటైల్ స్టోర్లలోనూ ఈ ఫోన్ అందుబాటులో ఉంటుంది. ఈ ఫోన్ కొంటే ఏడాదిలోపు 60 శాతం బైబ్యాక్ ఆఫర్ కూడా ప్రకటించింది కంపెనీ. ఈ ఫోన్ కొంటే 4 నెలల స్పాటిఫై ప్రీమియం, 3 నెలల యూట్యూబ్ ప్రీమియం, గూగుల్ ఏఐ వంటివి ఉచితంగా పొందవచ్చు. వివిధ కార్డులపై డిస్కౌంట్‌తోపాటు ఎక్స్ఛేంజ్ ఆఫర్ కూడా ఇస్తోంది. ఈ ఫోన్‌లోని కీలక ఫీచర్లివి. 6.59 అంగుళాల 1.5కే అమోలెడ్ డిస్‌ప్లే, 3,500 నిట్స్ పీక్‌బ్రైట్‌నెస్, 120 హెర్ట్జ్ రిఫ్రెష్‌రేట్, మీడియాటెక్ డిమెన్సిటీ 8500 అల్ట్రా ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 16 బేస్డ్ హైపర్‌ఓఎస్ 3, 50 ఎంపీ లైట్ ఫ్యూజియన్ 800 మెయిన్ కెమెరాం50ఎంపీ పెరిస్కోప్ టెలిఫోటో కెమెరాం12ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా, 32 ఎంపీ సెల్ఫీ కెమెరా, 12జీబీం256జీబీ, 12జీబీం512జీబీ, బ్లూటూత్ 6.0, వైఫై 7, ఐపీ68 రేటింగ్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్, 6,500 ఎంఏహెచ్ బ్యాటరీ, 67 వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్, 22.5 వాట్స్ రివర్స్ ఛార్జింగ్ వంటి ఫీచర్లున్నాయి. ధర రూ.59,999/రూ.64,999.

### హైదరాబాద్‌లో టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్




**హైదరాబాద్:** అమెరికా ఎలక్ట్రిక్ వాహన దిగ్గజ సంస్థ టెస్లా.. హైదరాబాద్‌లో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వనుంది. ఈ నెల 17న హైటెక్ సిటీలో తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించనుంది. మన దేశంలో టెస్లాకిది ఐదో సెంటర్. కాగా.. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని ఆక్టేవ్ బ్లాక్‌లో రానున్న ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో 6 సీటింగ్ కెపాసిటీ టెస్లా వై ఎల్ (లాంగ్-- వీల్ బేస్) మోడల్ కారును ప్రదర్శించనున్నారు. 88 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ, డ్యూయల్ మోటార్ ఏడబ్ల్యూడీ సిస్టమ్ ఫీచర్స్‌తో ఉన్న ఈ కారు.. 5 సెకన్ల వ్యవధిలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఎక్స్ షోరూం ప్రారంభ ధర రూ.61.99 లక్షలు. ఇప్పటికే ఢిల్లీ, గుర్గావ్, ముంబై, బెంగళూరులో కొలువుదీరిన టెస్లా షోరూమ్‌లు.. తాజాగా భాగ్యనగరానికి రానున్నాయి

## 2.5 లక్షల్లో స్క్రాంబ్లర్ బైక్ కొనాలా?

# ఈ రెండింటిలో ఏది బెస్ట్?




భారత మార్కెట్‌లో అడ్వెంచర్, స్క్రాంబ్లర్ బైక్‌లకు డిమాండ్ విపరీతంగా పెరుగుతోంది. ముఖ్యంగా నగర రోడ్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని గుంతలు, కంకర రోడ్లు, తేలికపాటి ఆఫ్‌రోడింగ్ పరిస్థితుల్లోనూ స్మూత్ రైడింగ్ సామర్థ్యంతో ఉండటంతో యూత్ స్క్రాంబ్లర్ బైక్‌లవైపు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ స్క్రామ్ 440ని అందుబాటులోకి తీసుకురాగా.. ఇటీవల యెజ్డీ నుంచి సరికొత్త స్క్రాంబ్లర్ బైక్‌లు వచ్చాయి. ప్రస్తుతం రూ.2.5 లక్షల్లోపు ధరలో ఈ రెండు బైక్‌లు అందుబాటులో ఉన్నాయి. మరి వీటిలో ఏది బెస్ట్ అనేది ఒకసారి పరిశీలిద్దాం..

**ఇంజిన్-పనితీరు**

రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440లో 443సీసీ సామర్థ్యం గల సింగిల్ సిలిండర్, ఎయిర్ కూల్డ్, ఫ్యూయల్ ఇంజెక్టెడ్ ఇంజిన్‌ను అమర్చారు. ఈ ఇంజిన్ గరిష్ఠంగా 25.4బీహెచ్‌పీ పవర్, 34ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇందులో 6 స్పీడ్ గేర్‌బాక్స్ అమర్చారు. ముఖ్యంగా తక్కువ ఆర్‌పీఎం వద్ద ఎక్కువ టార్క్ అందించడం వల్ల కొండ ప్రాంతాలు, కఠినమైన రోడ్లపై ప్రయాణానికి ఇది అనుకూలంగా ఉంటుంది.

అదే యెజ్డీ స్క్రాంబ్లర్ 334 సీసీ సింగిల్ సిలిండర్, లిక్విడ్ కూల్డ్ ఇంజిన్‌తో వస్తుంది. ఇది 29.59బీహెచ్‌పీ పవర్, 30 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. పవర్‌పరంగా యెజ్డీ స్క్రాంబ్లర్ ముందంజలో ఉండగా, టార్క్ విషయంలో స్క్రామ్ 440 ముందు ఉంది. వేగవంతమైన యాక్సిలరేషన్, హైవే రైడింగ్‌ను ఇష్టపడేవారికి యెజ్డీ బైక్ బాగా నచ్చే అవకాశం ఉంది.

**డిజైన్**

స్క్రామ్ 440లోసీటు ఎత్తు 795 మిల్లీమీటర్ల ఎత్తులోనే ఉండటంతో పొట్టిగా ఉన్నవారు కూడా సులభంగా నడపగలరు. 200 మిల్లీమీటర్ల గ్రౌండ్ క్లియరెన్స్ ఉండటం వల్ల గుంతలు, స్పీడ్ బ్రేకర్లపై ఇబ్బంది ఉండదు. దీని వీల్‌బేస్ 1460 మిల్లీమీటర్లు కాగా.. మొత్తం బరువు 196 కిలోలు. యెజ్డీ స్క్రాంబ్లర్‌లో సీటు ఎత్తు 813 మిల్లీమీటర్ల ఎత్తులో ఉంది. పొడవుగా ఉండే వారికి ఈ బైక్ అనుకూలంగా ఉంటుంది. బరువు విషయానికి వస్తే ఇది స్క్రామ్ 440 కంటే తక్కువ. దీని బరువు కేవలం 174 కిలోలు మాత్రమే. స్క్రామ్‌తో పోలిస్తే 22 కిలోల వరకు తక్కువ బరువు ఉండటంతో ట్రాఫిక్‌లో, టర్నింగ్స్‌లో మరింత చురుకైన హ్యాండ్లింగ్ ఉంటుంది.

**బ్రేకింగ్-సస్పెన్షన్**

రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440లో ముందు 300మిల్లీమీటర్ల డిస్క్, వెనుక 240 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేక్‌లు ఉన్నాయి. ముందు 41 మిల్లీమీటర్ల టెలిస్కోపిక్ ఫోర్క్‌లు, వెనుక లింకేజ్‌తో కూడిన మోనోషాక్ సస్పెన్షన్ అందించారు. ముందు 190మిల్లీమీటర్లు, వెనుక 180 మిల్లీమీటర్ల సస్పెన్షన్ ట్రావెల్ ఉండటంతో కఠినమైన రోడ్లపై కూడా మంచి సౌకర్యవంతమైన రైడింగ్‌ను అందిస్తుంది.

యెజ్డీ స్క్రాంబ్లర్‌లో ముందు 320 మిల్లీమీటర్లు, వెనుక 240 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేక్‌లు ఉన్నాయి. డ్యూయల్ ఛానల్ ఏబీఎస్ భద్రత కూడా ఉంది. ముందు టెలిస్కోపిక్ హైడ్రాలిక్ ఫోర్క్, వెనుక ట్విన్ షాక్ అబ్జార్బర్ల వ్యవస్థను ఉపయోగించారు.

**ఇంజిన్ ట్యాంక్- ప్రయాణ సామర్థ్యం**

స్క్రామ్ 440లో 15లీటర్ల పెద్ద ఫ్యూయల్ ట్యాంక్ ఉంది. లాంగ్ జర్నీలు చేసేవారికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. యెజ్డీ స్క్రాంబ్లర్‌లో 12.5 లీటర్ల ట్యాంక్ మాత్రమే ఉంది. అయితే తక్కువ బరువు కారణంగా ఇంధన వినియోగం కొంత మెరుగ్గా ఉండే అవకాశం ఉంది.

**ధర**

రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440 ప్రారంభ ఎక్స్‌షోరూం ధర రూ.2.23 లక్షలుగా ఉంది. అదే యెజ్డీ స్క్రాంబ్లర్ ప్రారంభ ధర రూ.1.99 లక్షలుగా ఉంది. అంటే యెజ్డీ బైక్ సుమారు రూ.24వేల తక్కువ ధరలో లభిస్తుంది. వీటన్నింటి ఆధారం గదా బలమైన నిర్మాణం, అధిక టార్క్, టూరింగ్ సామర్థ్యం ముఖ్యమైతే రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440 సరైన ఎంపిక అని ఆటోమొబైల్ నిపుణులు సూచిస్తున్నారు. అదే తక్కువ బరువు, ఎక్కువ పవర్, చురుకైన హ్యాండ్లింగ్, తక్కువ ధరలో స్క్రాంబ్లర్ కావాలనుకుంటే యెజ్డీ బెటర్ అని చెబుతున్నారు.

### లక్ష రూపాయల ఫోన్.. ఇప్పుడు సగం ధరకే!



ప్రీమియం స్మార్ట్‌ఫోన్ కొనాలని చాలా మందికి ఉంటుంది. అయితే అందుకు వారి బడ్జెట్ సహకరించదు. ఎందుకంటే వాటి ధరలు రూ.లక్ష వరకు ఉంటాయి. ఇలాంటి కస్టమర్లకు శామ్‌సంగ్ గెలాక్సీ ఎస్25 ఎడ్జ్ ఇప్పుడు ఆకర్షణీయమైన ఎంపికగా మారింది. భారత్‌లో ఈ ఫోన్‌ను గతేడాది మేలో రూ.1,09,999 ప్రారంభ ధరతో విడుదల చేసిన శామ్‌సంగ్, ప్రస్తుతం ఈ మోడల్‌పై భారీ డిస్కౌంట్ అందిస్తోంది. అధికారిక లాంచ్ సమయంలో రూ.1 లక్షకు పైగా ధర కలిగిన ఈ ఫోన్, ప్రస్తుతం ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో రూ.60 వేల పరిధిలోనే లభిస్తోంది. ప్రస్తుతం 12+దీ ర్యామ్ ం 256+దీ స్టోరేజ్ వేరియంట్ సుమారు రూ.59,999కు, 512+దీ వేరియంట్ రూ.71,999కు అందుబాటులో ఉన్నట్లు ఆన్‌లైన్ ఆఫర్లు సూచిస్తున్నాయి. దీంతో అసలు లాంచ్ ధరతో పోలిస్తే దాదాపు రూ.50,000 వరకు తగ్గింపు లభిస్తోంది. కొన్ని బ్యాంక్ కార్డులపై అదనపు ఇన్‌స్టంట్ డిస్కౌంట్లు, ఎక్స్ఛేంజ్ ఆఫర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. గెలాక్సీ ఎస్25 ఎడ్జ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టేది దాని అల్ట్రా-స్లిమ్ డిజైన్. కేవలం 5.8 మిల్లీమీటర్ల మందం, 163 గ్రాముల బరువుతో ఇది శామ్‌సంగ్ గెలాక్సీ ఎస్ సిరీస్‌లో ఇప్పటివరకు వచ్చిన అత్యంత సన్నని ఫోన్‌గా గుర్తింపు పొందింది. టైటానియం ఫ్రేమ్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ సిరామిక్ 2 రక్షణతో ప్రీమియం లుక్‌తో పాటు మన్నికను కూడా అందిస్తోంది.

## మెరిసిన గిల్, రాహుల్.. అఫ్ఘాన్‌పై భారత్ ఘన విజయం

ధర్మశాల: అఫ్ఘానిస్థాన్‌తో ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఇన్నింగ్స్ తేడాతో ఘన విజయం సాధించిన టీమ్‌ఇండియా అదే జట్టుతో మూడు వన్డేల సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. ధర్మశాల వేదికగా జరిగిన తొలి వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వర్షం కారణంగా ఆటను 25 ఓవర్లకు కుదించగా.. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ 24.5 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యాన్ని టీమ్‌ఇండియా 22.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (84లి; 66 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఇషాన్ కిషన్ (34), కేఎల్ రాహుల్ (39లి; 19 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ శర్మ (16) పరుగులు చేశారు. రెండో వన్డే బుధవారం (జూన్ 17) లఖ్‌నవూలో జరగనుంది. జియావుర్ రెహ్మాన్ వేసిన 22 ఓవర్లో కేఎల్ రాహుల్ వరుసగా 6, 4, 4 బాదేశాడు. ఇదే ఓవర్లో చివరి బంతిని కూడా రాహుల్ స్టాండ్స్‌లోకి పంపాడు. 22 ఓవర్లకు స్కోరు 182/3. టీమ్‌ఇండియా విజయానికి 18 బంతుల్లో 13 పరుగులు అవసరం. జియావుర్ రెహ్మాన్ వేసిన 18 ఓవర్లో శ్రేయస్ అయ్యర్ (12) ఔటయ్యాడు. దీంతో భారత్ 142 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయింది. టీమ్‌ఇండియా విజయానికి 45 బంతుల్లో 53 పరుగులు అవసరం. రషీద్ ఖాన్ వేసిన 13 ఓవర్లో ఇషాన్ కిషన్ (34) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. 13 ఓవర్లకు టీమ్‌ఇండియా స్కోరు 117/2.

**గిల్ఏ3000**

భారత కెప్టెన్ శుభ్‌మన్ నిలకడగా ఆడుతూ 37 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. మహ్మద్ నబీ వేసిన 12 ఓవర్‌లో గిల్ ఓ సిక్స్, రెండు ఫోర్లు బాది హాఫ్ సెంచరీ అందుకున్నాడు. ఈ క్రమంలో వన్డేల్లో వేగంగా (62 ఇన్నింగ్స్‌లు) 3 వేల పరుగులు పూర్తి చేసుకున్న భారత ఆటగాడిగా గిల్ రికార్డు సృష్టించాడు. 12 ఓవర్లకు భారత్ 109/1. టీమ్‌ఇండియా విజయానికి ఇంకా 78 బంతుల్లో 86 పరుగులు అవసరం. ఇషాన్ కిషన్ (32) పరుగులతో ఉన్నాడు. అఫ్గాన్ నిర్దేశించిన 195 పరుగుల లక్ష్యఛేదనలో భారత బ్యాటర్లు నిలకడగా ఆడుతున్నారు. ఇషాన్ కిషన్ (30), గిల్ (29) క్రమంగా బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును ముందుకు కదిలిస్తున్నారు. 10 ఓవర్లకు స్కోరు 84/1.

**రోహిత్ రనౌట్**

అఫ్గాన్‌తో జరుగుతున్న తొలి వన్డేలో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. రోహిత్ శర్మ (16; 16 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఔటయ్యాడు. ఘజన్‌ఫర్ వేసిన ఆరో ఓవర్‌లో బంతిని ఎదుర్కొన్న రోహిత్.. శుభ్‌మన్ గిల్‌తో సమన్వయలోపంతో రనౌటయ్యాడు. 6 ఓవర్లకు టీమ్‌ఇండియా స్కోరు 47/1. గిల్ (22), ఇషాన్ కిషన్ (1) క్రీజులో ఉన్నారు.




**ఓపెనర్‌గా 16 వేల పరుగులు**

తొలి వన్డేలో భారత్‌కు అఫ్గాన్ 195 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. టార్గెట్‌ను ఛేజ్ చేసేందుకు టీమ్‌ఇండియా బరిలోకి దిగింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (15), శుభ్‌మన్ గిల్ (6) నిలకడగా ఆడుతున్నారు. 3 ఓవర్లకు భారత్ స్కోరు 29/0. అజ్మతుల్లా బౌలింగ్‌లో రోహిత్ సిక్స్ కొట్టాడు. ఈ సిక్సర్‌తో హిట్‌మ్యాన్ వన్డేల్లో ఓపెనర్‌గా 16 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు.

**భారత్ టార్గెట్ 195**

భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ బ్యాటింగ్ ముగిసింది. వర్షం కారణంగా ఆటను 25 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్ 24.5 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో 26 రన్స్‌కే అఫ్గాన్ మూడు వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ (102; 51 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్స్‌లు) 'శత'క్కొట్టి జట్టును ఆదుకున్నాడు. ఒక దశలో 26 రన్స్‌కే అఫ్గాన్ మూడు వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో ఓపెనర్ రహ్మానుల్లా జట్టును ఆదుకున్నాడు. హష్మతుల్లా (27)తో కలిసి నాలుగో వికెట్‌కు 66 బంతుల్లోనే 116 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. 15 ఓవర్లకు 140/3తో నిలిచి భారీ స్కోరు చేసేలా కనిపించిన అఫ్గాన్.. గుర్బాజ్ ఔటైన తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయింది. అరంగేట్ర బౌలర్లు గూర్నూర్ బ్రార్, హర్ష్ దూబెలకు చెరో మూడు వికెట్లు దక్కాయి. అర్ష్‌దీప్ 2, నితీశ్ రెడ్డి రెండు వికెట్లు పడగొట్టారు.

**శుభ్‌మన్ గిల్ స్టన్నింగ్ క్యాచ్..**

అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (26; 16 బంతుల్లో) పెవిలియన్ చేరాడు. హర్ష్ దూబె వేసిన 22 ఓవర్‌లో తొలి బంతికి భారీ సిక్స్ బాదిన ఒమర్‌జాయ్.. తర్వాత బంతికే స్టంపౌట్‌గా వెనుదిరిగాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన ఘజన్‌ఫర్ డకౌటయ్యాడు. హర్ష్ దూబె బౌలింగ్‌లోనే (21.4 ఓవర్) స్లిప్‌లో శుభ్‌మన్ గిల్ డైవ్ చేస్తూ ఒంటిచేత్తో కళ్లు చెదిరే క్యాచ్ అందుకోవడంతో ఘజన్‌ఫర్ ఔటయ్యాడు.

**సిక్స్.. వెంటనే ఔట్**

భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో అఫ్గాన్ ఆరో వికెట్ కోల్పోయింది. మహ్మద్ నబీ (9) ఔటయ్యాడు. నితీశ్ రెడ్డి బౌలింగ్‌లో భారీ సిక్స్ కొట్టిన నబీ.. తర్వాత బంతికే అర్ష్‌దీప్ సింగ్‌కు చిక్కాడు. దీంతో అఫ్గాన్ 172 పరుగుల వద్ద ఆరో వికెట్ కోల్పోయింది. 21 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 176/6. అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (20), రషీద్ ఖాన్ (4) క్రీజులో ఉన్నారు.

**హర్ష్ దూబెకు తొలి వికెట్**

అఫ్గానిస్థాన్ ఐదో వికెట్ కోల్పోయింది. అరంగేట్ర బౌలర్ హర్ష్ దూబె వేసిన 16.3 ఓవర్‌కు హష్మతుల్లా షాహిదీ (27).. రాహుల్‌కు క్యాచ్ ఇచ్చాడు. హర్ష్ దూబెకు వన్డేల్లో ఇది తొలి వికెట్. 17 ఓవర్లకు అఫ్గానిస్థాన్ స్కోరు 144/5. మహ్మద్ నబీ (0), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (2) క్రీజులో ఉన్నారు.

**గుర్బాజ్ సెంచరీ**

భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ (101; 51 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్స్‌లు) సెంచరీ బాదాడు. 26 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన అఫ్గాన్‌ను గుర్బాజ్ అదిరే బ్యాటింగ్ చేసి ఆదుకున్నాడు. 25 బంతుల్లో అర్ధ శతకం అందుకున్న గుర్బాజ్ తర్వాత మరింత దూకుడు పెంచాడు. చివరకు నితీశ్ రెడ్డి వేసిన 16 ఓవర్లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. 16 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 143/4. హష్మతుల్లా షాహిదీ (27), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (1) క్రీజులో ఉన్నారు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 25 ఓవర్లకు కుదించిన సంగతి తెలిసిందే.

**దూకుడు పెంచిన గుర్బాజ్**

అఫ్గాన్ ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ హాఫ్ సెంచరీ తర్వాత మరింత దూకుడు పెంచాడు. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన 11 ఓవర్లో 4, 6 బాదిన అతను.. తర్వాత వాషింగ్టన్ సుందర్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు, ఓ ఫోర్ రాబట్టాడు. 12 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 110/3. రహ్మానుల్లా (86) సెంచరీ దిశగా సాగుతున్నాడు. హష్మతుల్లా షాహిదీ (17) పరుగులతో ఉన్నాడు. భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ దూకుడుగా ఆడుతున్నాడు. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన ఏడో ఓవర్లో రెండు ఫోర్లు, హర్ష్ దూబె బౌలింగ్‌లో ఫోర్, సిక్స్ బాదాడు. మళ్లీ ప్రసిద్ధ్ బౌలింగ్‌లో గుర్బాజ్ వరుసగా రెండు ఫోర్లు రాబట్టాడు. హర్ష్ దూబె వేసిన తర్వాతి ఓవర్లో సిక్స్ కొట్టి 25 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. 10 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 79/3. రహ్మానుల్లా (57), హష్మతుల్లా షాహిదీ (16) క్రీజులో ఉన్నారు.

## స్పోర్ట్స్

### ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో ఓడిన పీవీ సింధు




సిడ్నీ: ఆస్ట్రేలియన్ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నీలో హైదరాబాదీ ప్లేయర్ పీవీ సింధు ఇవాళ సెమీఫైనల్లో ఓటమి చవి చూసింది. జపాన్‌కు చెందిన మేటి ప్లేయర్ అకేన్ యమగుచి చేతిలో ఆమె వరుస గేమ్స్‌లో పరాజయాన్ని ఎదుర్కొన్నది. 20-22, 12-21 స్కోరుతో యమగుచి విజయం సాధించింది. మూడో నెంబర్ ర్యాంక్‌తో జపనీస్ ప్లేయర్ ఈ టోర్నీలో ఆడారు. కేవలం 43 నిమిషాల్లోనే ఈ మ్యాచ్ ముగిసిపోయింది. సింధు ఓటమితో బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారతీయ క్రీడాకారుల ప్రాతినిధ్యం ముగిసింది. ఫస్ట్ గేమ్‌లో జపాన్ ప్లేయర్‌కు ధీటుగా సింధు ఆడింది. షాట్‌కు షాట్ కొట్టింది. ఇద్దరు ఆటగాళ్లు ఓ దశలో ఆరు వరుస పాయింట్లను సాధించుకున్నారు. కానీ గేమ్ పాయింట్ వద్ద సింధు తడబడింది. ఓపెనింగ్ గేమ్‌ను యమగుచి చేజిక్కించుకున్నది. ఇక సెకండ్ గేమ్‌లో సింధు ఆటతీరు పూర్తిగా మారిపోయింది. యమగుచి చాలా ఈజీగా దూసుకెళ్లింది. ఓ దశలో 13-6 పాయింట్లు సాధించింది. ఎటువంటి ఇబ్బందులు లేకుండానే యమగుచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నది. ఇక సింగిల్స్ ఫైనల్లో థాయ్‌ల్యాండ్ క్రీడాకారిణి పోర్న్‌పావీ చోచువాంగ్‌తో యమగుచి తలపడనున్నది. ఇటీవల కాలం యమగుచి చేతిలో సింధు వరుసగా ఓటమి ఎదుర్కొన్నది. ఆరు మ్యాచుల్లో అయిదు సార్లు ఓడంది. కానీ ఓవరాల్‌గా 15-13 తేడాతో సింధు లీడింగ్‌లో ఉంది.

# 'పెద్ది' బాక్సాఫీస్ దూకుడు .. 9 రోజుల్లో రూ.366 కోట్ల గ్రాస్, 400 కోట్ల క్లబ్‌కు చేరువ!




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ రెస్పాన్స్ అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు రామ్ చరణ్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన సోలో చిత్రంగా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది.ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సంచలన వసూళ్లు నమోదు చేసిన 'పెద్ది' తాజాగా మరో కీలక మైలురాయిని అందుకుంది. సినిమా విడుదలై తొమ్మిది రోజులు పూర్తయిన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా కలెక్షన్ల వివరాలను ప్రకటించింది. మేకర్స్ వెల్లడించిన సమాచారం ప్రకారం, 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా తొలి తొమ్మిది రోజుల్లో ఏకంగా రూ.366 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ భారీ వసూళ్లతో రామ్ చరణ్ కెరీర్‌లో 'పెద్ది' రెండో అతిపెద్ద గ్రాసర్‌గా నిలిచింది. ముఖ్యంగా సోలో హీరోగా చరణ్ నటించిన చిత్రాల్లో అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా ఇది రికార్డు సృష్టించింది. గ్రామీణ నేపథ్యం, క్రీడా అంశాలు, భావోద్వేగాలతో కూడిన కథ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది.ప్రస్తుతం వీకెండ్ బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉన్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తర భారతదేశం, విదేశీ మార్కెట్లలో కూడా సినిమా మంచి వసూళ్లు నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో 'పెద్ది' త్వరలోనే రూ.400 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి చేరడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.తెలుగు వార్తలు వీకెండ్ ముగిసే నాటికి ఈ చిత్రం 400 కోట్ల మార్కును అందుకుంటుందా లేదా అనే అంశంపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో పెద్ద సినిమాల పోటీ లేకపోవడం, కుటుంబ ప్రేక్షకుల మద్దతు కొనసాగుతుండటం 'పెద్ది'కి అదనపు బలంగా మారింది.ఈ చిత్రంలో రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. పాత్రలో ఆయన చూపించిన భావోద్వేగాలు, క్రీడాకారుడిగా చేసిన పరివర్తన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా కథను తెరకెక్కించిన తీరు కూడా ప్రత్యేక ప్రశంసలు అందుకుంటోంది. 'పెద్ది' బాక్సాఫీస్ ప్రయాణం ఇంకా కొనసాగుతుండటంతో, రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడు అందరి దృష్టి రూ.400 కోట్ల క్లబ్‌పై నిలిచింది. ఈ మైలురాయిని సినిమా ఎంత వేగంగా చేరుకుంటుందో చూడాలి.

# తన పేరుతో సైబర్ మోసాలు.. నకిలీ నంబర్‌ను షేర్ చేస్తూ అభిమానులను హెచ్చరించిన హీరోయిన్ మీనాక్షి చౌదరి!



'లక్కీ భాస్కర్' సినిమా ఘనవిజయంతో టాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న కథానాయిక మీనాక్షి చౌదరి తాజాగా ఒక పెద్ద సైబర్ మోసంపై స్పందించారు. తన పేరుతో కొందరు కేటుగాళ్లు ప్రజలను, అభిమానులను బురిడీ కొట్టించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆమె గుర్తించారు. తనలా నటిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఒక గుర్తుతెలియని వ్యక్తి వ్యవహారాన్ని సోషల్ మీడియా వేదికగా బయటపెడుతూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సదరు నకిలీ వ్యక్తి వాడుతున్న ఫోన్ నంబర్‌ను స్క్రీన్ షాట్ తీసి తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో మీనాక్షి పోస్ట్ చేశారు. ఈ నంబర్ నుండి ఎవరికైనా మెసేజ్‌లు లేదా ఫోన్ కాల్స్ వస్తే నమ్మవద్దని, వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి రిపోర్ట్ చేయాలని కోరారు. అది తన నంబర్ కాదని స్పష్టం చేసిన ఆమె, ఈ మోసాన్ని సకాలంలో గుర్తించి తన దృష్టికి తీసుకువచ్చిన నెటిజన్లకు, అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇక సినిమాల విషయానికి వస్తే, మీనాక్షి చౌదరి ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. అందులో ముఖ్యంగా అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న 'వృషకర్మ' చిత్రంపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కార్తీక్ దండు దర్శకత్వంలో మైథలాజికల్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది.



# 'మా ఇంటి బంగారం'కు బాక్సాఫీస్ దగ్గర బిగ్ అడ్వాంటేజ్.. సమంత సినిమాకు పోటీ తగ్గిందా?

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న 'మా ఇంటి బంగారం' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ లేడీ ఓరియెంటెడ్ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన పోస్టర్లు, టీజర్, ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. అయితే ఇప్పుడు ఈ చిత్రానికి బాక్సాఫీస్ పరంగా మరో భారీ ప్లస్ పాయింట్ దక్కినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.మొదట 'మా ఇంటి బంగారం' విడుదల సమయంలో కొన్ని క్రేజీ సినిమాలు కూడా బరిలోకి దిగనున్నట్లు వార్తలు వినిపించాయి. ముఖ్యంగా అక్కినేని హీరో నటిస్తున్న 'లెనిన్' సినిమా అదే సమయంలో విడుదలవుతుందని భావించారు. అయితే తాజా సమాచారం ప్రకారం ఆ చిత్రం విడుదల వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్యాచ్ వర్క్ పూర్తికాకపోవడం, థియేట్రికల్ బిజినెస్‌కు సంబంధించిన చర్చలు ఇంకా కొనసాగుతుండటంతో నిర్మాతలు విడుదల తేదీపై పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. సినీ వర్గాల సమాచారం మేరకు 'లెనిన్' జూన్ చివరి వారానికి బదులుగా జూలైలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అదే జరిగితే 'మా ఇంటి బంగారం'కు బాక్సాఫీస్ వద్ద పెద్దగా పోటీ ఉండకపోవచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా తొలి రెండు వారాల పాటు ప్రేక్షకుల దృష్టిని పూర్తిగా ఆకర్షించే అవకాశం ఈ చిత్రానికి లభించవచ్చని భావిస్తున్నారు. సినిమా విడుదలైన మొదటి వారంలో పాజిటివ్ టాక్ అందుకుంటే, రెండో వారంలో కూడా వసూళ్ల పరంగా బలంగా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పెద్ద సినిమాల పోటీ తగ్గడం సమంత సినిమాకు అదనపు బలంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హాలీవుడ్ యాక్షన్ క్లాసిక్ 'కిల్ బిల్' తరహా యాక్షన్ ఎలిమెంట్స్‌ను తెలుగు కుటుంబ కథాంశంతో మేళవించి ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే పాత్రలో రెండు భిన్న కోణాలు ఉండనున్నాయని, అవి కథలో కీలక మలుపులకు కారణమవుతాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో సమంత అభిమానుల్లో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. ఈ చిత్రం సమంత కెరీర్‌లో కూడా ఎంతో కీలకమైనదిగా భావిస్తున్నారు. ఎందుకంటే స్టార్ హీరోల సహకారం లేకుండా పూర్తిగా ఆమె ఇమేజ్, నటన, కథ బలంపై సినిమా రూపొందుతోంది. లేడీ ఓరియెంటెడ్ జానర్‌లో భారీ స్థాయిలో తెరకెక్కిన ఈ చిత్రం విజయవంతమైతే సమంత కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది.

# పశ్చిమాసియాలో శాంతికి మార్గం..

-మొదటిపేజీ తరువాయి

కల్పించడంలో ఇది సానుకూల ఫలితాలు ఇస్తుందని భారత్ విశ్వసిస్తోందన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఆర్థిక అంతరాయానికి కారణమై, అనేక దేశాల్లో ప్రాణనష్టానికి దారితీసిన పశ్చిమ ఆసియాలోని సంఘర్షణను ముగించడానికి అమెరికా, ఇరాన్‌ల మధ్య కుదిరిన అవగాహనను స్వాగతిస్తున్నాం. ఈ అవగాహన అమలు ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి, నౌకాయాన, వాణిజ్య స్వేచ్ఛను నిర్ధారించడానికి సహాయపడుతుందని భారతదేశం ఆశిస్తోంది. మిగిలిన సమస్యలపై చర్చలు జరిగి, ఒక సుస్థిరమైన తుది ఒప్పందానికి రావాలని మేం ఎదురుచూస్తున్నాం."

**హర్మూజ్‌ను తిరిగి తెరిచే మార్గం**

ఇదిలా ఉండగా వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కీలక దౌత్యపరమైన ఒప్పందాన్ని ఆదివారం ప్రకటించారు. ఈ ఒప్పందం పశ్చిమాసియాకు శాంతి, భద్రతలను తీసుకురావడంతో పాటు ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి మార్గం సుగమం చేస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. ప్రపంచ నౌకలారా, మీ ఇంజిన్లను ప్రారంభించండి. చమురు ప్రవహించనివ్వండి" అంటూ ట్రూత్ సోషల్ వేదికగా ఆయన వ్యాఖ్యానించారు.

**తుది ఒప్పందం కోసం 60 రోజుల చర్చలు**

ఈ ప్రకటన అనంతరం ఇరాన్ న్యాయ, అంతర్జాతీయ వ్యవహారాల ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరీబాబాది కూడా శాంతి ఒప్పందాన్ని ధ్రువీకరించారు. శత్రుత్వాలకు



ముగింపు పలకడం, ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయడం, ఇరాన్‌కు చెందిన ఆస్తులను విడుదల చేయడం వంటి అంశాల అమలుపై స్పష్టత వచ్చిన తర్వాతే తుది ఒప్పందం కోసం 60 రోజుల చర్చల ప్రక్రియలో పాల్గొంటామని ఆయన తెలిపారు. అలాగే శాంతి ఒప్పందంపై శుక్రవారం స్విట్జర్లాండ్‌లో అధికారిక సంతకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

**శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం మద్దతు**

ఈ పరిణామాలపై స్పందించిన భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్, అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని భారత్ స్వాగతిస్తోందన్నారు. "ఈ ఒప్పందంతో హర్మూజ్ జలసంధిలో నౌకాయానం నిరాటంకంగా కొనసాగుతుందని ఆశిస్తున్నాం. శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం చేపట్టే ప్రతి చర్యకు భారత్ మద్దతుగా ఉంటుంది. ఈ పరిణామాలను స్ఫూర్తిగా తీసుకుని రష్యా-ఉక్రెయిన్ కూడా శాంతి ప్రయత్నాల దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షిస్తున్నాం" అని పేర్కొన్నారు.

**హర్మూజ్‌లో నౌకాయాన స్వేచ్ఛ**

అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని ప్రపంచ నాయకులు సైతం స్వాగతించారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ఈ పరిణామాన్ని సానుకూలంగా అభివర్ణించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇది అత్యంత అవసరమని పేర్కొంటూ, హర్మూజ్ జలసంధి గుండా నౌకాయాన స్వేచ్ఛను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని పిలుపునిచ్చారు.

**అమెరికా, ఇరాన్ మధ్య చారిత్రాత్మక ఒప్పందం**

అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఈ చారిత్రాత్మక ఒప్పందం పశ్చిమాసియాలో స్థిరత్వాన్ని పునరుద్ధరించడమే కాకుండా, ప్రపంచ ఇంధన మార్కెట్లపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు, ఆర్థిక వృద్ధికి ఊతమివ్వడానికి, అలాగే ఇరాన్ అణు కార్యక్రమంపై కొనసాగుతున్న ఆందోళనలకు దౌత్యపరమైన పరిష్కారం దిశగా కీలక అడుగుగా నిలుస్తుందని అంతర్జాతీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**వాషింగ్టన్-టెహ్రాన్ ఒప్పందంలో జాప్యం!**

కాగా ఈ ఒప్పందం నేపథ్యంలో మరో వివాదం తెరపైకి వచ్చింది. ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు దెబ్బతీయడానికి ప్రయత్నించారని ట్రంప్ ఆరోపించారు. లెబనాన్ రాజధాని బీరూట్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడి కారణంగానే వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య ఒప్పందం కుదరడంలో జాప్యం జరిగిందని విమర్శించారు. 'ది న్యూయార్క్ టైమ్స్' ప్రతినిధులతో ఫోన్ సంభాషణ సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## భారత అమ్ములపొదిలో మరో శక్తిమంతమైన అస్త్రం..



భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో కీలక మైలురాయిని అధిగమించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన లాంగ్ రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ క్షిపణి (ఎల్ఆర్ఎల్ఏసీఎం)ని సోమవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ ఫ్లైట్-టెస్ట్ నిర్వహించారు. ఈ ప్రయోగం నిర్దేశించుకున్న అన్ని లక్ష్యాలను పూర్తిగా చేరుకుందని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా క్షిపణి గమనాన్ని పర్యవేక్షించినట్లు పేర్కొంది. ఈ విజయంతో సుదూర లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించే భారత సామర్థ్యం మరింత పెరిగినట్లయింది. రక్షణ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ రాజేష్ కుమార్ సింగ్‌తో పాటు భారత నౌకాదళం, వాయుసేనకు చెందిన ఉన్నతాధికారులు ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. ఎల్ఆర్ఎల్ఏసీఎం క్షిపణిని విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీఓ బృందాన్ని, పరిశ్రమ భాగస్వాములను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. డీఆర్‌డీఓ ప్రయోగశాలలు, భారత పరిశ్రమ భాగస్వాములతో కలిసి ఈ క్షిపణిలోని అన్ని ఉపవ్యవస్థలను దేశీయంగానే అభివృద్ధి చేశాయి. బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏడీఈ) నోడల్ లేబొరేటరీగా వ్యవహరించింది. ఈ విజయం 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో కీలక ముందడుగు అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రెండు రోజుల క్రితమే డీఆర్‌డీఓ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ (బీఎండీ), యాంటీ-షిప్ క్షిపణులను వరుసగా పరీక్షించిన విషయం తెలిసిందే.

# కేవలం వ్యవస్థ వైఫల్యం కాదు

పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దు కేవలం ప్రభుత్వ వ్యవస్థల వైఫల్యం మాత్రమే కాదని, కోట్ల మంది భారత యువతీయువకుల కలలపై జరిగిన దాడి అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజస్థాన్‌లోని కోటాలో త్వరలో జరగనున్న విద్యార్థి సదస్సుకు ముందు ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఎక్స్ వేదికగా హిందీలో ఓ పోస్టు పెట్టిన రాహుల్ గాంధీ, విద్యార్థులకు వారి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కడం లేదని, దానికి బదులుగా కలలు కన్నందుకు శిక్ష అనుభవిస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. "దేశంలోని ప్రతి యువకుడికి నేను ఒక విషయం చెప్పాలని అనుకుంటున్నాను. ఈ రోజు ఈ దేశంలో మీరు పొందుతున్నది కష్టానికి తగిన ప్రతిఫలం కాదు. కలలు కనే ధైర్యం చేసినందుకు మీకు శిక్ష లభిస్తోంది. ప్రతి పేపర్ లీక్?, ప్రతి రద్దు అయిన పరీక్ష, ప్రతి నిలిచిపోయిన రిక్రూట్‌మెంట్?- ఇవి కేవలం వ్యవస్థ వైఫల్యాలు మాత్రమే కాదు, కోట్లాది మంది విద్యార్థులపై జరిగిన దాడి. మీరు అలసిపోయారని నాకు తెలుసు. మీరు కోపంతో రగిలిపోతున్నారని కూడా తెలుసు. కానీ ఒక్కటి గుర్తుంచుకోండి. ప్రభుత్వం సమస్యలు వినడానికి నిరాకరించినప్పుడు, మీరు మీ స్వరాన్ని మరింత గట్టిగా వినిపించాలి. అందుకే నేను పిలుపునిస్తున్నాను. జూన్? 17న కోటాలో విద్యార్థుల గళం వినిపిద్దాం. మనమందరం కలిసి సింహగర్జన చేద్దాం. దాన్ని ఎవరూ నిర్లక్ష్యం చేయలేరు. ఇది కోటా నుంచి ప్రారంభమై, దేశంలోని ప్రతి మూలకు చేరుకుంటుంది." యువత భవిష్యత్తు కోసం చేస్తున్న పోరాటం! ఇది యువత భవిష్యత్తు కోసం చేస్తున్న పోరాటమని, తాను ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. మరోవైపు పేపర్ లీకేజీలు, పరీక్షల అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమానికి కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఇందుకోసం మొదటి దశలో రాహుల్ గాంధీ విద్యార్థి సదస్సులు ప్రారంభిస్తారని ప్రకటించింది. ఇందులో భాగంగానే మొదటి సదస్సు జూన్? 17న కోటాలో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది.



రాజకీయాలకు అతీతంగా విద్యార్థులు అందరినీ ఏకం చేయడం, బాధితులైన యువత తమ అనుభవాలను పంచుకోవడం కోసం ఒక వేదికను కల్పించడమే ఈ ఉద్యమ ముఖ్య ఉద్దేశమని పేర్కొంది. వరుస పరీక్షల వైఫల్యాలు, పేపర్ లీక్ స్కామ్‌?ల విషయంలో ప్రభుత్వాన్ని జవాబుదారీగా మార్చడమే తమ లక్ష్యమని స్పష్టం చేసింది.

**రాహుల్ షెడ్యూల్ ఇదే!**

రాహుల్ గాంధీ వరుసగా పెద్ద ఎత్తున విద్యార్థి సదస్సులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. జూన్ 17న కోట, జులై 10న అలహాబాద్?, జులై 11న పట్నా, జులై 14న ఢిల్లీలో ఈ సదస్సులు జరుగనున్నాయి. విద్యార్థులు, ఉద్యోగార్థులు, యువజన సంఘాలు, విద్యావేత్తలు, ఈ పరీక్షల కుంభకోణాల వల్ల నేరుగా నష్టపోయిన వారందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే దీని లక్ష్యం. పేపర్ లీకేజీలు, పెరుగుతున్న పరీక్షల ఖర్చులు, పారదర్శకంగా ఉద్యోగాల నియామకాలు, సరైన విద్యావ్యవస్థను అందించడంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపి, కోట్లాది మంది భారత యువత భవిష్యత్తు ఎలా ప్రమాదంలో పడుతుందో అందరికీ తెలియజేస్తుందని లక్ష్యంగా కాంగ్రెస్ ఈ ఉద్యమాన్ని చేపట్టింది. ఈ దేశవ్యాప్త ప్రచారం కోసం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్?ఎస్?యూఐ), యూత్ కాంగ్రెస్?, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలు (పీసీసీ), జిల్లా కాంగ్రెస్ కమిటీలు, దేశవ్యాప్తంగా ఉన్న స్థానిక విభాగాల ద్వారా విద్యార్థులను పెద్ద ఎత్తున సమీకరించాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఇదే విషయాన్ని పునరుద్ఘాటించింది.

**నీట్ అభ్యర్థులకు చుక్కలు చూపిస్తున్న ఎన్?టీఏ**

మరోవైపు నీట్ అభ్యర్థులకు ఎన్?టీఏ చుక్కలు చూపిస్తోంది. ఈ నెల 21న నీట్? రీ-ఎగ్జామ్? జరుగుతుందని ప్రకటించారు. కానీ నీట్ పోర్టల్ మాత్రం మొరాయిస్తోంది. దీనితో అభ్యర్థులు అడ్మిట్ కార్డులు డౌన్?లోడ్ చేసుకోలేకపోయారు. దీంతో ఎన్?టీఏ మరో లింక్?ను అందుబాటులోకి తెచ్చింది. అయితే అది కూడా సరిగ్గా పనిచేయలేదు. ఫీజ్ రీఫండ్ ఆప్షన్ మరోసారి తనిఖీ చేయండి అంటూ సందేశం కనిపించింది. కానీ బ్యాంకు వివరాల సమోదుకు వెళ్లే, పాత వివరాలు ఏమీ కనిపించడం లేదు. దీనితో రీఫండ్ అవసరం లేకపోతే ముందుకు వెళ్లాలని వెబ్?సైట్?లో సందేశం కనిపించింది. దీనితో రీఫండ్ ఇవ్వకుండా ఎగ్గొట్టేందుకు ఎన్?టీఏ ఈ ఎత్తుగడ వేసిందని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శలు గుప్పిస్తున్నారు.

**నిందితుడు అరెస్టు**

కాగా, నీట్ అభ్యర్థుల పాస్?వర్డులు, పిన్?లను పోర్టల్ నుంచి దొంగిలించి వారి బ్యాంకు ఖాతాల నుంచి రీఫండ్? సొమ్మును కాజేస్తున్న నిందితుడిని అహ్మదాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనిని బిహార్?కు చెందిన 19 ఏళ్ల నవీన్? యాదవ్?గా గుర్తించారు. "బ్రూట్?-ఫోర్స్ అటాక్? ద్వారా నిందితుడు ఆయా ఖాతాల పాస్?వర్డులు, ఎన్?క్రిప్షన్ కీలు, పిన్?లు క్రాక్ చేశాడు. ఆ తర్వాత విద్యార్థుల ప్రొఫైల్?తో లింకైన బ్యాంకు ఖాతా వివరాలు తొలగించి, తన ఖాతా వివరాలు అప్?డేట్ చేశాడు. దీని వల్ల ఒక్కొక్క విద్యార్థులకు అందాల్సిన 17 వందల రూపాయలు అతని ఖాతాలో జమ అయ్యాయి. నిందితుడు 350 మందికి పైగా విద్యార్థులను లక్ష్యంగా చేసుకోగా, అందులో సుమారు 150 ఖాతాలను యాక్సెస్? చేయగలిగాడు" అని పోలీసులు తెలిపారు.

## కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు

## అభిజిత్ దీప్కేపై దాడి

రాజస్థాన్‌లో కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేపై దాడి జరిగింది. నీట్‌తో సహా వివిధ జాతీయ పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జయపూర్‌లో సీజేపీ ఆందోళనలు చేపట్టింది. ఈ ఆందోళనలో పాల్గొన్న అభిజిత్ దీప్కేపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. అతని చెంపపై కొట్టారు. అభిజిత్‌ను కొట్టిన వ్యక్తులపై సీజేపీ కార్యకర్తలు మూకుమ్మడి దాడి చేశారు. "సీజేపీ నిరసన ప్రదర్శన సమయంలో కొందరు వ్యక్తులు అభిజిత్? దీప్కేపై దాడి చేసి, చెంపదెబ్బలు కొట్టారు. దీప్కే మద్దతుదారులు ఆయనను తమ భుజాలపై మోసుకెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. దాడి చేసిన వారిలో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నాం. తదుపరి విచారణ కొనసాగుతోంది" అని పోలీసులు తెలిపారు. ప్రత్యక్ష సాక్షులు చెబుతున్న వివరాల ప్రకారం, దీప్కే నిరసన జరుగుతున్న స్థలానికి చేరుకోగానే, మద్దతుదారులు ఆయనను తమ భుజాలపైకి ఎత్తుకున్నారు. అదే సమయంలో గుంపులో ఉన్న కొందరు యువకులు ఒక్కసారిగా ఆయనపైకి దూసుకొచ్చి చెంపదెబ్బలు కొట్టారు. దీనితో దీప్కే మద్దతుదారులు సదరు నిందితులను పట్టుకొని, వారిపై ఎదురుదాడి చేశారు. దీనితో పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత నిరసనకారులు అవినీతికి, పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా నినాదాలు రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ, ఈ సమస్యలపై తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

**ఇది పిరికితనానికి నిదర్శనం**

ఈ ఘటనపై స్పందించిన అభిజిత్ దీప్కే, భౌతిక దాడులు పిరికితనానికి నిదర్శనమని చెప్పారు. ఇలాంటి దాడులకు భయపడేది లేదని, ప్రజా సమస్యలపై శాంతియుత మార్గంలో తమ గళాన్ని వినిపిస్తూనే ఉంటామని ఎక్స్ వేదికగా తెలిపారు. "భౌతిక దాడులు భయం, పిరికితనానికి సంకేతం. మేము శాంతియుతంగా మా గళాన్ని వినిపిస్తూనే ఉంటాం. నేను గాంధీ, అంబేద్కర్ అనుచరుడిని. శాంతి, ప్రేమతో ఈ పోరాటాన్ని కొనసాగిస్తాను. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. "

**బొట్టింక వేసంలో ధర్నా**

మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో దీపక్ శర్మ అనే సామాజిక కార్యకర్త వినూత్నంగా ధర్నా చేశారు. గంగా, యమున నదుల్లోకి మురికి నీటిని వదలడాన్ని వ్యతిరేకిస్తూ, ప్రయాగ్‌రాజ్ మున్సిపల్ ఆఫీస్ ముందు, బొద్దింక డ్రెస్ వేసుకొని నిరసన తెలిపారు. "ఈ రెండు పవిత్ర నదుల్లోకి మురికి నీరు, విషపూరిత రసాయనాలు కలుస్తున్నాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకే నేను బొద్దింక వేషం వేసుకొని నిరసన తెలిపాను. బృందావన్ నుంచి ప్రయాగ్‌రాజ్ సంగమం వరకు ఉన్న నదుల్లో మురికి నీరు కలవకుండా ఆపడంలో యూపీ జల్ నిగమ్, కాలుష్య నియంత్రణ బోర్డు, ప్రభుత్వ కార్యాలయాలు పూర్తిగా విఫలమయ్యాయి" అని దీపక్ శర్మ చెప్పారు. మథుర-బృందావన్ మున్సిపల్ కార్పొరేషన్ ఇచ్చిన ఓ లెటర్‌ను చూపిస్తూ, "మురుగు కాలువల నీటిని మళ్లించడం, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్వహణ బాధ్యత అంతా యూపీ జల్ నిగమ్‌దేనని సదరు సంస్థ ఒప్పుకుంది. అయినప్పటికీ సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలు పట్టించుకోకుండా, చాలా కాలువల మురికినీటిని నేరుగా యమునా నదిలోకి వదిలేస్తున్నారు. ఈ జల కాలుష్యం వల్ల త్రివేణి సంగమం ప్రాంతంలో పాడైపోతోంది. నదిలోని చేపలు, ఇతర జీవులు చనిపోతున్నాయి" అని దీపక్ శర్మ ఆవేదన వ్యక్తం చేశారు. నదుల్లో మురికి నీరు కలవకుండా 100 శాతం అడ్డుకోవాలని, తప్పు చేసిన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు 15 రోజుల్లోగా ఈ పని చేయాలని ఆయన కోరారు. ఈ లోగా సమస్యను పరిష్కరించకపోతే, తాను హైకోర్టుకు వెళ్తానని, ఈ ఉద్యమాన్ని రాష్ట్ర స్థాయికి తీసుకెళ్తానని హెచ్చరించారు.

# ఇజ్రాయెల్‌కు మోదీ సర్కార్ బ్లైండ్ సపోర్ట్

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకు ముగింపు పలికే దిశగా అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. అయితే ఈ పరిణామాలను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై తీవ్ర విమర్శలు గుప్పించింది. అయితే ఈ పరిణామం భారత్ ఎదుర్కొంటున్న ఆర్థిక, విదేశాంగ సవాళ్లకు పూర్తి పరిష్కారం కాదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అభిప్రాయపడ్డారు. పాకిస్థాన్, ప్రస్తుతం మళ్లీ ప్రాంతీయ, ప్రపంచ రాజకీయాల్లో ప్రభావాన్ని పెంచుకుంటోందని, ఇది భారత్‌కు సవాల్‌ను విసురుతోందని అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జూన్ 19న జెనీవాలో ఒక ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉండన్న సమాచారం సానుకూల పరిణామని జైరాం రమేశ్ అన్నారు. అయితే ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెలువడకపోయినా, ఈ చర్య ప్రాంతీయ స్థిరత్వానికి దోహదపడుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందాన్ని అమెరికా, ఇరాన్ మాత్రమే కాకుండా ఇజ్రాయెల్ కూడా గౌరవిస్తే పరిస్థితులు మరింత మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. తాత్కాలిక ఒప్పందంగా ప్రారంభమైనా, భవిష్యత్తులో శాశ్వత శాంతి, సాధారణ సంబంధాల పునరుద్ధరణకు ఇది మార్గం సుగమం చేయాలని ప్రపంచవ్యాప్తంగా ఆకాంక్షలు ఉన్నాయని పేర్కొన్నారు.

**హర్మూజ్ తెరవడం భారత్‌కు ప్రయోజనం**

ప్రపంచ చమురు రవాణాలో కీలక పాత్ర పోషించే హర్మూజ్?ను పూర్తిస్థాయిలో తిరిగి తెరవబడితే భారత్‌కు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని జైరాం



అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఇంధన దిగుమతులపై ఆధారపడే భారత ఆర్థిక వ్యవస్థకు ఇది అనుకూల ప్రభావం చూపుతుందని తెలిపింది. అయితే, ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న నిర్మాణాత్మక సమస్యలకు ఈ పరిణామం ఒక్కటే పరిష్కారం కాదని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం ప్రారంభానికి ముందే రూపాయి విలువపై ఒత్తిడి పెరిగిందని, డాలర్ డిమాండ్-సరఫరా మధ్య అంతరం విస్తరించిందని గుర్తుచేశారు.

**ఆర్థిక వ్యవస్థపై ఆందోళనలు**

దేశీయ డిమాండ్ మందగించడం వల్ల ప్రైవేట్ పెట్టుబడులు బలహీనంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. గత దశాబ్ద కాలంగా వాస్తవ వేతనాల్లో పెద్దగా పెరుగుదల లేదని ఆరోపించారు. అదేవిధంగా చైనా నుంచి దిగుమతులను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దీంతో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడకపోవడంతో పరిశ్రమల విస్తరణ కూడా ఆశించిన స్థాయిలో జరగలేదని విమర్శించారు. అదేవిధంగా చైనా నుంచి దిగుమతులను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వ విఫలమైందని విమర్శించారు. పన్ను శాఖలు, దర్యాప్తు సంస్థలకు ఉన్న విస్తృత అధికారాలు పెట్టుబడిదారుల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని కూడా ఆయన ఆరోపించారు.

**మోదీ విదేశాంగ విధానంపై విమర్శలు**

ఇజ్రాయెల్ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. ఇజ్రాయెల్‌కు మోదీ ప్రభుత్వం "గుడ్డి భక్తి"తో, బేషరతుగా మద్దతు ఇస్తోందని జైరాం రమేశ్ ఆరోపించారు. "మోదీ తన వైఖరిని మార్చుకుంటారని ఆశించడం చాలా ఎక్కువ అవుతుంది. కానీ మానవతా దృక్పథం, భారతదేశం గతంలో అనుసరించిన విధానాలు మాత్రమే కాదు, దేశ జాతీయ ప్రయోజనాల దృష్ట్యా కూడా ప్రస్తుతం కనిపిస్తున్నదానికంటే మరింత సమతుల వైఖరి అవసరం" అని వ్యాఖ్యానించారు.

**పాకిస్థాన్ ప్రభావం పెరిగిందన్న కాంగ్రెస్**

2008 ముంబయి ఉగ్రదాడుల అనంతరం భారత్ అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్‌ను ఒంటరిని చేయడంలో విజయం సాధించిందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం పాకిస్థాన్ ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిలో మళ్లీ ప్రభావాన్ని పెంచుకుంటున్నట్లు కనిపిస్తోందని అన్నారు. చైనాతో పాకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడటం భారత్‌కు కొత్త భౌగోళిక-రాజకీయ సవాళ్లను సృష్టిస్తోందన్నారు. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని భారత విదేశాంగ విధానం మరింత చురుకుగా, సమతుల్యంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు.

## తుదిదశలో అహ్మదాబాద్ విమాన ప్రమాద దర్యాప్తు

అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి సంబంధించిన దర్యాప్తు తుది దశలో ఉందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. అంతర్జాతీయ దర్యాప్తు విధానాలను (ప్రోటోకాల్‌లను) కచ్చితంగా పాటిస్తూ ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) త్వరలోనే తన తుది నివేదికను సమర్పించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ఏఏఐబీ తుది నివేదిక కోసం తామంతా ఎదురుచూస్తున్నామని వెల్లడించారు. "ఎయిర్ ఇండియా ఏఐ×-171 విమాన ప్రమాదానికి సంబంధించిన దర్యాప్తు తుది నివేదిక కోసం మేమంతా ఎదురుచూస్తున్నాం. ఏఏఐబీ ఈ దర్యాప్తు ప్రక్రియను అనవసరంగా వేగవంతం చేయాలని అనుకోవడం లేదు. అంతర్జాతీయ దర్యాప్తు విధానాలను (ప్రోటోకాల్‌లను) చాలా కచ్చితంగా పాటించాలనుకుంటోంది. ఇది అంతర్జాతీయ దర్యాప్తు విధానంలోని ఏ దశనూ విస్మరించట్లేదు. ఏఏఐబీ విమాన ప్రమాద దర్యాప్తుపై చాలా క్షుణ్ణంగా దృష్టి సారిస్తోంది. అందుకే కాస్త సమయం తీసుకుంటోంది. అయితే ఎయిర్ ఇండియా విమాన దుర్ఘటనకు సంబంధించిన దర్యాప్తు చివరి దశలో ఉండడంతో ఇటీవలే ఏఏఐబీ ఒక ప్రకటన విడుదల చేసింది. దర్యాప్తును పూర్తి చేసి, త్వరలోనే మాకు తుది నివేదికను ఏఏఐబీ సమర్పించవచ్చు."

**విమాన దుర్ఘటనలో 260 మంది మృతి**

కాగా, గతేడాది జూన్ 12న అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ఎయిర్ ఇండియా ఏఐ×-171 విమానం ప్రమాదానికి గురైంది. ఓ హాస్టల్ భవనంపై కుప్పకూలింది. ఈ ఘటనలో 229 మంది విమాన ప్రయాణికులు, 12 మంది సిబ్బంది, 19 మంది విద్యార్థులు సహా మొత్తం

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137